గురువారం
21-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 60
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్ ఆరవ ప్రయోగం

లాస్ ఏంజిల్స్: స్పేస్ ఎక్స్ సంస్థ స్టార్‌షిప్ రాకెట్‌కు ఆరవ ఫ్లైట్ టెస్ట్ నిర్వహించింది. అమెరికా, టెక్సాస్ రాష్ట్రంలోని బ్రౌన్స్‌విల్లేలోని కంపెనీ అంతరిక్ష కేంద్రం నుంచి స్టార్‌షిప్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగించిన చాలా సేపు తర్వాత సూపర్ హెవీ బూస్టర్ లాండింగ్ ప్రక్రియ మొదలైంది.

గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోకి రాకెట్ కూలిపోయింది. అంతరిక్షంలో ఉండగా రాప్టర్ ఇంజిన్‌లలో ఒకదానిని స్టార్‌షిప్ మొదటిసారి విజయవంతంగా ప్రజ్వలింపజేసింది. ప్రయోగించిన గంటా ఐదు నిమిషాలకు స్టార్‌షిప్ సముద్రంలో పడింది. కాగా అక్టోబరు 13న స్టార్‌షిప్ రాకెట్ ఐదవ టెస్ట్ ఫ్లైట్‌ను స్పేస్ ఎక్స్ పూర్తి చేసింది.

కారు సెన్సార్లనూ తయారు చేయగలం

బెంగళూరు: రాకెట్ సెన్సార్లే కాదు... కారు సెన్సార్లనూ భారత్ తయారు చేయగలదని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగానే కారు సెన్సార్లు తయారు చేసుకోవడం మంచిదని సూచించారు. ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు పారిశ్రామిక సహకారం ముఖ్యమని చెప్పారు. అంతరిక్ష సాంకేతికత, రక్షణపై బెంగళూరు టెక్ సదస్సులో సోమనాథ్ బుధవారం మాట్లాడుతూ వ్యయం తగ్గించే ఉత్పత్తి మార్గాలు అన్వేషించడం అవశ్యమన్నారు. రాకెట్ సెన్సార్ల

- మిగతా 2 లో

అమెరికా జైల్లో అన్మోల్ బిష్ణోయ్

వాషింగ్టన్: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్‌ను అయోవా రాష్ట్రంలోని పొట్టవాట్టయ్ కౌంటీ జైలుకు తరలించారు. ఇతడిపై పంజాబ్, ముంబై, ఢిల్లీలో దాదాపు 20 కేసులు ఉన్నాయి. మనీ లాండరింగ్ చేస్తున్నాడనే అనుమానంతో అతడిపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. తొలుత అన్మోల్‌ను కాలిఫోర్నియాలో అరెస్టు చేసినట్లు ప్రచారం జరిగింది. కానీ, తాజాగా అతడు అయోవా రాష్ట్రంలోని జైల్లో ఉన్నట్లు తేలింది. అతడి వద్ద ఉన్న ఇండియన్ పాస్‌పోర్టు ఆధారంగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని భారత దౌత్య అధికారులు

- మిగతా 2 లో

ఆసియా చాంపియన్ భారత్

చైనాపై మహిళా హాకీ జట్టు గెలుపు

న్యూఢిల్లీ: ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ మహిళా జట్టు ఘన విజయం సాధించింది. ఫైనల్‌లో 1-0తో చైనాను ఓడించింది. దీపిక 31వ నిమిషంలో గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. మూడో క్వార్టర్ ఆరంభంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను దీపిక గోల్‌గా మలిచింది. భారత్ ఈ టైటిల్‌ను దక్కించుకోవడం ఇది మూడోసారి. చైనా మూడో రన్నరప్‌గా నిలిచింది. జపాన్ 4-1తో మలేసియాను ఓడించి మూడో స్థానం దక్కించుకుంది.

ఇదీ లోకం!

లెక్కలో ఒక్కటి తగ్గినా క్షమాపణకు సిద్ధం

- 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు
- కొడంగల్ అంటే ఎందుకంత కక్ష
- 'కొండపోచమ్మ' కట్టింది బావ ఆనందానికే
- అసెంబ్లీకి రా సామీ... కేసీఆర్‌కు వినతి
- వేములవాడ సభలో బీఆర్ఎస్‌పై రేవంత్ ధ్వజం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 50వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు లెక్కకట్టి చూపిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాము చెప్పిన లెక్కల్లో ఒక్కటి తగ్గినా తాను క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో... మేం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో చర్చకు సిద్ధమా అంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. వేములవాడలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ... ఆనాడు పాదయాత్రలో తాను ఇచ్చిన మాట ప్రకారం వేములవాడను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. మిడ్ మానేరు ముంపు బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని ఆనాడే మాట ఇచ్చామని, కలికోట సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేస్తామని

చెప్పామని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు... కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పూర్తవుతాయని ఆనాడే చెప్పానని అందుకు అనుగుణంగా ఈ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ నెల 30లోగా జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచే సోనియమ్మ మాట ఇచ్చారు, మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ బీజేపీని గెలిపిస్తే జిల్లాకు ఏం ఒరిగింది, కరీంనగర్ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించారా... జిల్లా అభివృద్ధికి చిల్లి గవ్వ తెచ్చారా అని ప్రశ్నించారు. పదేళ్లలో 20 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ ... రూ.100 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి ఎందుకు చేయలేదని ధ్వజమెత్తారు. ప్రమాదవశాత్తు మరణించిన గల్ఫ్ కార్మికులకు రూ.ఐదు లక్షల ప్రమాదబీమా అందిస్తున్నట్లు ప్రకటించారు. మీ నొప్పికి మందు ఎక్కడ పెట్టాలో మా కార్యకర్తలకు తెలుసంటూ చురకంటించారు. రుణమాఫీపై దుష్ప్రచారం చేసున్న మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రా... అక్కడే మంత్రి సమాధానం చెబుతారన్నారు. ఆనాడు వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన చరిత్ర కేసీఆర్ దని మండిపడ్డారు. ఇప్పుడు కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రాజెక్టుల కోసం లక్ష 23 వేల కోట్లు ఖర్చు చేశారు, ఏ ప్రాజెక్టునైనా పూర్తిచేశారా.. ప్రజలకు నీళ్లు ఇచ్చామని చెప్పగలరా అంటూ నిలదీశారు. రంగనాయక్ సాగర్ కోసం సేకరించిన భూముల్లో హరీశ్ రావు

- మిగతా 2 లో

ఏడాదిలోనే రూ.694 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాపాలన తొలి ఏడాదిలోనే మొత్తం రూ.694.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.76 కోట్లతో చేపట్టే శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద శంకస్థాపన, రూ.35.25 కోట్లతో చేపట్టే అన్నదానం సత్రం నిర్మాణానికి శ్రీకారం, రూ.45 కోట్లతో మూల వాగు బ్రిడ్జి నుంచి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, రూ.166 కోట్లతో వైద్య కళాశాల, హాస్టల్ బ్లాక్ నిర్మాణ పనులకు భూమి పూజ , రూ.50 కోట్లతో నూలు డిపో నిర్మాణ పనులకు శ్రీకారం, రూ.52 కోట్లతో కొనరావుపేట మండలంలో హై లెవెల్ బ్రిడ్జి పనులు, రూ.మూడు కోట్లతో డ్రెయిన్ పనులకు శంకుస్థాపన,. రూ.235 కోట్లతో 4696 మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు ఇచ్చే ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ, మేడిపల్లిలో జూనియర్ కళాశాల, రుద్రంగిలో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రానికి శంకుస్థాపన, సిరిసిల్లలో రూ. 26 కోట్లతో నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనం, వేములవాడలో రూ.కోటి 45 లక్షలతో నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనం, రూ. నాలుగు కోట్ల 80 లక్షలతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనం ప్రారంభించారు. గల్ఫ్‌లో మరణించిన 17 కుటుంబాలకు రూ.85 లక్షల పరిహారం, 631 శివశక్తి మహిళా సంఘాలకు రూ.102 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కు పంపిణీ చేశారు.



బీజేపీ కూటమిలో ముసలం

- మణిపూర్ సీఎంపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి
- ఎన్‌డీఏ భేటీకి 19 మంది డుమ్మా
- శాంతిభద్రతల వైఫల్యంపై ఆగ్రహం

గువహతి/ఇంఫాల్: అశాంతి, కర్ఫ్యూ సడలింపు, ప్రజలు నిత్యావసరాల కోసం పరుగెత్తటం నడుమ మణిపూర్‌లో బీజేపీ నేతృత్వంలోని కూటమిలో చీలికలు మరింత పెరిగాయి. జాతి ఘర్షణలపై సమీక్షించడానికి సోమవారం జరిగిన ఎన్‌డీఏ సమావేశానికి 37 మంది బీజేపీ ఎమ్మెల్యేలలో 19 మంది హాజరుకాకపోవడంతో బీరెన్ సింగ్ ప్రభుత్వంలో కొనసాగుతున్న కలహాలు బట్టబయలయ్యాయి. బీజేపీ మణిపూర్ విభాగంలోనూ విభేదాలు తీవ్రమయ్యాయి. జిరిబామ్‌లో వలసపోయిన వారి కోసం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంలో ఉన్న ఆరుగురు మెయితీలను చంపినట్లు అనుమానిస్తున్న 'కుకీ మిలిటెంట్లకు' వ్యతిరేకంగా పూర్తిస్థాయిలో పోరాడాలని ఎన్‌డీఏ సమావేశం తీర్మానించింది.

సమావేశానికి గైర్హాజరైనందుకు మంత్రులు సహా 11 మంది ఎన్డీఏ సభ్యులకు ముఖ్యమంత్రి సచివాలయం నోటీసులు అందజేసినట్లు ధృవీకరించని వార్తలు బయటకొచ్చాయి. అదేసమయంలో 'ప్రజలను రక్షించడానికి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ అవసరమైన చర్యలు తీసుకుంటారు' ని ప్రతిజ్ఞ చేస్తూ ఒక వీడియో సందేశాన్ని

- మిగతా 2 లో

అబద్ధాలు ఆడడమే రేవంత్ రెడ్డి డీఎన్ఏ: హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: అబద్ధాలు అడడమే రేవంత్ రెడ్డి డీఎన్ఏ అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రతిపక్షంపై పగ, ప్రజలకు దగా... ఇది రేవంత్ రెడ్డి తీరు అని దుయ్యబట్టారు. మహబూబ్ నగర్ జిల్లా కూరుమూర్తి స్వామిని బుధవారం దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనబడ్డ దేవుడిపైన, మసీదు... చర్చిపైన ప్రమాణం చేసి రుణమాఫీ చేస్తానని రేవంత్ మాట ఇచ్చి తప్పాడని మండిపడ్డారు. పాలమూరు పేరు చెడగొడుతున్నాడన్నారు. పంద్రాగస్టు లోపల పూర్తిస్థాయి రుణమాఫీ చేసుంటే రైతుల కోసం తాను రాజీనామా చేసేవాడిని అని చెప్పారు. ఎన్ని తిట్లు అయినా తాము భరిస్తాం కానీ ప్రజలను మోసం చేస్తే మాత్రం ఊరుకోమన్నారు. నువ్వు ఎనుముల రేవంత్ రెడ్డివి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డివి అంటూ

- మిగతా 2 లో

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక సక్రమ అమలుకు చర్యలు

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధులకు సంబంధించి 32 శాఖల పనితీరుపై ఆయన సమీక్షించారు. శాఖల వారీగా కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు, గత ఏడాది ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం అన్ని శాఖల్లో ఒక విధానం అవసరమని, దీని అమలుకు సపోర్ట్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని, ఈ

- మిగతా 2 లో

5.8 కోట్ల రేషన్ కార్డుల తొలగింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల భారం తగ్గించుకునేందుకు కేంద్రం అనేక గిమ్మిక్కులకు తెరతీసింది. ఆధార్ ధృవీకరణ, ఈకేవైసీ అనుసంధానంతో కోట్లాది నకిలీ రేషన్ కార్డులు ఏరివేసినట్టు చెప్పుకుంటోంది. ప్రభుత్వ చర్యలతో కొంతమంది నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డిజిటలైజేషన్ వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీస్థాయిలో మార్పులు వచ్చాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. తద్వారా ఆహార భద్రతలో ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిచినట్టు వెల్లడించింది. ఈ

- మిగతా 2 లో

నగర ప్రథమ పౌరుడు మాట్లాడే భాష ఇదేనా?

గుంటూరు మేయర్ వ్యాఖ్యలపై హైకోర్టు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నగర ప్రథమ పౌరుడిగా బాధ్యతాయుత పదవిలో ఉంటూ అలాంటి పదజాలం వాడ వచ్చా? అసలు ఇదేం భాష అంటూ అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. కూటమి నేతలపై కావటి మనోహర్ నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక

- మిగతా 2 లో

పోలింగ్ ప్రశాంతం

- మహారాష్ట్రలో 58... జార్ఖండ్‌లో 67 శాతం
- ముంబైలో అత్యల్పంగా 49 శాతం నమోదు

ముంబై: మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. అయితే పట్టణ ఓటర్ల ఉదాసీనత ఎన్నికల కమిషన్‌కు సవాలుగా మిగిలిపోయింది. సాయంత్రం 5 గంటలకు ఎన్నికల సంఘం (ఈసీ) వివరాల ప్రకారం... ఒకే దశలో పోలింగ్ జరిగిన మహారాష్ట్రలో 58.22 శాతం పోలింగ్ నమోదయింది. దేశ ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబైలో అత్యల్పంగా 49.07 శాతం నమోదయింది. ఇది 2019లో 48.4 శాతం కంటే కేవలం 1 శాతం ఎక్కువ. అయితే రాష్ట్రంలోని గడ్చిరోలిలో అత్యధికంగా 69.63 శాతం పోలింగ్ నమోదయింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. రెండవ దశ పోలింగ్ సందర్భంగా జార్ఖండ్‌లో 67.59 శాతం పోలింగ్ నమోదయింది. జార్ఖండ్‌లోని జమ్తారాలో అత్యధికంగా 76.16 శాతం, బొకారోలో అత్యల్పంగా 60.97 శాతం పోలింగ్ నమోదయింది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నవంబరు 23న వెలువడనున్నాయి.

మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాటుపడింది. మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) అధికారంలోకి వచ్చేందుకు శాయశక్తులా పని చేసింది. రాష్ట్రంలోని రెండు ప్రధాన రాజకీయ కూటముల మధ్య పోరు హోరాహోరీగా ఉంది. కేంద్ర ఎన్నికల

- మిగతా 2 లో

ఎన్డీయేకే మొగ్గు

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎగ్జిట్ పోల్స్ అంచనా

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం చెదురు మదురు ఘటనల నడుమ ముగిశాయి. పోలింగ్ పూర్తి అయిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. రెండు రాష్ట్రాల్లో ఎన్డీయే గెలుపును అంచనా వేశాయి. మహారాష్ట్రలో మహాయుతికి రాష్ట్ర ప్రజలు మొగ్గు చూపినట్లు పేర్కొన్నాయి. జార్ఖండ్‌లోనూ కమలం వికసిస్తుందని అంచనాలు వేశాయి. మహారాష్ట్రలో మహా వికాస్ అగాడీ (ఎంవీయే)కి గెలుపు అవకాశాలు ఉన్నట్లు ఒకట్రెండు సర్వేలు వెల్లడించాయి. జార్ఖండ్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. సోరెన్ నేతృత్వ జేఎంఎం-కాంగ్రెస్ (ఇండియా ఐక్య సంఘటన) గెలుస్తుందని యాక్సిస్ మై ఇండియా పేర్కొంది.

మహారాష్ట్రలో...

మహావికాస్ అగాడీకి 147-155 స్థానాలు, మహాయుతికి 127-135, ఇతరులకు 10-13 స్థానాలు వస్తాయని ఎస్‌ఏఎస్ పోల్ అంచనా వేసింది. భాస్కర్ సర్వే కూడా ఎంవీయే గెలుస్తుందని

- మిగతా 2 లో

సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా
కమ్యూనిజం ప్రత్యేక సంచిక
డిసెంబర్ 1న వెలువడుతుంది

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు డిసెంబర్ 26 నుండి దేశవ్యాప్తంగా ప్రారంభమవుతున్న సందర్భంగా "కమ్యూనిజం" ప్రత్యేక సంచికగా 100 పేజీలతో తీసుకురావాలని ఎడిటోరియల్ బోర్డ్ నిర్ణయించింది. ఆమేరకు ఇప్పటికే ప్రత్యేక వ్యాసాలు, శీర్షికలతో పత్రిక ముద్రణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూరేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, అనుభవాలు, పోరాట ఘట్టాలు, పార్టీ తాత్విక, సైద్ధాంతిక ఆలోచనలు, ఉద్యమ పోరాట యోధుల అనుభవాలు రంగరించి ఈ పత్రిక రూపొందించడం జరుగుతున్నది. ముందుగా పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శులు ఆర్డర్ ఇచ్చిన మేరకు మాత్రమే ప్రింటింగ్ జరుగుతుంది. పత్రిక వెల 100/- రూపాయలు. డిసెంబర్ 5 లోపు ముందుగా ఆర్డర్ బుక్ చేసిన వారికి 50/- రూపాయలకు ఇవ్వటం జరుగుతుంది. మీ జిల్లాలకు ఎన్ని కాపీలు కావాలో వెంటనే తెలియజేసి ఆర్డర్ బుక్ చేయవలసిందిగా కోరుతున్నాము. ఈ సంచికను జిల్లాలలో, వివిధ ప్రాంతాలలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆవిష్కరణ చేసుకొనుటకు వీలుగా అందమైన కవర్ పేజీతో ప్రత్యేకంగా ముద్రించటం జరుగుతుంది. మీకు ఎన్ని కాపీలు కావలెనో తెలియజేస్తూ ముందుగా డబ్బులు చెల్లించవలెను. ఈ కింది నెంబరుకు వాట్సేఅప్ ద్వారా గాని, ఫోన్ ద్వారా గాని తెలియజేయగలరు. 9490952093. ఈ నెంబరుకు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం సౌకర్యం కలదు.

చలసాని వెంకట రామారావు
ఎడిటర్, "కమ్యూనిజం"

యుద్ధాల్లో గ్రీస్ జోక్యం వద్దు: కేకేఈ

ఏథెన్స్: ఉక్రెయిన్-పశ్చిమాసియా యుద్ధాల్లో గ్రీస్ ప్రభుత్వ జోక్యాన్ని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ఖండించింది. తక్షణమే తమ పాత్రను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడికి ఉక్రెయిన్‌కు అమెరికా-నాటో మద్దతు ప్రమాదకరమైన పరిస్థితులకు దారి తీస్తుందని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఒక ప్రకటనలో హెచ్చరించింది. నాటో-రష్యా మధ్య యుద్ధాన్ని మరింతగా విస్తరించే దిశగా సాగుతున్న అత్యంత ప్రమాదకరమైన ధోరణిగా తాజా చర్యను వర్ణించింది. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాల్లో గ్రీస్ ప్రభుత్వ జోక్యానికి యూరో అట్లాంటిక్ ఆర్క్ ఇతర పక్షాల మద్దతున్నట్లు తెలిపింది. పాలిటెక్నిక్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా పలస్తీనాకు మద్దతు ప్రకటిస్తూ, ఉక్రెయిన్-పశ్చిమాసియా యుద్ధాల్లో గ్రీస్ పాత్రను కేకేఈ ఆక్షేపించింది. యుద్ధాల్లో పాల్గొవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రీస్ వ్యాప్తంగా పెద్దఎత్తున సమ్మెలు నిర్వహించింది. వేలాది మంది పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యుద్ధాల్లో గ్రీస్ క్రియాశీల పాత్రను వ్యతిరేకించారు.

అమెరికా ఎంబసీపై రష్యా గురి

వాషింగ్టన్: ఉక్రెయిన్-రష్యా మధ్య పోరు మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇదే క్రమంలో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని రష్యా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలియడంతో అగ్రరాజ్యం అప్రమత్తమైంది. రష్యా వైమానిక దాడుల సమాచారం దృష్ట్యా కార్యాలయాన్ని ఆగమేఘాల మీద ఖాళీ చేయించింది. దానిని తాత్కాలికంగా మూసివేస్తూ ఓ ప్రకటన వెలువరించింది. దాడి జరుగుతుందని కచ్చితమైన సమాచారం ఉండటంతో సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించినట్లు పేర్కొంది. ఉక్రెయిన్‌లో ఉన్న తమ పౌరులను అప్రమత్తం చేసింది. ఇదిలావుంటే అమెరికా బాటలోనే మరికొన్ని దేశాలు తమ ఎంబసీలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ జాబితాలో స్పెయిన్, ఇటలీ, గ్రీస్ దేశాలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతకాలు చేసిన విషయం తెలిసిందే.

ఎన్డీయేకే మొగ్గు

(మొదటిపేజీ తరువాయి)

135-150 మధ్య స్థానాలు దక్కించుకుంటుందని, మహాయుతికి 125-140, ఇతరులకు 20-25 స్థానాలు వస్తాయని పేర్కొంది. కాగా, మహాయుతికి 150-170 స్థానాలు... ఎంవీయేకు 110-130 స్థానాలు రావచ్చని, ఇతరులకు 8-10 స్థానాలు దక్కవచ్చని మాట్రిజ్ అంచనా వేసింది. పీపుల్స్ పల్స్ ప్రకారం మహాయుతికి 182, ఎంవీయేకు 97, ఇతరులకు 9 స్థానాలు వస్తాయని వెల్లడైంది. సీఎన్ఎన్-న్యూస్ 18 ప్రకారం మహాయుతికి 182, ఎంవీయేకు 128, ఇతరులకు ఆరు స్థానాలు వస్తాయని అంచనా ఉంది.

జార్ఖండ్‌లో...

జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ కూటమి గెలుపును యాక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. 53 స్థానాల్లో జేఎంఎం-కాంగ్రెస్ గెలుస్తుందని, ఎన్డీయేకు 25సీట్లు వస్తాయని తెలిపింది. ఎన్డీయేకు 46-58; జేఎంఎం-కాంగ్రెస్‌కు 24-37, ఇతరులకు 6-10 స్థానాలు వస్తాయని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మాట్రిజ్ ప్రకారం ఎన్డీయేకు 42-47; జేఎంఎం-కాంగ్రెస్‌కు 25-30, ఇతరులకు 1-4 స్థానాలు రావచ్చన్న అంచనా ఉంది. జేవీసీ ప్రకారం ఎన్డీయేకు 40-44; జేఎంఎం-కాంగ్రెస్‌కు 30-40 స్థానాలు మధ్య రావచ్చని జేవీసీ పేర్కొంది. ఇదిలావుంటే మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా మెజారిటీ మార్కు 145. జార్ఖండ్‌లో మొత్తం 81 స్థానాలు ఉండగా, మెజారిటీ మార్పు 41.

అబద్ధాలు ఆడడమే రేవంత్ రెడ్డి డీఎన్ఏ: హరీశ్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. పెండింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి పరిచి నాలుగు వేల కోట్లతో పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు అందించింది కేసీఆర్ అన్నారు. 30 లక్షల నుంచి కోటి 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించే స్థాయికి తెలంగాణ చేరిందంటే అది కేసీఆర్ కృషి అని పేర్కొన్నారు. కేసీఆర్ కల్పవృక్షమనే విషయం గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సీఎం మాటల్లో శబ్దం ఎక్కువ విషయం తక్కువ అంటూ దుయ్యబట్టారు. కేసీఆర్ ఘనతను తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రూ.7520 మద్దతు ధర రావాల్సిన పత్తికి రూ.ఐదు వేలకే అమ్ముకునే పరిస్థితి తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు.

అమెరికా జైల్లో అన్మోల్ బిష్ణోయ్

(మొదటిపేజీ తరువాయి)

ధ్రువీకరించారు. ఇప్పటికే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అమెరికాలోని ఎఫ్‌బీఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీతో సంప్రదింపులు జరిపింది. అతడిని తమకు అప్పగించాలని ఎన్ఐఏ అభ్యర్థించింది. అమెరికాలో కోర్టు వ్యవహారాలు లేకుండా అతడిని నేరుగా భారత్‌కు తరలించేలా చూసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కేసు విషయంలో తమ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భారత్‌తో సంప్రదింపులు జరుపుతున్నారని అమెరికా దౌత్య కార్యాలయ ప్రతినిధి ఓ ఆంగ్ల పత్రికకు వెల్లడించారు. అన్మోల్, గోల్డీబ్రార్ నిధుల సేకరణ కోసం అమెరికా వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. వారు కెనడా, అమెరికా, నేపాల్, పాకిస్థాన్‌లోని ఖలిస్థానీ అనుకూల వర్గాలతో టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తు బృందాలు భావిస్తున్నాయి. ధర్మన్ జోత్ కహ్లోన్ అనే వ్యక్తితో కలిసి అన్మోల్ అమెరికాలో ఆర్థిక లావాదేవీలు, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని నిఘా వర్గాలు చెబుతున్నాయి. అన్మోల్ బిష్ణోయ్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. 2022లో నమోదైన రెండు కేసుల్లో అతడు అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అంతేగాకుండా సిద్ధిఖీ హత్యకు ముందు సైతం షూటర్లతో అన్మోల్ చాటింగ్ చేసినట్లు ముంబై పోలీసులు వెల్లడించారు. అతడి గురించి సమాచారం ఇచ్చినవారికి ఈ రివార్డు ఇస్తామని ఎన్ఐఏ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 14న సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద కాల్పుల ఘటన చోటుచేసుకుంది. దానికి బాధ్యత వహిస్తూ అన్మోల్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు.

సోషలిస్టు సమాజ నిర్మాణానికి ఓటేయండి

ఐర్లాండ్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

డబ్లిన్: సోషలిస్టు సమాజ నిర్మాణానికి ఓటేయండి అంటూ ఐర్లాండ్ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈనెల 29న ఐర్లాండ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న క్రమంలో కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరింది. ప్రజల సమస్యలకు నిజమైన పరిష్కారం సోషలిజంతోనే సాధ్యమని నొక్కిచెప్పింది. ప్రగతిశీలవాదులు, సోషలిస్టు సిద్ధాంతాలకు కట్టుబడిన అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా విప్లవాలకు పునాది పడుతుందని, ఎన్నికల తర్వాత మనకు కావాల్సిన సమాజాన్ని నిర్మించుకోవచ్చని పిలుపునిచ్చింది. 32 కౌంటీల మద్దతుగల సోషలిస్టు రిపబ్లిక్ నిర్మిద్దామని ప్రకటన పేర్కొంది. మనకు కావాల్సినది నిజమైన సార్వభౌమ దేశమని ఉద్ఘాటించింది. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సోషలిజం ద్వారానే సాధించుకోగలమని పార్టీ ప్రకటన పేర్కొంది. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థను సోషలిజంతో భర్తీ చేయగలిగితేనే పేదరికం రహిత సమాజం సాధ్యమని నొక్కిచెప్పింది. అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీరగలవని పేర్కొంది. ప్రస్తుత రాజకీయ కూటములు ఇటువంటి పరిష్కారాలను చూపకపోవడం దురదృష్టకరమని ప్రకటన పేర్కొంది. అద్దెలు, నిత్యావసరాల ధరల, జీవన వ్యయం, వైద్య ఖర్చులు పెరిగిపోయిన పరిస్థితుల్లో జరగనున్న ఈ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆసుపత్రులు రోగులతో నిండివున్నాయి. ఆరోగ్య వ్యవస్థ సామర్థ్యానికి మించి పనిచేస్తోంది. మనల్ని ప్రజల్లా కాక కేవలం వినియోగదారులుగా చూసే సమాజంలో జీవిస్తున్నామని కమ్యూనిస్టు పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. ఐర్లాండ్‌కు స్వతంత్ర విదేశాంగ విధానం కూడా లేదని పేర్కొంది. '2023 అక్టోబరు 7న వేలాది మంది కార్మికులు మన నగరాలు, పట్టణాలు గ్రామాల్లో పలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో ఒత్తిడికి లోనైన మన ప్రభుత్వం పలస్తీనాను స్వతంత్ర్య దేశంగా గుర్తించింది. ఇది స్వాగతించదగ్గ పరిణామం. అయితే అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ ప్రభావం మన దేశ ఆర్థిక, రాజకీయ నిర్ణయాలపై ఉంది. అందుకే ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవడానికి ఐర్లాండ్ ప్రభుత్వం నిరాకరించింది. స్వతంత్ర విదేశాంగ విధానాన్ని రూపొందించుకోలేకపోతోంది' అని కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది.

56 ఏళ్ల తర్వాత గయానాకు భారత ప్రధాని

జార్జ్‌టౌన్: భారత ప్రధాని నరేంద్రమోదీ బుధవారం గయానా చేరుకున్నారు. రాజధాని జార్జ్‌టౌన్‌కు తెల్లవారుజామున చేరుకున్న మోదీకి సంప్రదాయాబద్ధంగా ఘన స్వాగతం లభించింది. ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ అలీ ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 56ఏళ్ల తర్వాత గయానా గడ్డపై కాలు మోపిన భారత ప్రధానిగా మోదీ నిలిచారు. మోదీ అనంతరం మహమ్మద్ ఇర్ఫాన్ అలీతో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. దక్షిణ అమెరికా దేశ పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో ప్రసంగించారు. రెండు దేశాల మధ్య సుదీర్ఘ బంధానికి మోదీ పర్యటనతో ప్రాధాన్యత లభించిందని గయానాకు భారత దౌత్యాధికారి అమిత్ ఎస్ తెలంగ్ అన్నారు. ఐదున్నర దశాబ్దాల్లో మొదటిసారి గయానాకు భారత ప్రధాని రావడం చారిత్రకమన్నారు. పరస్పర స్నేహం, నమ్మకం, సహకారంతో రాబోయే కాలంలో రెండు దేశాలు ముందుకెళ్లగలవని ఆకాంక్షించారు. కారికామ్ (కరేబియన్ కమ్యూనిటీ అండ్ కామన్ మార్కెట్) నేతలతోనూ మోదీ గురువారం భేటీ అవుతారని అమిత్ చెప్పారు. భారత్, కారికామ్ మధ్య బంధాన్ని బలోపేతం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంధనం, మౌలికవసతులు, వ్యవసాయం, ఆహార భద్రత, ఆరోగ్యం, ఫార్మా, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో సహకారంపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తారని అమిత్ వెల్లడించారు.

మోదీకి 'కీ టు ది సిటీ ఆఫ్ కేప్‌టౌన్'తో సన్మానం

జార్జ్ టౌన్‌లోని హోటల్‌లో మోదీకి ఘన సత్కారం లభించింది. మేయర్ ఆల్ఫ్రెడ్ మెంటోర్ 'కీ టు ది సిటీ ఆఫ్ జార్జ్‌టౌన్'తో మోదీని సన్మానించారు. భారత్-గయానా దేశాల మధ్య సాన్నిహిత్యానికి ప్రతీకగా ఓ జ్ఞాపిక మోదీకి ఆయన అందజేశారు.

భారత సంతతి ప్రజలను కలిసిన ప్రధాని

దాదాపు 180 ఏళ్ల కిందట గయానాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడిన భారత సంతతి కుటుంబాలను ప్రధాని మోదీ కలిశారు. భారత సంతతి ప్రజల నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. సంప్రదాయ వస్త్రధారణలో, భారత జెండాతో వారంతా మోదీకి స్వాగతం పలికారు. నినాదాల నడుమ ఓ చిత్రపటాన్నీ ఓ సభ్యుడు బహూకరించారు. గయానాలో 3,20,000 మంది భారత సంతతి ప్రజలున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) వెల్లడించింది.

త్వరలో ముఖాముఖి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. త్వరలోనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలను కలుస్తామన్నారు. 162 రోజుల కూటమి పాలనపై శాసనసభలో సీఎం ప్రసంగించారు. 'వైసీపీ హయాంలో గాడి తప్పిన వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టాం. అప్పులు లేవని ఇష్టానుసారంగా ప్రచారం చేశారు. సాక్ష్యాలతో రూ.10 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని చూపించాం. సంతృప్తి, సంతోషం, భద్రత కల్పించే విధానాలు తీసుకొచ్చాం. పింఛను రూ.4 వేలకు పెంచాం. 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేలు, అనారోగ్యంతో బాధపడేవారికి రూ.10 వేలు, రూ.15వేలు చొప్పున అందిస్తున్నాం. సంపన్న రాష్ట్రాలు కూడా ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు. పేదల కోసం ఇప్పటికే 198 చోట్ల అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం. ఇప్పటికి 1.18 కోట్ల మంది ఈ క్యాంటీన్లలో భోజనం చేశారు. పేదల ఆదాయం పెరగి ఖర్చు తగ్గాలి. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ధ్యేయంగా పని చేస్తాం. సూపర్-6, మేనిఫెస్టో హామీలు అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు. దీపం పథకం కింద సమైక్య రాష్ట్రంలో ఉచిత గ్యాస్ అందించామని చెబుతూ తన తల్లి పడ్డ కష్టాలను సీఎం గుర్తుచేసుకున్నారు. దీపం-2 పథకాన్ని ప్రస్తుతం అమలు చేశామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని చెప్పారు. పథకం విధానాలు తెలియక కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటివరకు 42.40 లక్షల మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారని తెలిపారు. రేషన్, ఆధార్ కార్డులు ఉన్న వారు ఈ పథకానికి అర్హులవుతారని చెప్పారు. సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లోనే డబ్బులు అకౌంట్లో జమ అవుతాయని తెలిపారు. 'చెత్తపై పన్ను తొలగించకుండా 83 లక్షల మెట్రిక్ టన్నులు పేరబెట్టారు. వీళ్లు వేసిపోయిన చెత్తను క్లీన్ చేసే బాధ్యత మేము తీసుకున్నాం అని తెలిపారు.

కారు సెన్సార్లనూ తయారు చేయగలం

(మొదటిపేజీ తరువాయి)

తయారీకి భారత్ పెట్టుబడులు పెడుతోందని, కారు సెన్సార్లను తయారు చేసుకుంటే ఖర్చు తగ్గుతుందని ఆయనన్నారు. ఖర్చు తగ్గి, ఉత్పత్తి పెరిగినప్పుడే కారు సెన్సార్ల రంగంలో రాణించగలమని తెలిపారు. సదస్సులో భాగంగా జరిగే విధానపరమైన జోక్యాలతో ఇందుకు పరిష్కారం సాధ్యమని చెప్పారు. 2020లో జరిగిన అంతరిక్ష రంగ సంస్కరణలను, 2023లో తెచ్చిన అంతరిక్ష విధానాన్ని ఆయన ప్రశంసించారు. భారత్‌లో స్పేస్ ఎక్స్ వంటి సంస్థ ఏర్పాటు చేయాలని చాలా మంది ఉత్సాహంగా ఉన్నారని సోమనాథ్ తెలిపారు. ఐదు కంపెనీలు ప్రస్తుతం ఉపగ్రహాలు తయారు చేస్తున్నాయని, దిగ్గజ పరిశ్రమల భాగస్వామ్యం... సముచిత పెట్టుబడులు లేక రాకెట్లు, ఉపగ్రహాల తయారీలో సవాళ్లు ఎదురవుతున్నట్లు వెల్లడించారు. డిమాండ్‌ను పెంచడమే కాక పెట్టుబడులను ఆకర్షించే విధంగా సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టిని కేంద్రీకరించామని, ఈ నమూనా దేశానికి ప్రయోజనాత్మకంగా పరిణమిస్తుందని ఆకాంక్షించారు. ఇస్రోలో అభివృద్ధి చెందిన అనేక సాంకేతికతలు ఇప్పుడు పరిశ్రమలకు అందుబాటులో ఉన్నాయని... ఉత్పత్తులు, సేవలకు లేక సాఫ్ట్‌వేర్ల అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయని సోమనాథ్ చెప్పారు. సదస్సులో డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ బీకే దాస్, అమెరికాకు జాతీయ భద్రతా ఉప సలహాదారు అన్నీ న్యూబెర్గర్ ప్రసంగించారు.

క్షమాపణకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఫామ్ హౌస్ కట్టుకున్నారని ఆరోపించారు. త్వరలో అన్ని లెక్కలు తీస్తాం... అన్నీ బయటకు తీస్తాం అని హెచ్చరించారు. కొండపోచమ్మ సాగర్ కట్టింది కేసీఆర్ ఫామ్ హౌస్‌కు నీళ్లు తీసుకెళ్లేందుకేనని, బావ కళ్లల్లో ఆనందం చూడటానికి బామ్మర్ది డ్రగ్స్ తీసుకున్నా పట్టుకోవద్దంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా నా నియోజకవర్గ ప్రజలకు నీళ్లు ఇచ్చేందుకు నారాయనపేట్ కొడంగల్ ఎత్తిపోతల పూర్తి చేద్దామంటే కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని, పరిశ్రమలు తెస్తే మా ప్రాంతానికి ఉద్యోగాలు వస్తాయని అనుకుంటే భూసేకరణ జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లు పాలించి కొండమ్మ పోచమ్మ సాగర్‌లో భూములు గుంజుకున్న చరిత్ర మీది... అలాంటి మీరు ఇప్పుడు కొడంగల్‌లో భూసేకరణ చేస్తే మీకు కడుపుమంట దేనికన్నారు. అభివృద్ధి జరగాలంటే భూసేకరణ తప్పదని స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన వారిని తమ ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుందని, పరిహారం పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కేటీఆర్ ఢిల్లీ కాదు చంద్రమండలం పోయి ఫిర్యాదు చేసుకున్నా సరే... చేసిన కుట్రకు ఊచలు లెక్కబెట్టాల్సిందే అన్నారు. చివరగా అసెంబ్లీకి రా సామి ... ఒక్కసారి రా... అంటూ కేసీఆర్‌ను కోరారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక సక్రమ అమలుకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. అన్ని శాఖల్లో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు అవుతున్నదీ... లేనిదీ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యవేక్షిస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. సబ్ ప్లాన్ చట్టం అమలుపై సెస్ ఇప్పటివరకు సమర్పించిన నివేదికలను అధ్యయనం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా రీసర్చ్ సెంటర్ ఏర్పాటుచేసి ప్రత్యేక పథకాల రూపకల్పన చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల ఖర్చుపై అన్ని శాఖలు 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని భట్టి విక్రమార్క కోరారు. గిరిజన తండాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా కావాలన్న డిమాండ్ నేపథ్యంలో అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు మంచి పథకాలు సిద్ధం చేసి... ఆర్థిక శాఖకు నివేదిక సమర్పించాలన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే వచ్చిందని గుర్తుచేశారు. స్పెషల్ సీఎస్ వికాస రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైనాన్స్ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్టీ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, ఎస్సీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రథమ పౌరుడు మాట్లాడే భాష ఇదేనా?

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌ని క్వాష్ చేయాలంటూ మేయర్ మనోహర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం మనోహర్ వ్యాఖ్యలపై మండిపడింది. 'అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఒక నగర ప్రథమ పౌరుడు మాట్లాడేది ఇలాగేనా? అసభ్య పదజాలంతో కుటుంబ సభ్యులు, తల్లులపై దాడి చేస్తారా? ప్రజలకు సేవ ద్వారా దగ్గరవ్వాలి తప్ప అసభ్య భాషతో కాదు. బాధ్యతగా మెలగాలని గుంటూరు మేయర్‌కు చెప్పండి' అని ఆయన తరపు న్యాయవాదికి హైకోర్టు సూచించింది. మనోహర్ నాయుడుకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తూ, కేసు పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ కూటమి నేతలు అప్పట్లో గుంటూరు అరండల్‌పేట ప్రాంతంలో నిరసన చేపట్టగా వైసీపీ నేత మనోహర్ నాయుడు అక్కడికి చేరుకుని చంద్రబాబు, పవన్, లోకేశ్‌ను బూతులు తిడుతూ కార్యకర్తలపై దాడి చేసేందుకు యత్నించారు.

5.8 కోట్ల రేషన్ కార్డుల తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థ ద్వారా దేశంలో మొత్తంగా 80.6కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతుండగా.. ఆధార్ ధృవీకరణ, ఈకేవైసీ వెరిఫికేషన్‌ల ద్వారా 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డులు తొలగిపోయాయని పేర్కొంది. ఇప్పటివరకు 20.4 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తయిందని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ వివరాలు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 5.33 లక్షల చౌకధరల దుకాణాలకు ఈపోస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సాయంతో 99.8శాతం కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7శాతం లబ్ధిదారుల ధృవీకరణ పూర్తయింది. మరోవైపు ఈకేవైసీ ప్రక్రియతో ఇప్పటివరకు 64 శాతం లబ్ధిదారుల వెరిఫికేషన్ జరిగింది. ఆహార పదార్థాల సరఫరా విషయంలోనూ ఎఫ్‌సీఐ పకడ్బందీగా వ్యవహరిస్తోందని కేంద్రం తెలిపింది. సరకు రవాణా ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌ను రైల్వేలతో అనుసంధానించామని తెలిపింది. ఇక వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పథకంతో లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా సరకులు తీసుకునే అవకాశం కలిగిందని తెలిపింది.

బీజేపీ కూటమిలో ముసలం

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. సంక్షోభాన్ని పరిష్కరించడంలో సీఎం విఫలమయ్యారని పేర్కొంటూ మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాకు చెందిన ఎన్‌పీపీ... రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్న కొద్ది గంటల్లోనే తాజా హింసాకాండపై తగిన ప్రతిస్పందనను నిర్ణయించడానికి సమావేశానికి రావాలని బీజేపీ, దాని మిత్ర పక్షాల ఎమ్మెల్యేలందరికీ ఆదివారం లేఖలు పంపించారు. 60 మంది సభ్యుల అసెంబ్లీలో ఎన్డీయే బలం 53. కూటమిలో ఏడుగురు ఎన్‌పీపీ ఎమ్మెల్యేలు, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) నుంచి ఐదుగురు, జేడీ(యూ)లో ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఉన్నారు. వీరిలో ఒకరు కుకీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే. అయితే బీజేపీకి చెందిన 37 మంది శాసన సభ్యులలో ఏడుగురు కుకీలు ఉన్నారు. వారందరూ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఆశ్చర్యకరంగా, బీరేన్ సర్కార్‌కు మద్దతు ఇవ్వనప్పటికీ ఎన్‌పీపీ ఏడుగురు శాసనసభ్యులలో నలుగురు సమావేశానికి వచ్చారు. హాజరుకాని వారిలో బీజేపీకి చెందిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు ఉన్నారు. ఎన్‌పీఎఫ్‌కు చెందిన ఒకరు ఆరోగ్య సమస్యల కారణంగా సమావేశానికి హాజరు కాలేకపోవడం గురించి ముందస్తు సమాచారం అందించారు. ఇక విపక్షానికి చెందిన ఐదుగురు కాంగ్రెస్ శాసనసభ్యులు, ఇద్దరు కుకీ పీపుల్స్ అలయన్స్‌కు చెందినవారు ఉన్నారు. జిరిబామ్‌లో అమాయకుల హత్యలను మేము తీవ్రంగా ఖండించాం. న్యాయం జరిగేలా చూస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చాను. రాష్ట్రంలో శాంతి, సుస్థిరతను నిర్ధారించడానికి అఫ్స్పా, శాంతి భద్రతల పటిష్టతపై కీలక నిర్ణయాలు కూడా తీసుకోవడం జరిగింది' అని సీఎం బీరెన్ సింగ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. అధికార కూటమిలో విభేదాలు కొనసాగుతున్నాయన్న వార్తలపై ఎన్‌పీపీ వర్గాలు స్పందిస్తూ 'రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నప్పటికీ ముఖ్యమంత్రి సమావేశంలో పాల్గొన్న తమ ముగ్గురు ఎమ్మెల్యేలకు నేషనల్ పీపుల్స్ పార్టీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది' అని పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశంలో ఆరుగురు మెయితీ మహిళలు, పిల్లలను అపహరించి హత్య చేసిన కుకీ మిలిటెంట్లపై చర్య తీసుకోవాలని తీర్మానం చేయడం గమనార్హం. ముఖ్యమంత్రి సమావేశానికి హాజరుకాని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు మాట్లాడుతూ వర్గాల మధ్య సామరస్యాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, అయితే విభజన తీర్మానాలు హింస, అశాంతికి దారితీస్తాయని అన్నారు. తిరుగుబాటుదారులకు సంఘం లేదని, అశాంతికి దారితీసే తీర్మానాలు రూపొందించడంలో నాయకులు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. న్యూదిల్లీలో ఉన్న మరో బీజేపీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ 'గత సంవత్సరంలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు తన సొంత ఎమ్మెల్యేల నుంచే మద్దతు క్షీణించింది. హింసాకాండ అనంతరం గత ఏడాది కుకీ బీజేపీ ఎమ్మెల్యేలు కూడా సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది కొన్నిసార్లు మెయితీ వర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు ఆయన్ను తొలగించాలని కోరిన సందర్భాలు ఉన్నాయి' అని తెలిపారు.

పోలింగ్ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

సంఘం ప్రకారం... రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల కోసం మొత్తం 4,136 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇది ఐదేళ్ల క్రితం కంటే 27.7 శాతం పెరిగింది. రాష్ట్రంలోని దాదాపు 9.7 కోట్ల మంది ఓటర్లకు సరిపడేలా 52,789 స్థానాల్లో 1,00,186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా 388 'పింక్ బూత్‌లు' ఏర్పాటు చేశారు. నవీ ముంబై పోలీసులు క్యూఆర్ కోడ్ ద్వారా పోలింగ్ కేంద్రాలు, పార్కింగ్, ఓటర్ల రద్దీ సమాచారాన్ని ఓటర్లకు అందించేందుకు ఒక క్లిక్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఎన్నికల కారణంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) పని చేయలేదు. ముంబై నగరంలో ఓటు వేసిన ప్రముఖుల్లో శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే, సంజయ్ రౌత్, ఎన్‌సీపీ (ఎస్పీ) నేత శరద్ పవార్, ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్‌పర్సన్ కుమార్ మంగళం బిర్లా, భార్య పరోపకారి నీర్జా బిర్లా, రిలయన్స్ అధినేతలు ముకేశ్ అంబానీ, నీతా అంబానీ, సచిన్ టెండూల్కర్ తదితర ప్రముఖులు ఓటు వేశారు. ఇదిలాఉండగా, మహారాష్ట్ర అదనపు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కిరణ్ కులకర్ణి మాట్లాడుతూ 'మధ్యాహ్నం 1 గంట వరకు అంచనా వేసిన ఓటింగ్ శాతం దాదాపు 32 శాతం. చారిత్రక పోకడల ప్రకారం, పోలింగ్ చివరి గంటల్లో ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఈసారి మేము గత సారి శాతాన్ని దాటుతామని నాకు నమ్మకం ఉంది' అని అన్నారు. థానేలో ఓటు వేసిన తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

చెదురుమదురు ఘటనలు

బీడ్ జిల్లాలోని పర్లీలోని నాలుగు చోట్ల పోలింగ్ కేంద్రాలను ఆక్రమించే ప్రయత్నాలను ఎన్నికల అధికారులు అడ్డుకున్నారు. సంబంధిత ఈవీఎంలను మార్చారు. కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. పర్లీలోని మూడు గ్రామాల్లోని ఆరు పోలింగ్ కేంద్రాలను కొందరు ధ్వంసం చేశారని, ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఐదు కేంద్రాల్లో ఈవీఎంలను మార్చామని, ఈవీఎంలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని బీడ్ కలెక్టర్ అవినాష్ పాఠక్ తెలిపారు. దీనికి సంబంధించిన ఫిర్యాదులపై కేసు నమోదు చేశామన్నారు. నాసిక్ జిల్లాలో ఉదయం పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఒక పోలింగ్ కేంద్రంలో ఈవీఎం పని చేయకపోవడంతో కొంతమంది ఓటర్లు తమ వేళ్లపై చెరగని సిరాతో కొద్దిసేపు వేచి ఉండాల్సి వచ్చిందని ఆ వర్గాలు తెలిపాయి. అయితే సమస్య పరిష్కారమైందని ఎన్నికల అధికారులు తెలిపారు. శ్రీరాంపూర్‌లో పోలింగ్ ప్రారంభమైన వేకువజామున ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు శివసేన అభ్యర్థి భౌసాహెబ్ కాంబ్లే కారుపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. రెండు మోటార్‌సైకిళ్లపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు అశోక్ షుగర్ మిల్స్ సమీపంలో శ్రీ కాంబ్లే కారును లక్ష్యంగా చేసుకున్నారు. అయితే, బుల్లెట్లు కారుకు తగలలేదని పోలీసు అధికారి వివరించారు. కాంబ్లే చేసిన ఫిర్యాదుపై అహల్యానగర్ జిల్లాలోని శ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జార్ఖండ్‌లో...

జార్ఖండ్‌లో రెండో దశలో భాగంగా 12 జిల్లాల్లోని 38 నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5 గంటల వరకు 67.59 శాతం ఓటింగ్ నమోదయిందని అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ నేహా అరోరా తెలిపారు.

నవంబరు 13న జరిగిన మొదటి దశ పోలింగ్‌లో 66.65 శాతం ఓటింగ్ నమోదయింది. రెండవ దశ పోలింగ్‌లో ప్రముఖ అభ్యర్థులలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బర్హైత్ నియోజకవర్గం నుంచి, ఆయన భార్య కల్పనా సోరెన్ గాండే నుంచి, ఆయన సోదరుడు బసంత్ సోరెన్ దుమ్కా నుంచి, జమ్తారా నుంచి శిబూ సోరెన్ కోడలు సీతా సోరెన్ బరిలో ఉన్నారు.

సమయపాలన పాటించాలి : డా. మురళీధర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. బుధవారం జిల్లాలోని మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమనగల్ ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్ (సబ్ సెంటర్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే లాగా చర్యలు తీసుకోవాలని, గర్భిణీ స్త్రీలను ట్యాగ్ ఫెసిలిటీస్ కి పంపించాలని, 102 వాహనాన్ని వినియోగించుకోవాలని అన్నారు. రెండు వారాల మించి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేయించాలని, క్షయ వ్యాధిని త్వరగా గుర్తించి ఆరు నెలల వరకు మందులు వాడినచో నయమవుతుందని అన్నారు. రికార్డులను పరిశీలించడం అన్ని ఆన్లైన్‌లో అయ్యేటట్టుగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు సింగరేణి పెద్దపీట

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: బొగ్గు నాన్యతను కాపాడుతూ బొగ్గు వినియోగదారులు విశ్వసనీయతకు సింగరేణి పెద్దపీట వేస్తుందని సింగరేణి ఇఅండ్ ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణ అన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని బుధవారం గోదావరిఖని ఇల్లందు క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బొగ్గు కొనుగోలు దారులు, వివిధ ఏరియాల జియంలు, ఏరియా రక్షణ అధికారులు, అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సదస్సులో డైరెక్టర్ మాట్లాడుతూ బొగ్గు నాణ్యత ఆవశ్యకతను వివరించారు.నాణ్యత లోపిస్తే జరుగే విపత్కర పరిస్థితిని తెలుపుతూ నాణ్యతను పెంపొందించే చర్యలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సదస్సులో ఆర్జీ.1 జియం లలిత్ కుమార్,క్వాలిటి జియం కార్పోరేట్ రవి కుమార్,ఆర్జీ. రీజియన్ క్వాలిటి జియం బైద్య,ఆర్జీ.2,3,జియంలు వెంకటయ్య, సుధాకర్, శ్రీనివాస్, శ్రీరాంపూర్ జియం శ్రీనివాస్, డిజియం క్వాలిటి సాయి ప్రసాద్, వివిధ కంపెనీల ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనపై కళా యాత్ర

విశాలాంధ్ర బ్యూరో -మెదక్: హవేలీ ఘన్పూర్ మండలం ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల సందర్భంగా కళా యాత్ర హవేళీ ఘనపూర్ మండలంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు వివిధ పాటల రూపంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార శాఖ జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన యేడాది పూర్తవుతున్న సందర్భంగా కళాకారులు కళా ప్రదర్శన రూపంలో ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు.

కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడి : రాకేష్

విశాలాంధ్ర-కారేపల్లి : రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ దోపిడి అడ్డు అదుపూ లేకుండా తారాస్థాయికి చేరిందని ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వి రాకేష్ ఆరోపించారు. బుధవారం పి.వై.ఎల్, పి.ఓ.డబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్ ఫీజుల దోపిడి మూలంగా 3 నుంచి 4 శాతం ప్రజలు పేదలుగా మారుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ సర్వేలో తెలిపిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్యం అందక పోవడంతో ప్రజలు తప్పని పరిస్థితిలో ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారని అన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న హాస్పిటల్స్ ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతు న్నారన్నారు. పరీక్షలు, మందుల పేరుతో లక్షల రూపాయల బిల్లులు వసూలు చేస్తున్నారని అలాగే హెల్త్ ఇన్స్యూరెన్స్‌లో అవకతవకలు జరుగుతున్నాయని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డయాగ్నొస్టిక్ సెంటర్లపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలన్నారు.ప్రభుత్వ హాస్పిటల్స్ ను బలోపేతం చేయాలని కోరారు. ఈ దోపిడీని అరికట్టేందుకు పి.వై.ఎల్, పి.ఓ.డబ్ల్యు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాస్ లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్,పి.వై.ఎల్ మండల కార్యదర్శి కనకరాజు నాయకులు అశోక్ సందీప్, జ్యోతి,వెంకన్న పాల్గొన్నారు.

ధాన్యం వివరాలు నమోదు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముత్తారం మండలంలోని మచ్చుపేట, మైదం బండ, ముత్తారం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన రైతులతో ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు, ఎంత దిగుమతి వచ్చింది, కొనుగోలు కేంద్రాలకు పంట తెచ్చి ఎన్ని రోజులు అవుతుంది, తేమ శాతం ఎంత ఉంది, టార్పాలిన్ కవర్లు ఇస్తున్నారా మొదలగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్న రకం ధాన్యం కొనుగోలు రిజిస్టర్ లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని అన్నారు.మద్దతు ధర పై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముత్తారం లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారితో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, ముత్తారం ఎంపిడిఓ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ షఫీ, అధికారులు పాల్గొన్నారు.

'బిగ్ ఫాంటసీస్ గివ్వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్'

హైదరాబాద్: బెంగళూరు, చెన్నైలలో విజయవంతమైన పర్యటనను పూర్తి చేసిన తర్వాత, ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ యొక్క ఐకానిక్ ఫాంటసీ స్పేస్‌షిప్ తన బ్రాండ్ యొక్క వినూత్న ప్రచారం 'బిగ్ ఫాంటసీస్: గివ్వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్" ను కొనసాగిస్తూ ప్రయాణం యొక్క తదుపరి దశ కోసం హైదరాబాద్‌కు చేరుకుంది. నాగార్జున మాంటిస్సోరి ఐఐటి కాన్సెప్ట్ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. తమ ఊహలకు జీవం పోసిన ఉత్సాహభరితమైన విద్యార్థుల బృందంను ఇది కలుసుకుంది. ఐటిసి లిమిటెడ్ , బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్, ఫుడ్స్ డివిజన్ హెడ్ అలీ హారిస్ షేర్ ఈ కొత్త కార్యక్రమంను ప్రారంభించడంపై వ్యాఖ్యానిస్తూ, "సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ వద్ద , పిల్లల జీవితాన్ని సాధారణత నుంచి అసాదారణంగా మార్చేందుకు ఫాంటసీ ఊహ శక్తి కీలకమని మేము నమ్ముతున్నామన్నారు. 'బిగ్ ఫాంటసీస్'తో, భారతదేశంలో చక్రాలపై మునుపెన్నడూచూడని సాంకేతికతను మేము తీసుకురావడానికి గర్వపడుతున్నామన్నారు. పిల్లలు తమ భావాలను వ్యక్తీకరించడానికి వారి కల్పనలను సజీవంగా చూడడానికి ఒక ప్రత్యేకమైన వేదికను ఇది అందిస్తోందన్నారు. రాబోయే నెల రోజులలో నగరంలోని చాలా మంది పిల్లలకు ఈ అనుభవాన్ని అందించాలని మేము కోరుకుంటున్నాము.." అని అన్నారు. ఫాంటసీ స్పేస్‌షిప్-అధునాతన ఇంటరాక్టివ్ స్క్రీన్‌లతో ప్రత్యేకంగా రూపొందించబడిన బస్సు. అత్యాధునిక సాంకేతికత కలయికతో ఇది ఉంటుందని, ఇది పిల్లల చేతితో గీసిన డిజైన్‌లను శక్తివంతమైన డిజిటల్ క్రియేషన్‌లుగా మారుస్తుందని చెప్పారు.

రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రులు

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ములుగు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటకం, సంస్కృతి, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణరావు అన్నారు. బుధవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామం లక్నవరం జలాశయంలో రూ. 7 కోట్ల వ్యయంతో 3 ఎకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని (ఐలాండ్‌ను) మంత్రి జూపల్లి కృష్ణరావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ములుగు జిల్లాలో రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండటం పాటు దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క సారలమ్మ జాతర ఇక్కడి జిల్లాకు గుర్తింపు తెచ్చి పెడుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులకు పెద్దపేట వేస్తున్నామని పేర్కొన్నారు. ఐలాండ్ అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుదూర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తెలంగాణలో కూడా ఇలాంటి ఓ అందమైన టూరిజం స్పాట్ ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన మాల్దీవులు, శిమ్లా, మున్నార్ వంటి ప్రాంతాలను తలపించేలా ఈ ద్వీపాన్ని సుందరీకరించారని చెప్పారు. ప్రతి ఒక్కరి జీవితం చిన్నదని సంపాదనే ధ్యేయంగా కాకుండా పకృతి అందాలను వీక్షించి మనసుకు ఉల్లాసం కలిగించాలని అన్నారు. లక్నవరం అటవీ ప్రాంతంతో కూడి ఉండటంతో పాటు గుట్టలు, ఎటు చూసినా నీటి ప్రాంతం నీటి ప్రాంతాల్లో ద్వీపాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయనన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చొరవ చూపుతున్నారని, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ 100 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల ప్రభుత్వ పాలనలో పర్యాటక ప్రాంతాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, పిపిబి మాడల్ తరహాలో పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దామని అన్నారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఈనెల 26 నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాలలో పర్యాటక ప్రాంతాలకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానని అన్నారు.ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరీష్, సంబంధిత అధికారులు,కాంగ్రెస్ పార్టీ ములుగుఅధ్యక్షులు పైడాకుల అశోక్, ఏటూరునాగారం బ్లాక్ కమిటి అధ్యక్షులు ఇర్స వడ్ల వెంకన్న, కన్నాయిగూడెం మాజీ జడ్పీటీసీ ఎన్. చందు,జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవీందర్, స్టానిక ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-ఇల్లందు : యువత గంజాయి ఇతర ఎలాంటి మత్తు పదార్థాలకు, వ్యసనాలకు అలవాటు పడొద్దని డీఎస్పీ ఎన్. చంద్రభాను కోరారు. యువ వయసులోనే మంచి అలవాట్లతో సన్మార్గంలో ఉన్న వారే భవిష్యత్తులో తమ జీవితం అన్ని విధాలా సుఖమయం చేసుకుంటారని తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు సేవిస్తే తలెత్తే దుష్పరిణామాలను వివరించారు. జీవితంలో విద్యార్థి దశ రాబోయే భవిష్యత్తుకు చాలా చాలా కీలక దశ అన్నారు. అందుకే ఈ దశ నుంచి మంచి స్నేహాలతో ఒక ప్రణాళిక బద్ధంగా భవిష్యత్తు నిర్మించుకోవాలని పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడికను ప్రతిరోజు గమనించాలని కోరారు. చెడు వ్యసనాలకు బానిసగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా నేడు సోషల్ మీడియా విశ్రుంఖలంగా ఉందని దీనికి యువత దూరంగా ఉండాలని డిఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగుల్ మీరా, సూర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సిఎస్ఆర్ నిధులు అందజేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, కోరం కనకయ్యలతో పాటు వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఉన్న సంస్థలు జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్ ను తమ వంతు బాధ్యతగా రెండు శాతం నిధులను అందజేయాలని ఆయన కోరారు. గతంలో సిఎస్ఆర్ నిధుల కింద జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రభావిత ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులను విజయవంతంగా చేపట్టడం జరిగిందని గుర్తు చేసారు. సిఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అవసరమైన పనులకు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సింగరేణి, కేటీపీఎస్, ఐటిసి,నవభారత్, బీటీపీఎస్ యాజమాన్యాలకు చెందిన ఉన్నతాధికారులు, జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, సీపీఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన కళాయాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కళాయాత్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ జి. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రభుత్వం గత సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారాన్ని కల్పించేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ప్రజాపాలన కళా యాత్ర కార్యక్రమంపై బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ,ఆర్డీవోలు, జడ్పి సీఈఓ, డిపిఓ ,మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్‌లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు డిసెంబర్ 7 వరకు ప్రతిరోజు 2 మేజర్ గ్రామపంచాయతీలు, మండల కేంద్రంలో కార్యక్రమాలను ఇస్తున్నారని, జిల్లాలో 2 బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న 33 మండలాలు, మున్సిపాలిటీలు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లా కేంద్రంతో సహా కవర్ చేసే విధంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. కళాకారులు ప్రదర్శన ఇచ్చేందుకు చక్కని వేదికను గుర్తించాలని, రాత్రి సమయంలో మండల కేంద్రంలో ఇచ్చే కార్యక్రమానికి సరి అయిన విధంగా లైట్లు ,ఇతర ఏర్పాట్లుచేయాలని, కళాకారులకు అవసరమైన వసతిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీపీఆర్ ఓ యు.వెంకటేశ్వర్లు, జెడ్పిసిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ మురళి పాల్గొన్నారు

సరికొత్త మెనూ పరిచయం చేసిన బౌగెన్‌విల్లా రెస్టారెంట్

విశాలాంధ్ర- హైదరాబాద్: వినూత్నమైన వంటకాలకు ప్రసిద్ధి చెందిన ప్రీమియం రెస్టారెంట్, బౌగెన్‌విల్లే , భోజన ప్రేమికుల కోసం సరికొత్త మెనూని పరిచయం చేసినట్లు వెల్లడించింది. రెండేళ్ళ క్రితం ఆహార ప్రేమికుల కోసం తమ తలుపులు తెరిచిన ఈ రెస్టారెంట్, స్థానిక ప్రపంచ రుచులను మిళితం చేసి ప్రత్యేకమైన రుచుల సమ్మేళనంతో వినూత్న భోజన అనుభవాన్ని సృష్టించడం ద్వారా భోజన ప్రియులకు అభిమాన రెస్టారెంట్ గా మారింది.

బిర్లా ఓపస్ పెయింట్స్ ఫ్యాక్టరీ ప్రారంభం

విశాలాంధ్ర-హైదరాబాద్: దిబిర్లా ఓపస్ పెయింట్స్ సామర్థ్యాన్ని ఏడాదికి 866 మిలియన్ లీటర్లకు పెంచుకుని, ఇన్‌స్టాల్ కెపాసిటీ ద్వారా 2వ అతిపెద్ద డెకరేటివ్ పెయింట్స్ ప్లేయర్‌గా అవతరించింది. చామరాజ్‌నగర, కర్ణాటక, భారతదేశం: ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్, కుమార్ మంగళం బిర్లా, మైసూరుకు సమీపంలోని చామరాజ్‌నగరలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విభాగమైన బిర్లా ఓపస్ పెయింట్స్ నాల్గవ ప్లాంట్‌ను నేడు ప్రారంభించారు. పూర్తిగా ఆటోమేటెడ్, ఇంటిగ్రేటెడ్ పెయింట్ ప్లాంట్ నేడు తన వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. ఇది కంపెనీ తయారీ సామర్థ్యాన్ని ఏడాదికి 866 మిలియన్ లీటర్లకు వృద్ధి చేయగా, మరియు బిర్లా ఓపస్ పెయింట్స్ సంస్థాపిత సామర్థ్యంతో 2వ అతిపెద్ద డెకరేటివ్ పెయింట్స్ తయారీదారుగా అవతరించింది.

ఆన్ లైన్ కెఫే అందించనున్న జెప్టో కెఫే

విశాలాంధ్ర-హైదరాబాద్: జెప్టో యొక్క డార్క్ స్టోర్ నెట్‌వర్క్ ఇప్పుడు విపరీతంగా విస్తరిస్తోంది. కేవలం 15శాతం మాత్రం విస్తరణతోనే జెప్టో కెఫే యూనిట్ ఇప్పటికే 1600 కోట్ల వార్షిక ఆదాయ రన్-రేట్‌ను సాధించింది. జెప్టో డార్క్ స్టోర్ లలో 15% నుండి 100శాతం వరకు కేఫ్‌ను స్కేల్ చేయడం ద్వారా, వచ్చే ఏడాది నాటికి కేఫ్‌ను 1,000 కోట్ల ఆదాయ వ్యాపారంగా మార్చేందుకు అవకాశం ఉంది. అలాగే జెప్టో ప్రస్తుతం నెలకు 100ం కేఫ్‌లను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అంతర్జాతీయ యూనిఫాం తయారీదారుల సదస్సు

విశాలాంధ్ర-హైదరాబాద్: షోలాపూర్ గార్మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ (ఎస్‌జిఎంఎ) నిర్వహించే ఈ ఫెయిర్‌ను మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ ప్రారంభించ నున్నారు. ప్రపంచ యూనిఫాం మార్కెట్, 2030 నాటికి 25 బిలియన్ల మార్కును తాకుతుందని అంచనా ఇండియా - షోలాపూర్ గార్మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ (ఎస్‌జిఎంఎ) డిసెంబర్ 18 నుండి 20, 2024 మధ్య బెంగళూరులో యూనిఫాం మ్యానుఫ్యాక్చరింగ్ ఫెయిర్ 2024 8వ ఎడిషన్‌ను నిర్వహించనుంది. ఈ ఫెయిర్‌ను మహారాష్ట్ర గవర్నర్ సి . పి . రాధాకృష్ణన్ ప్రారంభించనున్నారు.

అల్లుమినియం డై-కాస్టింగ్ ఉత్పత్తులు ప్రదర్శన

హైదరాబాద్: అల్లుమినియం డై-కాస్టింగ్ ఉత్పత్తులు, ఆవిష్కరణల ప్రదర్శన 10వ ఎడిషన్‌గా అలుకాస్ట్ ఎక్స్ పో 2024 జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ ఐదో తేదీ నుంచి ఏడు వరకు దిల్లీలోని యశోభూమి, ఇండియా ఇంటర్నేషనల్ కాన్వెన్షన్ ఎక్స్‌పో సెంటర్, ద్వారకాలో అలుకాస్ట్ ఎక్స్ పో- 2024 జరగనుంది అన్నారు. ఇది డై కాస్టింగ్ సాంకేతికతపై ప్రపంచ స్థాయి అంతర్జాతీయ కాన్ఫరెన్స్, ప్రదర్శనగా నిర్వహించబడుతుందన్నారు. ఇందులో పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలు తయారీదారులు తమ అత్యంత సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఉత్పత్తులు, పదార్థాలు, సాధనాలు, పరికరాలు వినియోగ సరుకులను ఆవిష్కరించడానికి ఇక్కడ చేరుకుంటారన్నారు. న్యూర్న్ బెర్గ్ మెస్సే ఇండియా ప్రొడక్షన్ ఆధ్వర్యంలో ఈ అద్భుతమైన ప్రదర్శన జరగనుందని చెప్పారు. ఇది భారత్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన అతి పెద్ద పరిశ్రమ వేదికగా నిలుస్తుందని, ఇందులో 200 మంది ప్రదర్శకులు 300 కి పైగా బ్రాండ్లు పాల్గొంటున్నాయన్నారు. థాయ్‌లాండ్, జర్మనీ, యుఎస్ఎ, స్పెయిన్, ఇటలీ, ఆస్ట్రియా, జపాన్, చైనా మరియు ఫ్రాన్స్ వంటి దేశాల నుండి 7000 కంటే ఎక్కువ పరిశ్రమ హితాధారులు 20కి పైగా దేశాల నుండి ఈ ప్రదర్శనకు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

100 ఎంజి విండ్సర్ హైదరాబాద్

విశాలాంధ్ర-హైదరాబాద్: తన వేగాన్ని కొనసాగిస్తూ, జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా భారతదేశపు మొదటి ఇంటెలిజెంట్ సియువి, ఎంజి విండ్సర్ యొక్క 100 యూనిట్ల మెగా డెలివరీ హైదరాబాద్‌లో చేయనున్నట్లు ప్రకటించింది. విశేషంగా విక్రయించబడే ఈవీసీ డెలివరీ చేసింది, దేశవ్యాప్తంగా ఈ ఎలక్ట్రిక్ సియువి కోసం పెరుగుతున్న ఉత్సుకతను ప్రతిబింబించింది. తెలంగాణలో ఈవీల కోసం మరింత డిమాండ్ ను మెరుగుపరచడానికి, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికిల్ ఎనర్జీ స్టోరేజ్ పాలసీ 2020-2030ని' చేర్చింది. కొత్త ఈవీ పాలసీ ద్వారా, తెలంగాణ ప్రభుత్వం మొదటి రెండు సంవత్సరాల కోసం అనగా డిసెంబర్ 31, 2026 వరకు రాష్ట్రంలో కొనుగోలు చేసి మరియు నమోదు చేసిన ఈవీల కోసం 100శాతం రోడ్ పన్ను మినహాయింపును కేటాయిస్తోంది. ప్రభుత్వం ఆదేశం ప్రకారం, ఈ మినహాయింపు ఎలక్ట్రిక్ 2-వీలర్స్, 4-వీలర్స్ మరియు వాణిజ్య వాహనాలకు వర్తిస్తుంది.

డేటింగ్ ట్రెండ్స్‌ను ప్రకటించిన బంబుల్

విశాలాంధ్ర-ముంబాయి: వచ్చే ఏడాదిలో డేటింగ్‌ను నేవిగేట్ చేసేందుకు 2025 డేటింగ్ ట్రెండ్స్‌ను ప్రకటించిన బంబుల్ భారతదేశంలో మహిళల కోసం రూపొందించిన మొట్టమొదటి డేటింగ్ యాప్ బంబుల్. సింగిల్స్ DM నుండి IRLకి కనెక్షన్ అయ్యేందుకు సహాయపడటానికి ఇవాళ తన తాజా అంచనాలను విడుదల చేసింది. భారతదేశంలో 2,000 కంటే ఎక్కువ సింగిల్స్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 40,000 కంటే ఎక్కువ జెన్ మిలీనియల్ సభ్యులను కలిగి ఉంది బంబుల్. అంతేకాకుండా సరి అయిన పరిశోధనల ద్వారా వాస్తవాలను క్రోడీకరించి సరైన సంబంధాన్ని సానుకూలంగా భావించే వ్యక్తులతోనే డేటింగ్ అభివృద్ధి చెందుతుందని బంబుల్ వెల్లడించింది. బంబుల్ హాట్ టేక్ గతేడాదిలో డేటింగ్ చర్చలు విభిన్నంగా ఉన్నప్పటికీ, ఒక విషయం మాత్రం నిజం డేటింగ్ ఎప్పటికీ మారిపోదు మరియు ఎక్కడికీ వెళ్లదు. కానీ సంబంధాల పట్ల మా విధానాలు గుర్తించదగిన రీతిలో ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటాయి.

బడ్జెట్‌లో వివాహ సీజన్

విశాలాంధ్ర-హైదరాబాద్ : పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న కొద్ది గంపెడాశలు లేకుండా ఘనంగా జరుపుకనే సమయం వచ్చింది. ట్రెంట యొక్క ఎలివేటెడ్ అకేషన్ వేర్ బ్రండ్ అయిన సమోహ్, 20,000 లోపు వెడ్డింగ్-రెడీ అవుట్‌ఫిట్‌లయొక్క క్యూరేటెడ్ సేకరణను అందజేస్తుంది. ఇది చక్కదనం, సౌక్రాం మరియు ఆధునిక్ డ్రెస్‌ల యొక్క ఖచ్చితమైన సమ్మేళానాన్ని అందిస్తుంది. మీరు సన్నిహిత సమావేశాలక లేదా గొప్ప వేడుకకు హాజరైనా, వివాహ సీజన్‌లోని ప్రతి ఈవెంట్‌ను సమోహ్యొక్క సేకరణ కవ్వర్ చేస్తోంది.

సింబయాసిస్ లా అడ్మిషన్ టెస్ట్

విశాలాంధ్ర-ముంబయి: దేశంతో అత్యంత పేరు ప్రఖ్యాతులు కలిగిన సింబయాసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్సిటీ) నిర్వహించే సింబయాసిస్ లా అడ్మిషన్ టెస్ట్ (స్లాట్) రిజిస్ట్రేషన్‌కు 22 చివరి తేదీగా ప్రకటించింది. దేశంలో ప్రఖ్యాత లా ప్రోగ్రామ్‌లకు ఇది ప్రీమియర్ ప్రవేశ పరీక్ష. భారతదేశంలోని అత్యుత్తమ న్యాయ విద్యాలయాలలో ఒకదానిలో స్థానం కోసం వేలాది మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. అలాంటి వారి కోసం నిర్వహించే అత్యున్నత పరీక్ష ఇది. అయితే ఇందులో కేవలం 300 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

45 కోట్ల మంది భక్తులకు ఆతిథ్యం ఇవ్వనున్న ప్రయాగ్ రాజ్

విశాలాంధ్ర- హైదరాబాద్: 2025 మహా కుంభమేళాకు సన్నాహకంగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఒక గొప్ప మరియు ఆధ్యాత్మిక సుసంపన్నమైన అనుభవంగా మార్చడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోంది. సంగం నగరం ప్రయాగ్ రాజ్ లో జరిగే ఈ మహాకుంభమేళా పౌష్ పౌర్ణమి (జనవరి 13, 2025)న ప్రారంభమై మహాశివరాత్రి (ఫిబ్రవరి 26, 2025) తో ముగుస్తుంది. ఈ పవిత్ర సమ్మేళనంలో ఆరు రాజ స్నాన తేదీలు ఉంటాయి. ఇక్కడ సాధువులు మరియు సాధువుల అఖాడాలు పురాతన ఆచారాలలో పాల్గొంటాయి.

హైదరాబాద్‌లో ప్రారంభమైన ఐ2కెన్

విశాలాంధ్ర- హైదరాబాద్: వెల్నెస్, బ్యూటీకి సంబంధించిన ఒక ప్రముఖ సంస్థ, పుణెలో ప్రధాన కార్యాల యం కలిగిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్మోటాలజీ, ఈస్తటిక్స్ అండ్ న్యూట్రిషన్ (ఐ2కెన్) అనేది పుణె, ముంబై, వాయనాడ్, మధురలో విస్తరించి ఉంది. ఈ సంస్థ విస్తృతమైన వృత్తిపరమైన కోర్సులను అందిస్తోంది, అధునాతన బ్యూటీ అండ్ హెయిర్ ట్రీట్మెంట్స్, అలాగే కాస్మోటాలజీ, ట్రికాలజీ, ఈస్తటిక్స్, సైంటిఫిక్ వెయిట్ మేనేజ్‌మెంట్, న్యూట్రిషన్‌లలో ప్రత్యేక ట్రీట్మెంట్స్ ను అందిస్తోంది. ఔత్సాహిక నిపుణుల కోసం అసాధారణ విద్య, శిక్షణను అందించే లక్ష్యంతో హైదరాబాద్‌లో తన కొత్త శాఖను ప్రారంభించడంతో ఈ సంస్థ దక్షిణ భారతదేశంలోకి అడుగు పెట్టింది.

భైరవ అష్టమి మహోత్సవం

విశాలాంధ్ర-హైదరాబాద్: అఖిల భారతీయ బతుక భైరవ భక్త మండలి పార్శ్వ పద్మావతి శక్తి పీఠం, కృష్ణగిరి, తమిళనాడు పీఠాధిపతి డా. వసంత్ విజయ్ జీ మహారాజ్ ఆశీర్వాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం, పట్టణంలో జరిగిన 9 రోజుల భైరవ అష్టమి మహోత్సవంలో రెండు అద్భుతమైన ప్రపంచ రికార్డులు నెలకొల్పబడ్డాయి. మొదటగా, భైరవ దేవునికి 2024 రకాల మిఠాయిలు భోగంగా సమర్పించబడింది, ఇది ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ అద్భుతమైన కార్యం భారతదేశం, విదేశాలలో 50 విభిన్న సంస్థల వద్ద నమోదు చేయబడుతుంది. మరొక రికార్డు ఈ మహొత్సవంలో 84,000 చదరపు అడుగుల రంగోలీ రూపకల్పన ద్వారా సాధించబడింది, దీనిలో భారతీయ సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మిక గురువులు, మరియు జాతీయ నాయకుల చిత్రాలు ప్రతిబింబించబడ్డాయి.

రియల్ ఎస్టేట్ వృద్ధిలో హైదరాబాద్ అగ్రస్థానం

విశాలాంధ్ర-ముంబయి: నైట్ ఫ్రాంక్ ఇండియా యొక్క తాజా ఇండియా ప్రైమ్ సిటీ ఇండెక్స్ నివేదిక వివిధ గ్రోత్ మెట్రిక్‌లలో ఆరు ప్రధాన భారతీయ నగరాల పనితీరును అంచనా వేసింది. బలమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెరుగుతున్న రియల్ ఎస్టేట్ డిమాండ్, పెరుగుతున్న జనాభా, దాని సామాజిక-ఆర్థిక దృశ్యాన్ని మెరుగుపరిచే చురుకైన విధాన చర్యల ద్వారా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ఆవిర్భవించింది. బెంగళూరు రెండవ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ఉంది, ఎందుకంటే దాని అసాధారణమైన టాలెంట్ పూల్, డైనమిక్ బిజినెస్ ఎకోసిస్టమ్ వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తుంది. అదే సమయంలో, ముంబయి-అన్ని పారామితులలో స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తుంది, భారతదేశ ఆర్థిక రాజధానిగా దాని స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. ఢిల్లీ- దాని ఉన్నతమైన భౌతిక మౌలిక సదుపాయాలు మరియు పాలనలో అత్యున్నత స్థానంలో ఉంది.

ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ప్రారంభం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ తెలంగాణలోని వరంగల్‌లో తమ కొత్త బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది . ఆర్థిక సమ్మిళితను పెంపొందించడంతోపాటు తెలంగాణ ప్రజలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను అందించడంలో బ్యాంక్ నిబద్ధతకు ఈ విస్తరణ నిదర్శనం. ఈ ప్రారంభంతో, బ్యాంక్ తెలంగాణలో 5 బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లకు మరియు 26 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలను కవర్ చేస్తూ దేశవ్యాప్తంగా 986 బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లకు చేరుకుంది.

ఇండస్ట్రీ అడ్వైజరీ బోర్డు (ఐఏబి)ని ప్రారంభం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇండియా టూర్ 2024లో భాగంగా, యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యుఈఎల్) ఈరోజు హైదరాబాద్‌లో తమ ఇండస్ట్రీ అడ్వైజరీ బోర్డు (ఐఏబి)ని ప్రారంభించింది. ఈ ముఖ్యమైన మైలురాయి విశ్వవిద్యాలయం యొక్క మూడు-నగరాల పర్యటనలో రెండవ స్టాప్‌ని సూచిస్తుంది, ఇది విద్యా-పరిశ్రమ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం మరియు సస్టైనబుల్ విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఐఏబి ప్రారంభంతో పాటు జరిగిన హెచ్ఆర్ రౌండ్‌టేబుల్, డిజిటల్ పరివర్తన, ఉద్యోగుల అనుభవం , వైవిధ్యత చేరికలతో సహా మానవ వనరులలో తాజా పోకడలు, సవాళ్లను చర్చించడానికి పరిశ్రమ నాయకులు, విద్యావేత్తలు మరియు ప్రభుత్వ అధికారులను ఒకచోట చేర్చింది.

సంపాదకీయం

దిల్లీలో నిత్య నరకం

వాయు కాలుష్య సూచీ 5 వరకు ఉంటే ఫరవా లేదట. కానీ మన నగరాల్లో ఎందులోనూ ఈ సౌభాగ్యం లేదు. దిల్లీలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రతి ఏటా అక్కడ వాయుకాలుష్యం పెరగడమే తప్ప తగ్గుతున్న సూచనలు లేవు. తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలూ నామమాత్రమైనవే. కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ జాడే దిల్లీలో కనిపించడం లేదు. ఆయనను బీజేపీ మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల పర్యవేక్షకుడిగా పంపించింది. బుధవారంతో మహారాష్ట్రలో పోలింగ్ పూర్తి అయింది. ఇకనైనా ఆయన దిల్లీని పట్టించుకుంటారో లేదో తెలియదు. అంతమాత్రంచేత ఆయన చేతులు ముడుచుకుని ఖాళీగా కూర్చున్నారనుకోవడం పొరపాటే. ఆయన "ఎక్స్" (మునుపు ట్విట్టర్) ఖాతా చూస్తే ఆయన ఎంత తీరిక లేకుండా ఉన్నారో అర్థం అవుతుంది. చెట్లను పూజిస్తూ ఆయన ట్విట్టర్‌లో పెట్టిన ఫొటోలుచూసి ఎంత కఠిన హృదయులైనా కంట తడి పెట్టాల్సిందే. ఎప్పుడూ ఆయన తీరిక లేకుండానే ఉంటారు అనడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ట్వీట్లను మళ్లీ ట్వీట్ చేయడంలో ఎంతగా మునిగిపోతారో చూడాలంటే ఆయన ట్విట్టర్ ఖాతాను నిరంతరం గమనిస్తూ ఉండాల్సిందే. అన్నింటికీ మించి బీజేపీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం కాపాడుకోవడానికి ఎంత శ్రమపడాల్సి వస్తుందో! అక్కడితో ఆగరు. 40 పండగల సందర్భంగా ఆయన సర్వులకూ శుభాకాంక్షలు తెలిపారు. ఏ స్నేహితుడి పుట్టిన రోజు వచ్చినా మరిచిపోకుండా ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలియజేయడం భూపేంద్ర యాదవ్ మరిచిపోరు. అయితే నికోబార్‌లో తొమ్మిదిన్నర లక్షల చెట్లు నరికేసినా, ఛత్తీస్‌గఢ్‌లో హస్‌దేవ్ అడవుల పరిరక్షణకు ఉద్యమం జరుగుతున్నా ఆయన కిమ్మనరు. దిల్లీలోనే కాదు ఏ మూలన ఇసుమంత మంచి జరిగినా అది తమ ఘనతేనని దండోరా వేసుకునే మోదీ పరివారం దిల్లీ కాలుష్యం గురించి మాత్రం పట్టించుకోదు. అరవింద్ కేజ్రీవాల్ మంత్రివర్గంలో దిల్లీ పర్యావరణశాఖ మంత్రి గోపాల్ రాయ్ మాత్రం దిల్లీలో వాయు కాలుష్యంపై ఎన్నిసార్లు విలేకరుల సమావేశాలు నిర్వహించారో లెక్కే లేదు. దిల్లీ ప్రభుత్వం ఎంత అంగలార్చినా మోదీ సర్కారుకు పట్టదు. గత సెప్టెంబర్‌లో జైపూర్‌లో పరిశుభ్రమైన గాలిపై సదస్సు జరిగితే భూపేంద్ర యాదవ్ గుర్తు పెట్టుకుని మరీ హాజరయ్యారు. అక్కడ ఆయన "నీల్ గగన్, స్వస్థ్ పవన్" (నీలాకాశం, ఆరోగ్యకరమైన గాలి) అన్న నినాదం కూడా ఇచ్చారు. 150 నగరాలలో పరిశుభ్రమైన గాలి ఉండేలా చూస్తామని మోదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట బురుజులమీంచి ప్రసంగిస్తూ హామీ ఇచ్చిన అంశాన్ని గుర్తు చేయడం కూడా భూపేంద్ర యాదవ్ మరిచిపోరు. అంతకు ముంది మోదీ స్మార్ట్ సిటీలు ఏమైనాయో ఎవరికీ గుర్తులేవు. మోదీ మన సమస్యలను ఎంత మేరకు పట్టించుకుంటారో తెలియదు కానీ ఐక్యరాజ్యసమితికి అనేక పథకాలు సూచిస్తుంటారు. పర్యావరణహిత జీవనం గురించి దీక్షబూనాలని ఆయన ఐక్యరాజ్య సమితికి సలహా ఇచ్చారు. సలహా ఎటూ ఉచితమేగా! అంతకు ముందు యోగా దినోత్సవం నిర్వహించాలని చెప్తే ఐక్యరాజ్యసమితి అంగీకరించింది కదా. మోదీ పలుకుబడి ఆ స్థాయిలో ఉంటుంది మరి!

దిల్లీ చుట్టుపక్కల, పొరుగు రాష్ట్రాలలో పంట కోతలు ముగిసిన తరవాత మోడు కాలుస్తారు. ఆ పొగ అంతా దిల్లీని ఆవరిస్తుంది. అది ఈ ఏడాది 25 నుంచి 30 శాతం దాకా తగ్గిందట. మరి దిల్లీలో బుధవారం కూడా వాయు కాలుష్య సూచీ 422 ఎందుకు ఉందో మాత్రం జవాబు చెప్పేవారే ఉండరు. దిల్లీలోనే కాదు వాయు కాలుష్య ప్రభావం పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్‌ను కూడా పీడిస్తోంది. దిల్లీతో సహా అక్కడా పాఠశాలలు, కళాశాలలు మూసేశారు. దిల్లీలో 50 శాతం మంది మాత్రమే ఆఫీసులకు వెళ్లాలట. మిగతావారు కరోనా సమయంలోలాగా ఇంటినుంచే పనిచేయాలట. జనాన్ని ఇంటి నుంచి బయటకు రాకూడదంటున్నారు. డి.వై. చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న చివర్లో వాయు కాలుష్యం కారణంగా ఉదయం నడక కూడా మానేశారు. కానీ రోజూ నడిచి పనికి వెళ్లేవారు, సైకిళ్ల మీద వెళ్లేవారు, బస్సులకోసం రోడ్డు మీద వేచి ఉండక తప్పని వారు, సైకిళ్ల మీద వెళ్లే వారు అత్యంత ప్రమాదకరమైన స్థాయిలో ఉన్న కలుషిత గాలి పీల్చక తప్పదుగా. కాలుష్యం నుంచి కాపాడుకోవడం కోసం మాస్కులు ధరించాలని ప్రభుత్వం ఉచిత సలహా పడేసింది. అయితే రోజు కూలీలు, సామాన్యులు కనీసం 40 నుంచి 100, ఆ పైన ఉండే ఎన్.95 లేదా ఎన్.99 మాస్కులు కొనే పరిస్థితి ఎక్కడుంటుంది. వారికి ఉచితంగా మాస్కులు సరఫరా చేయాలన్న ఆలోచన మాత్రం ప్రభుత్వాలకు ఉండదు. కలుషిత గాలి పీలుస్తూ పనులకు వెళ్లే వారెవరూ ఈ కాలుష్యానికి కారకులుకారు. ఎక్కువ శిక్ష అనుభవించేది మాత్రం వారే. కాస్త కలిగిన వారు గాలిని శుభ్రపరిచే పరికరాలు కొనుక్కోవచ్చు. అవైనా ఇప్పుడు ప్రతిగదిలో ఒకటి ఉండాల్సిందే. వాయు కాలుష్యంవల్ల విమానాలు రద్దవుతున్నాయి. లేదా ఆలస్యం అవుతున్నాయి. వాయు కాలుష్యం 400 కన్నా పైన ఉంటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులు పాడైపోతాయి. కలుషిత వాయువు ఎక్కువకాలం పీలిస్తే మూత్రపిండాలు, మెదడు, కాలేయంవంటి ప్రధానాంగాలపై కూడా ఆ దుష్ప్రభావం ఉంటుంది. తల్లి కడుపులో ఉన్న పిల్లలకూ ప్రమాదమే. వాయు కాలుష్యంవల్ల బోలెడు కణరూప ద్రవ్యం శరీరంలోకి వెళ్తుంది. గాలి పీల్చడానికి కూడా అనువుగా లేకపోవడానికి ఎన్ని కారణాలైనా ఉండొచ్చు. వాహనాల నుంచి వెలువడే పొగ, పరిశ్రమలు వెదజల్లే విష వాయువులు, ధూళి ద్వారా కలుషితమయ్యే గాలి అనేక కారణాలు ఉంటాయి. అసలు సమస్య నివారణా మార్గాలేమిటి? ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇప్పటికే దేశ రాజధాని పరిధిలో ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరైనా వ్యాధితో బాధపడుతున్నారు. ప్రధానమంత్రి మోదీ ఈ సమస్యపై నోరే విప్పలేదు. పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ నికరంగా తీసుకున్న చర్యలే కనిపించవు. కరోనా సోకినప్పుడు మోదీ బాల్కనీల్లో నిలబడి చప్పట్లు కొట్టండి, కంచాలు తీసుకుని గరిటెలతో వాయించండి లాంటి మహా మంత్రోపదేశం చేశారు. ఇప్పటికైతే అలాంటి ఉచిత సలహా కూడా ఇవ్వలేదు. ఈ బాధ్యతా రాహిత్యం జీవించే హక్కునూ క్రమంగా లాగేయడమే. జనం గళమెత్తాల్సిన సమయం వచ్చింది.

మన అమ్ములపొదిలో బలమైన అస్త్రం

రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) 2024 నవంబర్ 16న ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి దేశీయంగా అభివృద్ధి చేసిన మొదటి సుదూర శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. దీనితో మన దేశ అమ్ములపొదిలో మరో బలమైన అస్త్రం చేరింది. ఈ హైపర్ సోనిక్ క్షిపణి సాయుధ దళాల కోసం 1,500 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధి వరకు వివిధ పేలోడ్లను మోసుకెళ్లేలా రూపొందించారు. ఈ క్షిపణిని వివిధ రేంజ్ వ్యవస్థలు ట్రాక్ చేశాయని, బహుళ ప్రాంతాలలో మోహరించాయని, డౌన్ రేంజ్ షిప్ స్టేషన్ల నుండి పొందిన ఫ్లైట్ డేటా విజయవంతమైన టెర్మినల్ విన్యాసాలు, ప్రభావాన్ని అధిక స్థాయి కచ్చితత్వంతో ధృవీకరించిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రయోగంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎంపికచేసిన కొన్ని దేశాల జాబితాలో మనదేశం చేరినట్లైంది. హైపర్‌సోనిక్ వెపన్ టెక్నాలజీలో చైనా, రష్యా, అమెరికా వంటి ప్రధాన సైనిక శక్తులతో పాటు భారతదేశాన్ని నిలబెట్టింది. ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్, ఇరాన్, ఇజ్రాయిల్‌తో సహా అనేక ఇతర దేశాలు కూడా హైపర్‌సోనిక్ క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ప్రాజెక్టులను మొదలుపెట్టాయి. ఈ క్షిపణిని హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిసైల్ కాంప్లెక్స్ ప్రయోగశాలలు, డీఆర్డీవో ప్రయోగశాలలు, పరిశ్రమలు భాగస్వామ్యమై దేశీయంగా అభివృద్ధి చేశాయి.

"ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారత్ కీలక మైలురాయిని సాధించింది. ఇది చారిత్రాత్మక ఘట్టం. గణనీయమైన విజయం మన దేశాన్ని ఇటువంటి క్లిష్టమైన అధునాతన సైనిక, సాంకేతిక పరిజ్ఞానాల సామర్థ్యాలను కలిగి ఉన్న ఎంపికచేసిన దేశాల సమూహంలో ఉంచింది. అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు డీఆర్‌డీఓ బృందానికి, మన సాయుధ దళాలకు అభినందనలు తెలియజేస్తున్నాను" అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేసారు.

ప్రత్యేకతలు – ఉపయోగాలు:

ఈ క్షిపణి రక్షణ దళాల ఉపయోగార్థం పదిహేనువందల కిలోమీటర్లకు మించిన పరిధి వరకు అనేక పేలోడ్లను మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంది. అత్యంత వ్యూహాత్మకంగా రూపొందించిన ఈ క్షిపణిని అగ్ని ప్రోగ్రామ్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అభివృద్ధి చేశారు. దీని వేగం మాక్ 5 కంటే ఎక్కువే ఉంటుంది. వేగాన్ని బట్టిచూస్తే ఈ క్షిపణిని శత్రుదేశ రాడార్లు గుర్తించడం కష్టతరం. వేగం, విన్యాసాల కలయికతో ప్రస్తుత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థలు దీన్ని అడ్డుకోలేవు. సాయుధదళాల రాకెట్ ఫోర్స్ కోసం ఈ క్షిపణిని అభివృద్ధి చేయడమే కాకుండా భూమి, గాలి, నౌకాదళ వేదికలకు అనుకూలమైనది. వేగం, చురుకుదనంతో ఆధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలను అధిగమిస్తుంది. సైన్యం, నౌకాదళం, వైమానిక దళం అంతటా బహుళ ఉపయోగాలు కలిగి ఉంది. నావికాదళ వెర్షన్ సుదూర శ్రేణుల వద్ద శత్రు యుద్ధనౌకలను లక్ష్యం చేసుకుని కచ్చితత్వంతో నాశనం చేస్తుంది. అంతే కాకుండా శత్రు వైమానిక వాహక నౌకలను కూడా లక్ష్యం చేసుకోగలదు. ఇది హిందూ మహాసముద్రాన్ని రక్షించడానికి కీలకమైన ఆయుధం. భూమి నుండే శత్రువుల వైమానిక స్థావరాలు వంటి అధిక సామర్థ్యం గల లక్ష్యాలను ఛేదించడానికి దీనిని మోహరించనున్నారు. మరో ప్రధానమైన విశేషం ఏంటంటే ఇది సంప్రదాయ లేదా అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

తొలి అడుగులు:

2019లో ప్రారంభించిన హైపర్‌సోనిక్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ వెహికల్ ప్రాజెక్ట్‌పై ఈ ప్రయోగం రూపొందించారు. సెప్టెంబర్ 2020 లోనే ధ్వనివేగం కంటే ఆరురెట్లు (మాక్ 6) వేగంగా ప్రయాణించగల ఏదైనా క్షిపణి రక్షణ రంగంలోకి చొచ్చుకుపోయే నూతన అత్యాధునిక ఆయుధాలను అభివృద్ధిచేసే దిశగా భారతదేశం తొలి అడుగులు వేసింది. అప్పట్లోనే ఒడిశా ప్రయోగ కేంద్రం నుండి మొదటిసారిగా హైపర్‌సోనిక్ టెక్నాలజీ డెమోన్‌స్ట్రేటర్ వెహికల్ (హెచ్ఎస్టీడివి) ఫ్లైట్ పరీక్షను డీఆర్‌డీఓ విజయ వంతంగా నిర్వహించింది. హైపర్‌సోనిక్ అత్యంత ఎక్కువ వేగంతో ప్రయాణించగల ఆయుధం. ఇది ధ్వని వేగం కంటే 5 నుండి 25 రెట్లు లేదా సెకనుకు 1 నుండి 5 మైళ్లు (1.6 నుండి 8.0 కిమీ/సె) వేగాన్ని కలిగి ఉంటాయి. హైపర్ సోనిక్ వ్యవస్థలు దశాబ్దాలుగా వాడుకలో ఉన్నాయి. హైపర్‌సోనిక్ ఆయుధం మొదటి రూపకల్పన సిల్బెర్వోగెల్. దీనిని 1930 లలో జర్మన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. జాన్ గ్లెన్ 1962 లో భూమి చుట్టూ మొదటి యుఎస్ క్రూడ్ ఫ్లైట్ నుండి భూమికి తిరిగి వచ్చినప్పుడు క్యాప్సూల్ హైపర్‌సోనిక్ వేగంతో వాతావరణంలోకి ప్రవేశించింది. ప్రపంచంలోని అణ్వాయుధాలలో ఉన్న అన్ని ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు హైపర్‌సోనిక్‌గా ఉంటాయి. అవి ఒకటి ఏరో-బాలిస్టిక్ రకం. హైపర్‌సోనిక్ ఏరో-బాలిస్టిక్ సిస్టమ్ ఎయిర్ క్రాఫ్ట్ నుండి జారవిడుస్తారు. రెండు గ్లైడ్ రక వాహనాలు. ఒక హైపర్‌సోనిక్ గ్లైడ్ వాహనం రాకెట్‌పై అధిక ఎత్తుకు పంపించగా ఆపై దాని లక్ష్యాన్ని చేరుకుంటుంది. మూడు క్రూయిజ్ క్షిపణులు. హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని రాకెట్ ద్వారా హైపర్‌సోనిక్ వేగానికి పెంచుతారు. ఆ వేగాన్ని కొనసాగించడానికి స్క్రామ్‌జెట్ అని పిలిచే ఎయిర్ బ్రీతింగ్ యంత్రాన్ని ఉపయోగిస్తుంది. ఈ వ్యవస్థ అత్యంత ముఖ్యమైన అధునాతనమైన భాగం. వ్యూహాత్మక క్షిపణులలో ఎలక్ట్రానిక్ సెన్సార్లు దాని నుండి విడుదలయ్యే, ప్రతిబింబించే శక్తిని గుర్తించడం ద్వారా లక్ష్యాన్ని గుర్తిస్తాయి.

జనక మోహన రావు దుంగ, సెల్: 8247045230

యుద్ధాన్ని ఉసిగొల్పిన బైడెన్

నిత్య చక్రవర్తి

ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరింత ఉసిగొలిపాడు. యుద్ధం మొదలై వేయిరోజులైంది. ఎక్కడ యుద్ధం జరిగినా తమకు వైరం గల దేశంపై యుద్ధానికి శ్రీకారం చుట్టిన దేశానికి అమెరికా అన్ని విధాలుగా సహకరిస్తుంది. ఉక్రెయిన్-రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని మరింత పెంచడానికి బైడెన్ ఉక్రెయిన్‌ను ప్రోత్సహించాడు. తొలినుంచి రష్యాపైకి ఉక్రెయిన్ యుద్ధాన్ని అమెరికా అనుమతించింది. అయితే రష్యా లోపలి ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సుదూర శ్రేణి క్షిపణులను (అటాకమ్స్) ప్రయోగించడానికి బైడెన్ మూడురోజుల క్రితం అనుమతించారు. వారం రోజులక్రితం ఇటీవల ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాతనే బైడెన్ రష్యాపై దాడికి అనుమతించారు. మంగళవారం ఆరు అటాకమ్స్ క్షిపణులను రష్యాపైకి ఉక్రెయిన్ ప్రయోగించింది. అయితే ఐదు క్షిపణులను మధ్యలోనే కూల్చి వేశామని, ఆరవ క్షిపణి మూలంగా మంటలురేగాయేగాని ఎవరూ మరణించలేదని రష్యా తెలిపింది. యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకున్నదని తాము భావిస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. యుద్ధం కొత్త మలుపు తిరిగిందని భావించవలసి వస్తోంది. నాటో దేశాలలో కొన్ని దేశాలు ఆందోళన చెంది, తమ దేశ ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిణామాలతో అణ్వాయుధాల ప్రయోగానికి రష్యా సిద్ధంకావచ్చునని అనుకుంటున్నారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ పుతిన్‌తో మాట్లాడారు. రష్యాకు తోడ్పాటు అందించడానికి సిద్ధమయ్యారు. ఎక్కువ క్షిపణులుఉత్పత్తి చేయాలని తమ దేశ ఆయుధ నిపుణులను ఆదేశించారు.

ప్రపంచయుద్ధ పరిస్థితి తలెత్తుతుందా అని అంతర్జాతీయంగా అనేకమంది భావిస్తున్నారు. బైడెన్ ఉసిగొల్పడంతో ఉక్రెయిన్ యుద్ధం కొత్తమలుపు తిరిగింది. ఇది ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా అనేది పెద్ద సందేహమే. అయితే ట్రంప్ జనవరి 20న రెండవసారి అధ్యక్షుడిగా పదవీస్వీకారం చేసిన తర్వాత కాల్పుల విరమణకు చర్చలు జరగవచ్చునని కూడా అనుకుంటున్నారు. ఆయుధాలు, డబ్బు ఉక్రెయిన్‌కు అందించిన బైడెన్ చర్చలకు సానుకూలత ప్రకటించినట్లుగా నటించాడు. అయితే ట్రంప్‌తో చర్చల అనంతరం అత్యంత వేగంగా 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలిగిన సామర్థ్యమున్న మిసిలీని రష్యాపై దాడికి ఉపయోగించవచ్చునని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అనుమతిచ్చారు. బైడెన్‌కి పెద్దగా ప్రాముఖ్యత ట్రంప్ ఇవ్వలేదని అమెరికా మీడియా వర్గాలు తెలిపాయి. అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నతర్వాత నా దారిన నేను వెళతానని ట్రంప్ చెప్పినట్లుగా మీడియా వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ జనవరి 2025 జనవరి 20న పదవీ బాధ్యతలు తీసుకుంటారు. ఆ తరువాత శాంతి ప్రణాళికను ట్రంప్ తీసుకుంటారని ఉక్రెయిన్‌తో చర్చలు జరుపుతారని ట్రంప్ సలహాదారులు వివిధ ఇంటర్వ్యూలలో సూచనప్రాయంగా తెలిపారు.

జెలెన్‌స్కీ పుతిన్‌తో మాట్లాడాలని కూడా ట్రంప్ సలహాదారులు సూచనలిచ్చినట్లుగా తెలుస్తోంది. ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి ప్రణాళికకు ట్రంప్ ప్రయత్నిస్తారన్న అంశంపై నాటో దేశాలు ఆందోళన చెందుతున్నాయి. దీనివల్ల రష్యా పైచేయి సాధిస్తుందని ఆయా దేశాలు భావిస్తున్నాయి. ఇదే జరిగితే పుతిన్ ఐరోపా తూర్పు ప్రాంతానికి విస్తరించే అవకాశంఉందని నాటో సభ్యదేశాలు అనుకుంటున్నాయి. హంగరీ, పోలెండ్ దేశాలు రష్యా అంటే ఆందోళన చెందుతున్నాయని, కొన్ని స్కాండినేవియా దేశాలు కూడా భావిస్తున్నాయని చెబుతున్నారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యత తీసుకున్నతర్వాత అమెరికా విదేశాంగ విధానంలో మార్పువచ్చే అవకాశం ఉందని జెలెన్‌స్కీ భావిస్తున్నాడు. ఐరోపా పార్లమెంటులో ఈ వారంలో మాట్లాడిన జెలెన్‌స్కీ నిజమైన శాంతిని కోరినట్లు తెలుస్తోంది. ట్రంప్ పదవీస్వీకారం తర్వాత అమెరికా సహాయం లభించడం సందేహమేనని జెలెన్‌స్కీ భావిస్తున్నారు. రష్యా మరింత ముందుకురాకుండా నిలువరించేందుకు ఉక్రెయిన్ సైనిక దళాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ రంగంలోకి వస్తే తాను బేరసారాలాడే పరిస్థితికి రావచ్చునని జెలెన్‌స్కీ అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ట్రంప్ అధికారం చేపట్టడానికి రావడానికి దాదాపు మరో 60 రోజులు పడుతుంది. ఈ లోపు అమెరికా నుంచి మరిన్ని క్షిపణులను తెప్పించుకుని రష్యన్లను మరింతగా బాధించాలని జెలెన్‌స్కీ భావిస్తున్నారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంథోని బ్లింకెన్ గత వారం ఇలా చెప్పాడు...జనవరి 20కి, ప్రస్తుతానికి మధ్య అవకాశంఉన్న ప్రతి డాలరు ఉక్రెయిన్‌కి అందించడానికి ప్రయత్నిస్తామని బ్లింకన్ అన్నాడు. ఇంతకాలం ఉదారంగాఉన్న బైడెన్ ఇప్పుడు ఉక్రెయిన్‌కి సహాయం చేయడంలో కొన్ని చట్టపరమైన మార్పులుచేశారని ఇది దురదృష్టకరమని జెలెన్‌స్కీ అన్నాడు. ట్రంప్ విదేశాంగ విధానంలో మార్పులు చేసినట్లయితే తమకు సహాయం చేయడం సందేహమేనని జెలెన్‌స్కీ అధికారికంగా చెప్పాడు.



> **ప్రపంచయుద్ధ పరిస్థితి తలెత్తుతుందా అని అంతర్జాతీయంగా అనేకమంది భావిస్తున్నారు. బైడెన్ ఉసిగొల్పడంతో ఉక్రెయిన్ యుద్ధం కొత్తమలుపు తిరిగింది. ఇది ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా అనేది పెద్ద సందేహమే. అయితే ట్రంప్ జనవరి 20న రెండవసారి అధ్యక్షుడిగా పదవీస్వీకారం చేసిన తర్వాత కాల్పుల విరమణకు చర్చలు జరగవచ్చునని కూడా అనుకుంటున్నారు.**

ఇప్పటికే ఇరాన్ డ్రోన్లతో దాడిచేసింది. ఉత్తరకొరియా యుద్ధ ట్యాంకులు, బాలిస్టిక్ మిసిలీలు రష్యాకు అందించవచ్చు. ఉత్తరకొరియాకు సంబంధించిన 11వేల సైనికదళాలను రష్యా ఉక్రెయిన్‌వైపు సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తోంది.వీరు ఉక్రెయిన్ దళాలతో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉక్రెయిన్ దళాలు కూడా రష్యా కురిస్క్ ప్రాంతంలో నిలపనున్నట్లు సమాచారం అందుతోంది. రష్యా, చైనా, ఉత్తరకొరియాలు ఒక్కటి కానున్నాయని ఈ పరిణామం వ్యూహాత్మక మిలిటరీ ట్రూపు అవుతుందని తెలుస్తోంది. చైనా మాత్రం తన సైనికదళాలను వీరికితోడుగా పంపకపోవచ్చు. రష్యా, చైనా, ఉత్తరకొరియాలు ఒక్కటైతే పాశ్చాత్య దేశాలను ఎదుర్కొనేందుకు రష్యాకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. తమ దేశంలో ఆక్రమించుకున్న ప్రాంతాలనుంచి రష్యా ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌ను జెలెన్‌స్కీ విడిచిపెట్టలేదు. భవిష్యత్తులో రష్యానుంచి నాటో దేశాలు కాపాడలేకపోవచ్చునని ఉక్రెయిన్ భావిస్తోంది.

రష్యా కూడా ఉక్రెయిన్ సైనిక దళాలు తమ ప్రాంతంలో ఆక్రమించుకున్న ప్రదేశాల నుంచి తక్షణం ఉపసంహరించుకోవాలని పుతిన్ కోరుతున్నారు. చర్చలకు తానుసిద్ధంగానే ఉన్నానని అయితే ఉక్రెయిన్ ప్రయోజనాలకు రక్షణ, భద్రత కావాలని జెలెన్‌స్కీ అంటున్నారు. ఉక్రెయిన్-రష్యాలు శీతాకాల నెలల్లో తీవ్రంగానే పోరాడే అవకాశంఉంది. సరిహద్దుల్లో కొన్ని సర్దుబాట్లతో శాంతి ప్రణాళికను ట్రంప్ రూపొందిస్తారని ఆయన సలహాదారులు అంటున్నారు. పుతిన్‌ను ఇబ్బందిపెట్టే అవకాశం లేదు. రష్యాపైన సాంకేతికంగా అత్యంత సమర్ధమైన క్షిపణులను ప్రయోగించినప్పటికీ పుతిన్ బలమైన స్థానంలోనే ఉంటారని చెబుతున్నారు. ట్రంప్ ఏ చర్యలు తీసుకున్నా అమెరికా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే వ్యవహరిస్తారు. ఏదో విధంగా ఉక్రెయిన్-రష్యాల మధ్య శాంతిని నెలకొల్పితే అంతర్జాతీయ దౌత్యంలో ట్రంప్ పెద్ద విజయం సాధించినట్లే.

ఎండమావులను తలపిస్తున్న ఆంధ్ర బడ్జెట్

డా. అఖిల మిత్ర

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమర్పించిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర బడ్జెట్, సంక్షిప్త నాలుగు నెలల వ్యవధిలో ప్రతిపాదిత రూ. 2.94 లక్షల కోట్ల వ్యయ సాధ్యాసాధ్యాలను ప్రశ్నిస్తున్న వర్గాల్లో ఆందోళనలను లేవనెత్తింది. దాదాపు రూ.లక్ష కోట్ల లోటుతో కూడిన బడ్జెట్, స్వల్ప వ్యవధిలో వాగ్దానాలను నెరవేర్చగల సామర్థ్యంపై చిత్తశుద్ధి లేదనిపిస్తుంది.

బడ్జెట్ లక్ష్యాల సాధ్యత గురించి ఆందోళన వ్యక్తం అవుతోంది. నీటిపారుదల రంగానికి రూ.16,705 కోట్ల కేటాయింపులు ఆశాజనకంగా కనిపిస్తున్నా, ప్రత్యేకించి గత ఏడాదితో పోలిస్తే, ఇంత తక్కువ సమయంలో ప్రాజెక్టులను అమలు చేయడం పెద్ద అడ్డంకిగా మిగిలిపోయింది. చాలా నిధులు పోలవరం ప్రాజెక్టు వైపు మళ్లే అవకాశం ఉంది. రాయలసీమ ఇతర ప్రాంతాలలో చేపట్టే కార్యక్రమాలకు స్వల్పంగా మిగిలిపోతుంది. ఇది ప్రాంతీయ ప్రాజెక్టులపై కనిష్ట ప్రభావాన్ని చూపుతోంది. ఈ బడ్జెట్ లాంఛనప్రాయంగా కనిపిస్తోంది. వచ్చే బడ్జెట్‌లో మాత్రమే ప్రభుత్వ ప్రాధాన్యతలు నిజంగా బయటపడే అవకాశం ఉంది. ఎన్నో వాగ్దానాలుచేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బడ్జెట్‌లో 'సూపర్ సిక్స్' వంటి కార్యక్రమాలతో సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించలేదు. యువత నైపుణ్యాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి రంగాలు గుర్తించదగిన శ్రద్ధను కనబరచలేదు. స్థిరమైన ఉపాధిని పెంపొందించడానికి ఎంఎస్‌ఎంఈలకు అదనపు మద్దతు ఇవ్వాలి. కొనసాగుతున్న ప్రాజెక్టులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్త కార్యక్రమాలను ప్రారంభించే బదులు, స్పష్టమైన ఫలితాలను సాధించడానికి రాష్ట్రం ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాధాన్యతనివ్వాలి. బడ్జెట్‌లో పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ విద్యుత్ సరఫరాకు కేటాయింపులు ఉండగా, ఈ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో ఇబ్బంది ఉంది. కాగితంపై కేటాయింపులు ఆశాజనకంగా కనిపిస్తున్నా పంటల బీమా కోసం రూ.1,025 కోట్లు, వడ్డీ లేని రుణాల్లో రూ.628 కోట్లు రైతులకు నిజంగా చేరేలా చూడడం చాలా పెద్ద పని.

పేద విద్యార్థుల ఉన్నత విద్యకు కూటమి సర్కారు మోకాలొడ్డుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, మెయింటెనెన్స్ చార్జీలు కేటాయింపుల్లో భారీగా కోత విధించింది. ఇది సుమారు 12 లక్షల ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర ప్రభావం పడింది. ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం సుమారు 2700 కోట్లు నుంచి 2800 కోట్లు వ్యయమవుతుంది. ఫీజు రీయింబర్స్ మెంట్ కింద 1766 కోట్లు, మెయింటెనెన్స్ కింద 776 కోట్లు కలిపి మొత్తం 2542 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో 75 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా అలాగే యశస్వి పథకం కింద మరో 356 కోట్లు కేటాయించింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ప్రజల ఆశలకు అనుగుణంగాలేదు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపుల్లో కోత స్పష్టంగా కనిపిస్తోంది. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలను పునరావృతం చేయడం మినహా ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టత లేదు. రూ.43,402 కోట్లతో అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌దీ అదేదారి. మొత్తంగా, ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనారిటీల సంక్షేమానికి నామమాత్రంగానే నిధులు విదిల్చారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలుతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో సరిపెట్టారు. మిగతా హామీల అమలుపై నిర్దిష్టత లేదు.

20 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు, రూ.3000 నిరుద్యోగ భృతిపై దాటవేశారు. 16,347 పోస్టుల భర్తీకి జారీ చేసిన మెగా డిఎస్‌సిని ప్రస్తావించిన ఆర్థిక మంత్రి ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి, జిఓ నెంబరు 3 పునరుద్ధరణ గురించి నోరుమెదపలేదు. ప్రతి రైతుకూ ఏటా రూ.20,000 ఆర్థిక సాయం అందిస్తామన్న అన్నదాత సుఖీభవ పరిస్థితీ అలానే ఉంది. రాష్ట్రవ్యాప్త పోరాటాల ద్వారా కౌలు రైతులు సాధించుకున్న కౌలురైతు చట్టాన్ని గత సర్కారు నీరుగార్చడంతో లబ్ధిదారుల సంఖ్య ఘోరంగా పడిపోయింది. పంట రుణాలు, గిట్టుబాటు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రకృతి ప్రకోపానికి బలైనప్పుడు నష్టపరిహారం తదితర ప్రయోజనాలు కలగాలంటే ప్రస్తుత చట్టాన్ని సవరించాల్సిందే! ఎన్నికల హామీల మేరకు కౌలు రైతుల, రైతు సంఘాల అభిప్రాయాలకు అనుగుణంగా మార్పులుచేసి ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కొత్త చట్టాన్ని ఆమోదించి, దాదాపు 25 లక్షలుగా ఉన్న కౌలు రైతులను ఆదుకోవడం కనీస ధర్మం. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అనిచెప్పినా, నిర్వాసితులను పట్టించుకున్న పాపానపోలేదు. జనాభా ప్రాతిపదికన ఆదివాసీలకు 6.59 శాతం నిధులు ఇవ్వాల్సి ఉండగా, కేటాయించింది రూ.7,557 కోట్లు అంటే 2.57 శాతం మాత్రమే. రాష్ట్రంలో 17 శాతంగా ఉన్న దళితులకు రూ.18,497 కోట్లు అంటే 6.28 శాతం మాత్రమే కేటాయించింది. గతంతో పోల్చినా రూ.1507 కోట్లు తగ్గాయి.

ఆకాశంలో సగం, అవకాశాల్లో సగంగా ఉండాల్సిన మహిళలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడంపై చూపే ఆత్రం పథకాల అమలులో కానరావడంలేదు. 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున అందిస్తామన్న 'మహాశక్తి' జాడే లేదు. తల్లికి వందనం పథకం కింద విద్యార్థికి రూ.15 వేలు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 80 లక్షల మంది తల్లులకు చెల్లించేందుకు రూ.10 వేల కోట్లకుపైగా కేటాయించాల్సి ఉండగా, విదిల్చింది రూ.2,491 కోట్లే! బాలబాలికలకు, బాలింతలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు పెండింగ్‌లో ఉన్న వేతన పెంపు గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కార్మికులు, స్కీమ్ వర్కర్ల వేతన పెంపు, సామాజిక భద్రత ఊసే లేదు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా వేల కోట్ల ట్రూఅప్ భారం మోపుతున్నారు. 59.81 లక్షల స్మార్ట్ మీటర్ కనెక్షన్లు బిగిస్తామనడం గతంలో టీడీపీ విమర్శించినట్టు అదానీ, షిరిడీసాయి ఎలక్ట్రికల్ కంపెనీలకు దోచిపెట్టడమే.

ఇటీవల కాలంలో తరచూ సంభవిస్తున్న తాగునీటి కాలుష్యం, ఆకస్మిక భారీ వర్షాలతో నీట మునగడం వంటి ఘటనల గురించి ప్రస్తావనకానీ, పరిష్కారంకానీ లేనే లేదు. కార్మికులు, సామాజిక భద్రతవంటి అంశాల జాడేలేదు. అమరావతి రాజధాని నిర్మాణానికి అంతర్జాతీయ ఫైనాన్స్ సంస్థల నుంచి కేంద్రం ఇప్పిస్తామన్న రూ.15 వేల కోట్లు గ్రాంటో? రుణమో? తేల్చలేదు. కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, విద్యారంగానికి కేటాయించింది 9.8 శాతం నిధులే. నాడు-నేడు పనుల పూర్తికి, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలు, 12వ పిఆర్‌సికి సంబంధించిన అంశాల ప్రస్తావనేలేదు. రాష్ట్రంలో ప్రతి పౌరుడిపై లక్షా 44 వేల అప్పులభారం పడిందన్న ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మరో రూ.68,743 కోట్ల భారాన్ని మోపడం అన్యాయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి సర్కారు అమలు చేస్తుందని జనం ఎదురుచూస్తున్నారు కనక వాటిని నెరవేర్చేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి.

సెల్: 9989988912

ఓటేసిన సచిన్, అక్షయ్, రితేశ్

ముంబై: మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. సరిగ్గా ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. జార్ఖండ్ అసెంబ్లీకి రెండో విడత పోలింగ్, ఉత్తరప్రదేశ్‌లో ఉపఎన్నిక జరుగుతోంది. మహారాష్ట్ర కన్నా జార్ఖండ్ ప్రజలు ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. కాగా, దేశ ఆర్థిక రాజధాని ముంబైలో సెలబ్రిటీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సినీ తారలు, ప్రముఖ క్రికెటర్లు, నేతలు క్యూ లైన్‌లో నిల్చొని ఓటు వేశారు. సచిన్ టెండూల్కర్ కుటుంబంతో వెళ్లి ఓటేశారు. అలాగే నటులు అక్షయ్ కుమార్, రితేశ్, జెనీలియా తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బాలీవుడ్ ప్రముఖ నటి మాధురీ దీక్షిత్, రకుల్ ప్రీత్‌సింగ్, జాకీ భగ్నానీ, అర్జున్‌కపూర్, ప్రేమ్ చోప్రా, సింగర్ కైలాశ్ ఖేర్, సునీల్‌శెట్టి, సైఫ్ అలీఖాన్, కరీనాకపూర్, పూనమ్ దిల్లాన్, జునైద్ ఖాన్, జావెద్ అక్తర్, మనీశ్ మల్హోత్ర, గాయకుడు శంకర్ మహదేవన్, డైరెక్టర్ రోహిత్ శెట్టి తదితరులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మేం ఓటేశాం.. మీరు మీ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. 'పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చక్కగా ఉన్నాయి. వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరు ఓటు వేయండి. అన్నింటి కన్నా ముఖ్య విషయం ఓటు వేయడం అని' బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ కోరారు.

సంపన్నులు ఓటేయరు

హర్ష్ గోయెంకా

ముంబై: ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ... ఎన్నో విషయాలను పంచుకుంటూ ఉంటారు. ఆయన పోస్టులు, వీడియోలు స్ఫూర్తి కలిగించడంతో పాటు అందరినీ ఆలోచింపజేస్తాయి. కాగా మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మలబార్ హిల్‌లో సంపన్నులు ఓటేయరని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ గోయెంకా సోషల్ మీడియాలో చేసిన పోస్టు వైరల్‌గా మారింది. అందులో ఆయన మలబార్ హిల్‌లో సంపన్నులు పోలింగ్ కేంద్రానికి మెర్సిడెస్ బెంజ్‌లో వెళ్లాలా? బీఎండబ్ల్యూలో వెళ్లాలా అని చర్చిస్తూ కూర్చుంటారని అన్నారు. మనీశ్ మల్హోత్రా అవుట్‌ఫిట్‌కు ఏ కళ్లజోడు పెట్టుకుంటే నప్పుతుందోనని తెగ కష్టపడుతుంటారని, అంతవరకు ప్రజాస్వామ్యం వేచి చూడాల్సిందేనని అసహనం వ్యక్తంచేశారు. పోలింగ్ బూత్ వద్ద వాలెట్ పార్కింగ్ ఉందా లేదా అని ఆలోచిస్తారన్నారు. వారికి అంతకంటే మరే ఆలోచనలు ఉండవని, క్యూలో సాధారణ ప్రజలతో కలిసి వెళ్లి ఓటు వేయాల్సివస్తుందని సంపన్నులు భయపడుతున్నారని గోయెంకా పేర్కొన్నారు.

ఏఆర్ రెహమాన్ దంపతుల విడాకులు

ముంబై: ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ దంపతులు తమ వివాహ బంధానికి స్వస్తి పలికారు. పరస్పర అంగీకారంతో రెహమాన్, ఆయన భార్య సైరా బాను విడిపోతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దంపతుల తరఫున ప్రముఖ న్యాయవాది వందనా షా ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎన్నో ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతూ విడాకులు తీసుకోవడానికి రెహమాన్, సైరా బాను నిర్ణయం తీసుకున్నారు. వారి బంధంలో భావోద్వేగపూరిత ఒత్తిడి నెలకొంది. దీంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఒకరిపై మరొకరికి గాఢమైన ప్రేమ ఉన్నప్పటికీ ఉద్రిక్తతలు, ఇబ్బందులు వారి మధ్య అధిగమించలేని దూరాన్ని సృష్టించాయి' అని వందనా షా పేర్కొన్నారు. రెహమాన్ దంపతుల దాంపత్యానికి 29 ఏళ్లు. 1995లో వారు పెళ్లి చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు-ఖతీజా, రహీమా, అమీన్ ఉన్నారు. సైరాతో వివాహాన్ని తన తల్లి నిశ్చయించారని గతంలో ఓ ఇంటర్వ్యూలో రెహమాన్ తెలిపారు. 'సినిమాలకు సంగీతం అందిస్తూ ఫుల్ బిజీగా ఉండేవాడిని. 29 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకుంటా... అమ్మాయిని చూడు అని అమ్మకు చెప్పా' అని పేర్కొన్నారు. విడాకులపై ఏఆర్ రెహమాన్ స్పందించారు. 'మా వైవాహిక బంధం త్వరలోనే 30 ఏళ్లకు చేరుతుందని సంతోషించాం. అయితే అనుకోని విధంగా ముగింపు పలకాల్సి వచ్చింది. విరిగిన హృదయాలు దేవుడిని సైతం ప్రభావితం చేస్తాయి. పగిలిన ముక్కలు మళ్లీ యథావిధిగా అతుక్కోలేవు. అయినప్పటికీ మా దారుల్లో అర్థాన్ని వెతుక్కుంటాము. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో స్నేహితులు మా వ్యక్తిగత గోప్యతను అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం' అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

ఉప ఎన్నికల్లో బీజేపీ అక్రమాలు

- బురఖా ధరించిన మహిళల తనిఖీ
- సమాజ్‌వాది పార్టీ ఆరోపణ
- ఏడుగురు పోలీసులపై ఈసీ వేటు

లక్నో : ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉప ఎన్నికలను తారుమారు చేసి గెలవడానికి అధికార బీజేపీ పరిపాలనా యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసిందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బుధవారం ఆరోపించారు. వివిధ నియోజకవర్గాల్లో జరిగిన అక్రమాలపై తమ పార్టీ ఎన్నికల సంఘానికి (ఈసీ) ఫిర్యాదు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. ఇక్కడ విలేకరులతో అఖిలేశ్ మాట్లాడుతూ కర్హల్, సిసమావు, మీరాపూర్, కుందర్కి, ఫుల్‌పూర్, మజ్వాన్‌తో సహా అనేక నియోజకవర్గాల్లో అక్రమాలపై ఫిర్యాదులు చేశామని, ఇన్ని ఫిర్యాదులు వచ్చినా ఎన్నికల సంఘం కళ్లు మూసుకున్నట్లు కనిపిస్తోంది' అని పేర్కొన్నారు. ఈ ఉప ఎన్నికలను ఓట్ల ద్వారా కాకుండా అవకతవకల ద్వారా గెలవాలని బీజేపీ కోరుకుంటోందని మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. ఓటమి భయంతో అధికార పక్షం అన్యాయం చేయాలని పాలనా యంత్రాంగంపై ఒత్తిడి తెస్తోందని అన్నారు. ఎస్పీ గతంలో చేసిన ఫిర్యాదులకు ప్రతిస్పందనగా జారీ చేసిన ఎన్నికల కమిషన్ ఆదేశాలను అఖిలేశ్ ప్రస్తావిస్తూ, 'పోలీసులు ఎవరినీ ఆపడం, సోదాలు చేయడం లేదా ఐడీ కార్డులను తనిఖీ చేయడం వంటివి చేయరాదని ఈసీ స్పష్టంగా ఆదేశించింది. అయినప్పటికీ, తాము ప్రజాభిమానాన్ని కోల్పోతున్నామని తెలిసే బీజేపీ నిజాయితీ లేని చర్యలకు పాల్పడుతోంది' అని ఆరోపించారు. అంతకుముందు రోజు, ఉత్తర ప్రదేశ్ ఉప ఎన్నికల్లో ఓటర్లను తనిఖీ చేయడం, ఓటు వేయకుండా ఆపడంపై తన మార్గదర్శకాలను ఉల్లంఘించిన పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈ క్రమంలో వీడియో సాక్ష్యం ఆధారంగా ఓటరు కార్డులు, వ్యక్తుల ఆధార్ గుర్తింపు కార్డులను తనిఖీ చేస్తున్న పోలీసులందరినీ సస్పెండ్ చేయాలని ఎన్నికల సంఘాన్ని అఖిలేశ్ కోరారు. ప్రత్యర్థి పార్టీలకు ఓటు వేయాలనుకునే చాలా మంది తమ మద్దతుదారులను ఓట్లు వేయకుండా బీజేపీ నిరోధిస్తోందని ఆరోపించారు. 'చాలా మంది వారి స్వంత వ్యక్తులు వారిని వ్యతిరేకిస్తున్నారు. వారి ఓటర్లు దూరంగా ఉన్నారు. వారికి వ్యతిరేకంగా ఓటు కూడా వేస్తున్నారు. వారి ఓటర్లు ఓటు వేయడానికి రాకపోవడంతో బీజేపీ మా మద్దతుదారులను ఓటు వేయకుండా నిరోధించడానికి పోలీసులను ఉపయోగిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నైరాశ్యం అధికారాన్ని చేజిక్కించుకోవడాన్ని సూచిస్తోందని అన్నారు. ఇదిలాఉండగా, ఓటు వేసేందుకు వచ్చిన బురఖా ధరించిన ముస్లిం మహిళలను పోలీసులు తనిఖీ చేయడంపై సమాజ్‌వాది పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. మరోవైపు, బురఖా ధరించిన ఓటర్ల గుర్తింపును సరిగ్గా తనిఖీ చేయాలని బీజేపీ ఎన్నికల సంఘాన్ని కోరింది.

పోలీసులపై ఈసీ చర్యలు

ఉప ఎన్నికల్లో ఓటరు గుర్తింపు కార్డుల తనిఖీలకు సంబంధించి తలెత్తిన వివాదంపై ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించింది. సమాజ్‌వాదీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓటరు మార్గదర్శకాల ఉల్లంఘనకు పాల్పడిన ఏడుగురు పోలీసులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చింది. సస్పెండైన వారిలో కాన్పూర్, ముజఫర్‌నగర్ జిల్లాలకు చెందిన చెరో ఇద్దరు అధికారులు, మొరాదాబాద్ నుంచి ముగ్గురు అధికారులు ఉన్నారు. 'అర్హత కలిగిన ఓ ఒక్కరిని ఓటు వేయకుండా అడ్డుకోరాదు. ఓటింగ్ సమయంలో ఎలాంటి వివక్షను సహించేది లేదు. ఫిర్యాదు అందితే వెంటనే విచారణ ఉంటుంది. దోషిగా తేలితే వారిపై కఠిన చర్యలు ఉంటాయి' అని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఫిర్యాదులు అందిన తక్షణమే చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారుని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో తెలియజేయాలని కూడా ఆయన ఆదేశాలు ఇచ్చారు.

'బిట్‌కాయిన్'పై బీజేపీ ఆరోపణలు అవాస్తవం: సూలే

ముంబై: ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే బుధవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను అక్రమ బిట్‌కాయిన్ లావాదేవీలకు పాల్పడినట్లు బీజేపీ చేస్తున్న ఆరోపణలు కొట్టిపారేశారు. బిట్ కాయిన్లపై ప్రచారంలో ఉన్న స్వరం నోట్స్, సందేశాలన్నీ నకిలీవని, అది తన వాయిస్ కాదని సుప్రియ పేర్కొన్నారు. కావాలనే బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది తనపై బురదజల్లే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేవు గనుకనే పోలీసులు తనను అరెస్టు చేయరనే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై ఇప్పటికే సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశానన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేసినందుకు ఎంపీ సుధాంశు త్రివేదికి పరువునష్టం దావా నోటీసులు పంపినట్లు వెల్లడించారు. ఈవిషయంపై ఎక్కడికి వచ్చి సమాధానం చెప్పమన్నా తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ఎన్సీపీ నేత అజిత్ పవార్ మాట్లాడుతూ తన సోదరి సుప్రియా వాయిస్ ఎలా ఉంటుందో తనకు తెలుసునని అన్నారు. ఆడియో క్లిప్‌లలో వాయిస్‌పై విచారణకు మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. మరోవైపు ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ తన కుమార్తెకు మద్దతు ఇస్తూ, ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయగల సామర్థ్యం కేవలం బీజేపీకి మాత్రమే ఉందని విమర్శించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సుధాంశు త్రివేది వివిధ ఆడియో క్లిప్‌లను వినిపించి.. సుప్రియా సూలే, మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే, మాజీ పోలీసు కమిషనర్, ఇతరులతో కలిసి అక్రమ బిట్‌కాయిన్ లావాదేవీలకు పాల్పడ్డారని ఆరోపించారు. మాజీ పోలీసు అధికారి, డీలర్‌కు మధ్య జరిగిన చాట్‌ల స్క్రీన్‌షాట్‌లను కూడా పంచుకున్నారు. ఎన్నికల ఫలితాలను ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీకి అనుకూలంగా మార్చడానికి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. మహారాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి వినోద్ తావ్డే ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే సుప్రియా సూలే, కాంగ్రెస్ చీఫ్ నానా పటోలేపై బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం గమనార్హం.

గ్యాంగ్‌స్టర్లకు దిల్లీ వేదికైంది: ఆతిశీ

న్యూదిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాంగ్‌స్టర్లకు దిల్లీ... రాజధానిగా మారిందన్నారు. ఇటీవల హత్యకు గురైన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆమె... కేంద్రమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దిల్లీలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. ఇటీవల సుందర్ నగర్‌లో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళను వేధిస్తుండగా... ఆమె కుటుంబీకులు, బంధువులు ఆ యువకులను మందలించారు. అనంతరం ఆ ఇద్దరు కత్తులతో చేసిన దాడిలో 28 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీఎం ఆతిశీ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొన్న ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. 'దిల్లీ గ్యాంగ్‌స్టర్లకు రాజధానిగా మారింది. నేరస్థులు, దోపిడీదారులు, గూండాలకు భయం లేకుండా పోయింది. ఇప్పుడు ఒక వ్యక్తి ప్రాణాలు బలి తీసుకున్నారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేరని రెచ్చిపోతున్నారు. దేశ హోంమంత్రి అమిత్ షా నుంచి ఓ విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. దిల్లీ శాంతిభద్రతల బాధ్యత తన చేతుల్లోకి వచ్చాక ఆయన ఏం చేశారు? శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. దోపిడీలు, హత్యలు పెరిగిపోతున్నాయి. అయినప్పటికీ... ఆయనకు ప్రచారం తప్ప వేరే బాధ్యతలు లేనట్లుగా అనిపిస్తోంది' అని ఆతిశీ విమర్శించారు.

ఐదు బొగ్గు ట్రక్కులకు మావోయిస్టుల నిప్పు

రాంచీ: జార్ఖండ్‌లోని లతేహర్ జిల్లాలో మావోయిస్టులు అయిదు ట్రక్కులకు నిప్పు పెట్టారు. హెరాంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న లాత్ అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. లతేహర్‌లో బొగ్గు ప్రాజెక్టు వద్ద బొగ్గును ఖాళీ చేసి తిరిగి వస్తున్న ట్రక్కులకు నిషేధిత జార్ఖండ్ ప్రస్తుతి కమిటీ నిప్పు పెట్టినట్లు తెలిసింది. ఈ ఘటనపై విచారణకు ప్రభుత్వం ఆదేశించారు. వాహనాలు దగ్ధం చేసిన కేసులో తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ కుమార్ గౌరవ్ తెలిపారు. సంఘటనా స్థలం వద్ద కరపత్రాలు వదలి వెళ్లినట్టు చెప్పారు. ట్యూబ్డ్ కోల్ ప్రాజెక్టు వద్ద పనులు సాగాలంటే తమతో చర్చలు జరపాలని ఆ కరపత్రంలో మావోయిస్టులు పేర్కొన్నట్లు ఎస్పీ తెలిపారు.

మా కార్యకర్తలను బెదిరించారు

అజిత్ ఎన్సీపీపై యుగేంద్ర పవార్ తల్లి ఆరోపణ

పూణె : బారామతి గొడవలో సిట్టింగ్ ఎమ్మెల్యే అజిత్ పవార్ నేతృత్వంలోని ప్రత్యర్థి ఎన్సీపీ కార్యకర్తలు మా కార్యకర్తలను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఎన్సీపీ (ఎస్పీ) అభ్యర్థి యుగేంద్ర పవార్ తల్లి ఆరోపించారు. దీంతో మహారాష్ట్రలోని పూణె జిల్లాలోని బారామతి పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మనవడు యుగేంద్ర పవార్ తన మామ, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో పోటీ పడుతున్నారు. తమ పార్టీ కార్యకర్తల్లో ఒకరిని ప్రత్యర్థి వర్గానికి చెందిన కార్యకర్తలు భయపెట్టారని యుగేంద్ర తల్లి షర్మిలా పవార్ ఆరోపించారు. 'నాకు సమాచారం అందిన వెంటనే, నేను సంఘటనా స్థలానికి చేరుకుని వారి (ఎన్సీపీ) పార్టీ గుర్తుతో కూడిన కొన్ని ఓటర్ల స్లిప్పులను ప్రచారం చేయడం, మా కార్యకర్తలను చంపేస్తామని బెదిరించడం చూశాను' అని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా, షర్మిలా పవార్ ఎన్నికల అధికారి కాదని, పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే హక్కు ఆమెకు లేదని బారామతిలో అజిత్ పవార్ నేతృత్వంలోని పార్టీ ఎన్నికల ఇంఛార్జ్ కిరణ్ గుజార్ అన్నారు. మా పార్టీ గుర్తు ఉన్న ఓటరు స్లిప్పుల విషయానికొస్తే, పోలింగ్ కేంద్రం ఎన్నికల అధికారి ఎందుకు అభ్యంతరం చెప్పడం లేదని, వ్యవస్థ న్యాయంగా పని చేస్తున్నప్పుడు మీరు వ్యవస్థను పరువు తీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. కాగా, 1991 నుంచి బారామతి స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అజిత్ పవార్ కూడా ఈ వాదనలను ఖండించారు. తమ పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉన్నారని చెప్పారు.

మణిపూర్‌లో కర్ఫ్యూ సడలింపు

ఇంఫాల్ : మణిపూర్లఓ శాంతిభద్రతల పరిస్థితి పాక్షికంగా మెరుగుపడటంతో కర్ఫ్యూను సడలించారు. ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేందుకు వీలుగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు పశ్చిమ ఇంఫాల్, తూర్పు ఇంఫాల్, కక్చింగ్ జిల్లాల్లో కర్ఫ్యూను సడలిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ కాలంలో సమావేశాలు, నిరసనలపై ఆంక్షలు అమలులో ఉంటాయి. ఒక మంత్రితో సహా డజనుకు పైగా శాసనసభ్యుల ఇళ్లు, ఆస్తులు తగులబెట్టడం, ధ్వంసం చేయడం లేదా దోచుకోవడం వంటి విస్తృతమైన మూక హింస తర్వాత నవంబరు 16న కర్ఫ్యూను నిరవధికంగా విధించారు. ఈ దాడులు కొంతమంది శాసనసభ్యులను వారి నివాసాల వద్ద బంకర్లను నిర్మించడానికి ప్రేరేపించాయి. అయితే ప్రభుత్వం వారికి భద్రతా చర్యలను పెంచింది. కాగా, కర్ఫ్యూ సడలింపు సమయంలో తిరిగి తెరిచిన పెట్రోల్ పంపుల వద్ద పొడవైన క్యూలు కనిపించాయి. నివాసితులు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడంతో మార్కెట్‌లు సందడిగా ఉన్నాయి. అయితే విద్యాసంస్థలు మాత్రం మూతపడ్డాయి. బ్రాడ్‌బ్యాండ్ సేవలపై నిషేధాన్ని ప్రభుత్వం షరతులతో ఎత్తివేసినప్పటికీ, తొమ్మిది జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేత కొనసాగుతోంది. మంగళవారం లేదా బుధవారం ఉదయం వేళల్లో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోలేదు. సైన్యం, కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో సహా భద్రతా సిబ్బందిని శాంతిభద్రతలకు ముప్పు ఉన్న ప్రాంతాలలో మోహరించారు.

ఆందోళనలు విరమించిన మణిపూర్ సమగ్రత కమిటీ

ఇంఫాల్ లోయ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పౌర సమాజ సంస్థ, మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ (సీవోసీవోఎంఐ) పౌర హత్యలలో ప్రమేయం ఉన్న అనుమానిత కుకీ మిలిటెంట్లకు వ్యతిరేకంగా 'సామూహిక కార్యకలాపాలకు' పిలుపునిస్తూ రాష్ట్ర ఎన్డీఏ శాసనసభ్యులు ఒక తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత బుధవారం దాని ఆందోళనను ఒక వారం పాటు నిలిపివేసింది. దాని కోఆర్డినేటర్ సోమోరెంద్రో థోక్‌చోమ్ విలేకరులకు వివరాలను వెల్లడిస్తూ, సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) ను ఇటీవల మళ్లీ విధించిన ప్రాంతాల్లో రద్దు చేయాలని పిలుపునిచ్చారు. 'శాసనసభ్యులు ఆమోదించిన తీర్మానం ఎలా అమలు చేస్తారో మేము గమనిస్తాం. తదుపరి చర్యలు ఆ తర్వాత నిర్ణయిస్తాం' అని థోక్చోమ్ తెలిపారు.

గోనె సంచిలో దళిత యువతి మృతదేహం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఓ గోనె సంచిలో దళిత యువతి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపుతోంది. మెయిన్‌పురి జిల్లాలోని కర్హల్ నియోజకవర్గంలో బుధవారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది. బీజేపీకి మద్దతిచ్చినందుకు ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడి చంపినట్లు ఆమె కుటుంబం ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను సమాజ్‌వాదీ పార్టీ తీవ్రంగా ఖండించింది. తమ పార్టీ పరువు తీయడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఎస్పీ నేత ఒకరు ఆరోపించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ప్రశాంత్ యాదవ్, మోహన్ కతేరియాలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మూడు రోజుల క్రితం ప్రశాంత్ యాదవ్ తమ ఇంటికి వచ్చి ఏ పార్టీకి ఓటు వేస్తారని అడిగారని బాధితురాలి తండ్రి తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తన కుటుంబానికి ఇల్లు లభించినందున బీజేపీ గుర్తుకు ఓటు వేస్తానని తన కూతురు చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రశాంత్ యాదవ్ ఆమెను బెదిరించి... సమాజ్‌వాదీ పార్టీ ఎన్నికల గుర్తు సైకిల్‌కు ఓటు వేయమని అడిగాడని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని సమాజ్‌వాదీ పార్టీ కర్హల్ అభ్యర్థి తేజ్ ప్రతాప్ యాదవ్ డిమాండ్ చేశారు. సమాజ్ వాదీ పార్టీ పరువు తీసేందుకు బీజేపీ పన్నిన కుట్ర అని, దీనికీ... ఎస్పీకి ఎలాంటి సంబంధం లేదని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి పేర్కొన్నారు.

50 శాతం ఉద్యోగులకు ఇంటి నుంచే పని

వాయు కాలుష్య తీవ్రతతో దిల్లీ ప్రభుత్వం నిర్ణయం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యత నానాటికీ క్షీణిస్తోంది. గాలి నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 400లకు పైగా నమోదవుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. కాలుష్య తీవ్రత పెరుగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని దిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ ప్రకటించారు. 'కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. దీని అమలుకు సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించనున్నాం' అని గోపాల్‌రాయ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కార్యాలయాలు ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, మిగిలిన ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. వాయుకాలుష్యం క్రమంగా పెరుగుతుండడంతో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. బుధవారం ఉదయం గాలి నాణ్యత సూచీ 422గా నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్క్‌ను దాటడంతో వాతావరణ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే కొన్ని విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలుష్యం కారణంగా సుప్రీంకోర్టులోని ఏ కేసులైనా లాయర్లు వర్చువల్ విధానంలో తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు కృత్రిమ వర్షం కురిపించేలా చర్యలు తీసుకోవాలని గోపాల్‌రాయ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

స్కూల్లో టీచర్ దారుణ హత్య

పెళ్లికి నిరాకరించడమే కారణం

హంతకుడి అరెస్టు

చెన్నై: స్కూలు ప్రాంగణంలో ఓ మహిళా టీచర్ దారుణంగా హత్యకు గురైన ఘటన తమిళనాడు, తంజావూరులో బుధవారం జరిగింది. తన పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిందని కోపం పెంచుకున్న మదన్ (30)... 26ఏళ్ల రమణిని కడతేరిచినట్లు పోలీసులు తెలిపారు. మల్లిపట్టణం ప్రభుత్వ స్కూలులో ఈ దారుణం జరిగిందన్నారు. ఆమె మెడపై పదునైన ఆయుధంతో మదన్ దాడి చేశాడని... ఆసుపత్రికి తీసుకెళుతుండగా రమణి తుదిశ్వాస విడిచారన్నారు. మదన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరికి పెళ్లి చేయాలని రెండు కుటుంబాలు మాట్లాడుకోగా, తనకు ఇష్టం లేదని రమణి చెప్పారు. ఆమె తిరస్కరణను తట్టుకోలేకపోయిన మదన్ స్కూలుకు వెళ్లి అందరూ చూస్తుండగానే స్టాఫ్ రూమ్‌లో రమణిపై దాడికి తెగబడినట్లు పోలీసులు వివరించారు. ఈ ఘటనను పాఠశాల విద్యా మంత్రి అంబిల్ మహేశ్ పొయ్యమొజి ఖండించారు. విద్యార్థులకు వెంటనే కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. టీచర్లపై హింసను ఉపేక్షించేది లేదన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రమణి మరణం అధ్యాపక వర్గానికి తీరని లోటన్నారు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశంతో తంజావూరుకు బయల్దేరుతున్నట్లు చెన్నైలో విలేకరులతో మాట్లాడిన మంత్రి అన్నారు. స్కూలుకు ఒకరోజు సెలవు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. అయితే వ్యక్తిగత కారణాలతోనే రమణిపై దాడి చేసినట్లు మదన్ అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనను ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఖండించారు. పనిప్రదేశాల్లో టీచర్లు, డాక్టర్లకు భద్రత కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

నిబంధనలు పాటించని బ్యాంకులపై చర్యలు: ఆర్‌బీఐ

న్యూదిల్లీ: రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం కేవైసీ అమలులో సరైన విధానాలు పాటించని బ్యాంకులపై చర్యలు తప్పవని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ అన్నారు. సరైన పద్ధతిలో కేవైసీ పూర్తి చేయకుండా కొన్ని బ్యాంకులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయని చెప్పారు. దీంతో ఈ ప్రక్రియ పూర్తి చేయని బ్యాంకు కస్టమర్లు ... ప్రభుత్వ ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) నిధులు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగ బ్యాంకుల డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో స్వామినాథన్ మాట్లాడుతూ... 'బ్యాంకులు కేవైసీ మార్గదర్శకాలను సరైన పద్ధతిలో అమలు చేస్తున్నట్లు నిర్ధారించుకోవాలి. కస్టమర్ల నుంచి కేవైసీ పూర్తి చేయాల్సిన బాధ్యత బ్యాంకులదే. దాన్ని సాకుగా చూపి ప్రభుత్వ డీబీటీ నగదును వినియోగదారులకు చెందకుండా చర్యలు తీసుకోకూడదు. కస్టమర్లు కేవైసీ పూర్తి చేసేందుకు బ్యాంకులు విభిన్న మార్గాలు అన్వేషించాలి. లేదంటే మనీ లాండరింగ్‌కు అవకాశం ఉంటుంది. కస్టమర్ల కేవైసీ వివరాలను కాలానుగుణంగా అప్‌డేట్ చేయడంలో బ్యాంకులకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి క్లిష్టమైన పరిస్థితుల్లో సిబ్బందిని తగినంతగా నియమించుకోవాలి. కేవైసీ అప్‌డేట్ కోసం కస్టమర్లు తమకు ఖాతా ఉన్న బ్రాంచ్‌లో సంప్రదించాల్సి ఉంటుంది. ఖాతాదారులకు వివరాలు తెలియజేయడంతో బ్యాంకులు విఫలమవుతున్నాయి. ఒకవేళ పత్రాలు బ్యాంకులో సమర్పించినా కేవైసీ అప్‌డేట్ చేయడంలో కాలయాపన చేస్తున్నారు' అని పేర్కొన్నారు. అంతర్గత అంబుడ్స్‌మన్ ఏర్పాటుతోపాటు వినియోగదారు ఫిర్యాదుల యంత్రాంగంపై ఆందోళనలున్నాయని స్వామినాథన్ తెలిపారు. బ్యాంకులో నెలకొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా అంతర్గత అంబుడ్స్‌మన్ యంత్రాంగం పని చేయాలని సూచించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- మల్కాజిగిరి : కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు.40 సంవత్సరాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నప్పటికీ నేటికీ సాధ్యపడలేదని కాలనీవాసులు ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జగదీష్ గౌడ్, రాము యాదవ్, జ్ఞానేశ్వర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రదీప్, యాకూబ్ రెడ్డి, ఇంతియాజ్, నాని, యాదగిరి, వాసు, నగేష్, ఈశ్వర్, సులోచన, పద్మ, మల్లికా, ఫయాజ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వండి

విశాలాంధ్ర- హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పటు నందించేందుకు నియమించిన బీసీ కమిషన్ ఈనెల 23న బహిరంగ విచారణ చేపట్టనున్నందున బీసీ తరగతులు చెందిన వారు సామాజిక, ఆర్థిక, విద్య రంగాలలో సలహాలు, సూచనలు బీసీ కమిషన్ కు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకట చారి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ కుల సంఘాలతో వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్ సభ్య కార్యదర్శిగా గల బీసీ కమిషన్ ఈనెల 23న హైదరాబాద్ కలెక్టరేట్ (లక్డికాపూల్)లో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ విచారణ చేపట్టనుందని అన్నారు. వెనుకబడిన తరగతులకు చెందినవారు ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన సూచనలు, సలహాలు కమిషన్ కు అఫిడవిట్ రూపంలో అందించాలని సూచించారు. అఫిడవిట్ ఒరిజినల్ సెట్ ఒకటి తో పాటు 5 జిరాక్స్ సెట్లను (మొత్తం 6 సెట్లు) ఇవ్వవలసి ఉంటుందని అన్నారు. ప్రతి దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం సలహాలు సూచనలు ఇవ్వడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాజ్ అహ్మద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి టి.నరసింహులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర, మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్లో 20 లక్షల ప్రత్యేక నిధులతో కమ్యూనిటీ హాల్ మరియు 20 లక్షల నిధులతో సుభాష్ నగర్ లో సిసి రోడ్లకు బుధవారం ఉదయం టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీరాల నర్సింహా, కాంటెస్టెడ్ కార్పొరేటర్ రాపోలు ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు దానగళ్ల యాదగిరి, మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంగా పని చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: సేవా దృక్పథంతో పనిచేసి మంచి పేరు గడించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 132- జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో బుధవారం నూతనంగా ఏర్పాటుచేసిన 'అన్వి క్లినిక్స్ ఫర్ ఉమెన్' ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నూతన పరిజ్ఞానం అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటుచేసిన 'అన్వి క్లినిక్స్ ఫర్ ఉమెన్' ప్రేమే లక్ష్యంగా సేవయే మార్గంగా మంచి పేరును గడించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నదీమ్ రాయ్, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, ఎల్లా గౌడ్, పోలే శ్రీకాంత్, నదీమ్ రాయ్, విజయ్ హరీష్, సిద్దిక్, ఫేరోజ్, డాక్టర్లు సాయి హర్షిణి, మనోజ్ఞ, శాలిని దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి : ఏఐఎస్ఎఫ్

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం
- ఫీజులు విడుదల చేయకపోతే చదువులు కొనసాగేదెలా?

విశాలాంధ్ర- హైదరాబాద్ : ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మారటం లేదు. కాంగ్రెస్ తెచ్చిన రియంబర్స్‌మెంట్ పథకానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తోందని, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సహాయ కార్యదర్శులు,పుట్ట లక్ష్మణ్. గ్యార నరేష్‌లు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిం బర్స్మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లని, ఫీజు బకాయిల విడుదలపై అనాడు సీఎం రేవంత్ రెడ్డి చెప్పింది ఏంది నేడు చేస్తున్న జాప్యం ఏంటని, రాష్ట్ర సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ విద్యార్థుల పట్ల వివక్షతను చూపుతుందని మండిపడ్డారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిం బర్స్మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు, విద్యార్థులు నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి విద్యార్థుల పోరాటం వారి తల్లిదండ్రుల సహకారం ఉందన్న విషయం సిఎం రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్మెంట్ నిధులు రూ. 7650 వేల కోట్లు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు వివిధ రకాల ఎంట్రన్స్ లలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలలో డబ్బులు కట్టి టి.సి ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని, దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలల యామా న్యాలు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని, ఎంతో మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్దిపొందారని, కానీ నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తూ తూట్లు పొడుస్తుందని దుయ్య బట్టారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మొద్దు నిద్రను వీడి పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను మొత్తం విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయుటకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ గా ఉద్యమాలు ఉధృతం చేసి విడుదలయ్యే వరకు ప్రభుత్వం పై పోరాటాలు చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ ఓయూ అధ్యక్షులు లెనిన్ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్ కుమార్ హర్ష పవన్, వెంకట్, శింబు, వంశీ, విజయ్, మౌలాలి, మస్తాన్, కురుమూర్తి, అరుణ్, పవన్, సాధుల్లా, మనోజ్, శివకుమార్ , రంజిత్ కుమార్, సుదర్శన్, రఘు, రాజేందర్, అశోక్, సాయి కుమార్ మరియు శివ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీ.ఆర్.నాయుడు బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని హైదరాబాద్ నందీనగర్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి వారి ప్రసాదాన్ని కేటీఆర్ కు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడుని కేటీఆర్ శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు. పవిత్ర తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు కేటీఆర్ బీఆర్ నాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలకు వచ్చే తెలంగాణ భక్తుల దర్శనానికి ఇక్కడి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే లేఖలను పరిగణలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా బీఆర్ నాయుడుకి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ లో ఒకచోట, సిరిసిల్ల రెండు చోట్ల గతంలో శంకుస్థాపన చేసిన టీటీడీ దేవాలయాల నిర్మాణాలు శరవేగంగా పూర్తి అయ్యేలా సహకరించాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయని వాటి అభివృద్ధికి టిటిడి తరఫున తోడ్పాటు అందించాలని కోరారు. కేటీఆర్ చేసిన విజ్ఞప్తుల పట్ల బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. టిటిడి తరఫున తెలంగాణ భక్తుల దర్శనాల విషయంలో, అలాగే ఆలయాల నిర్మాణం, అభివృద్ధి విషయంలో తప్పకుండా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని బీఆర్ నాయుడు హామీ ఇచ్చారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర : పీడీఎస్ఎఫ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్ డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ బకాయిల విడుదలలో కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యపు వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను బషీర్ బాగ్ చౌరస్తాలో దాహనం చేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో లక్షలాది మంది పేద విద్యార్థులు చదువులకు దూరం అయ్యారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు నవంబర్ 19వ తేదీ నుండి సమ్మె చేస్తుండడంతో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ, పీజీ విద్యార్థులు తరగతులకు హాజరయ్యే అవకాశం లేకుండా ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెలలో జరుగుతున్నందున విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యంతో చర్చించి వాళ్ళ డిమాండ్ కు అనుగుణంగా తక్షణమే రూ.8 వెల కోట్లు విడుదల చేయాలని, పెండింగ్ లోని మొత్తం స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి నిధులు విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.హరీష్, రాజశేఖర్, కోట ఆనంద్ విద్యార్థులు లక్ష్మీకాంత్, పవన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర, షాద్‌నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని జానంపేట వీర అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్ నగర్ లోని 10వ వార్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి, వినాయక స్వామి నవగ్రహ సహిత జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రావణి, నాయకులు జమ్రుద్ ఖాన్, విశ్వం,శివ శంకర్ గౌడ్, బాబర్ అలీ ఖాన్, బస్వం, ఇబ్రహీం, మురళీమోహన్, కట్ట వెంకటేష్ గౌడ్ ,కృష్ణ రెడ్డి తూపాకుల శేఖర్, సుదర్శన్, ముబారక్ అలీ ఖాన్, సందీప్ గౌడ్, గందం ఆనంద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వైభవంగావిగ్రహ ప్రతిష్ఠ : మాజీ ఎమ్మెల్యే

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో జానంపేట శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను సన్మానించి ఆలయంలోకి ఆహ్వానించారు. నూతన ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. గొప్పగా ఆలయాన్ని నిర్మించి ప్రజల్లో ఆధ్యాత్మిక ప్రభంజనాన్ని సృష్టిస్తున్నారని ఇది జగతికి ఎంతో మేలని అంజయ్య యాదవ్ అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్, వంకాయల నారాయణరెడ్డి, చీపిరి రవి యాదవ్, పిల్లి శేఖర్, గంధం ఆనంద్, శివ పాల్గొన్నారు.

71వ అఖిలభారత సహకార వారోత్సవాలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన భీమారం మండలం కాజిపల్లి గ్రామంలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలు, ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడుతూ సహకార సంఘాలు హక్కుల సాధనకు ప్రామాణికాలు అని అన్నారు. సహకార సంఘాలు సంఘటితమై అభివృద్ధి దిశగా పయనించాలన్నారు. జిల్లా సహకార అధికారి బి సంజీవరెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఈర్ల శంకర్ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షులు సందన వేణి మహేంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రంలో విద్యా వైద్యం ఉచితంగా ఇవ్వాలని అన్నారు రాష్ట్ర గౌరవ సలహాదారులు భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ సహకార సంఘాలు సంఘటితమై సంఘంలోని సభ్యులందరూ అభివృద్ధి దిశగా నడవాలని ప్రభుత్వాలు గొర్రెలు మేకలు ఆవులు బర్రెలు సబ్సిడీ ద్వారా సంఘాల బంధించి ప్రమాదం శాతం పశువులు మరణిస్తే వాటికి ప్రభుత్వాలు నష్టపరిహారము చెల్లించాలని వాళ్లని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. సంఘ సభ్యులు ఐక్యమత్యమే మహాబలం ఐక్యమత్యంతో విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాన్నారు. అప్పుడే వెనుకబడిన వర్గాలు అభివృద్ధి జరుగుతుందన్నారు పన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి హాజరై ఏడు రంగుల జెండా ఎగరవేసి సహకార గీతం లో పాల్గొని అనంతరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో దుప్పట్లు చీరలు అవార్డ్స్ సర్టిఫికెట్లు అందజేశారు. సహకార సంఘాల బలోపేతం చేసిన సొసైటీ అధ్యక్షులకు అవార్డ్స్ ప్రశంస పత్రాలు మరియు బతుకమ్మ మహిళలకు చీరల పంపిణీ, మరియు అవార్డ్స్ వృద్ధులకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు బత్తుల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర సలహాదారు బేరి రామచందర్ యాదవ్, అందెల కుమార్ యాదవ్, అక్కల మధుకర్ యాదవ్, భీమారం మండల నాయకులు కట్కూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భూక్య తిరుమల లక్ష్మణ్, పున్నం సంఘం నాయకులు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మండే మల్లేష్ యాదవ్, మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, గౌరవ అధ్యక్షులు వేల్పుల పర్వతాలు యాదవ్, గాదన వేణి మహేష్ యాదవ్, పల్లంలో సదానందం యాదవ్, గట్టు మహేష్ యాదవ్ , సత్తన్న యాదవ్ కాటవీన మహేష్ యాదవ్ కనగంటి సంపత్ యాదవ్ చిర్రం పోచన్న కొమ్ము రాజశేఖర యాదవ్, మహేందర్ యాదవ్‌పాల్గొన్నారు.

మాగనూర్ ఘటనపై సీఎం సీరియస్?

విశాలాంధ్ర - హైదరాబాద్ : నారాయణపేట జిల్లాలోని మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులెవరైనా సరే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ను ఆదేశించారు. ఈ సంఘటనలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సంఘటనకు దారి తీసిన కారణాలపై వెంటనే విచారణ జరిపి, తనకు నివేదికను అందజేయాలని సీఎంవో అధికారులను సీఎం ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వెంటనే అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విషయంలో రాజీ పడేది లేదని, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సర్వే

విశాలాంధ్ర- హైదరాబాద్ : జిహెచ్ఎంసి వ్యాప్తంగా సర్వే వియవంతంగా జరుగుతున్నది. నగర ప్రజలు ఎన్యుమరేటర్లకు పూర్తి సహకారం అందించడం మూలంగా సర్వే నగర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నది. నగరంలో చేపట్టే సర్వేలో సినీ ప్రముఖులు , ఉన్నతాధికారులు పదవీవిరమణ పొందిన ఐఏఎస్, వివిధ పార్టీల నాయకుల సర్వే సిబ్బంది పూర్తి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాల మెరుగుకు రాజకీయ, కుల సర్వే ప్రకారం ప్రజలకు అవసరమైన పథకాలకు రూపకల్పన చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సర్వేలో ప్రజలు ఎక్కువ శాతం పాల్గొంటున్నారు. అందరి సమన్వయంతో సర్వే జిహెచ్ఎంసి వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నది. తప్పులు లేకుండా సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రభుత్వ నిర్దేశించిన మేరకు కోడింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయుటకు మానిటరింగ్, నోడల్, జోనల్ అధికారులు విశేష కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి వ్యాప్తంగా బుధవారం 1,32,656 కుటుంబాల సర్వే పూర్తి కాగా ఇప్పటి వరకు 13,91,817 కుటుంబాల సర్వేతో57.30 శాతం సర్వే చేశారు.

బాధిత కుటుంబాలకు భరోసా

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సిద్దిక్ నగర్ లో 5 అంతస్థుల భవనం అకస్మాత్తుగా ఒక పక్కకు ఒరగడంతో విషయం తెలియగానే ఘటన స్థలానికి గౌరవ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ హమీద్ పటేల్, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది,పోలీసు అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించి , అర్ధరాత్రి వరకు ఉండి సహాయక చర్యల్లో పాల్గొని బాధిత కుటుంబాలకు భరోసాను కల్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సిద్దిక్ నగర్ లో సెల్లార్ గుంతలోకి భవనం వంగడం జరిగిందని, విషయం తెలియగానే సంఘటన స్థలానికి చేరుకోవడం జరిగినది , జీహెచ్ఎంసీ పోలీస్, డీఆర్ఎఫ్ ,విద్యుత్ ,అగ్నిమాపక అన్ని శాఖల అధికారులను అప్రమత్రం చేసి, సమన్వయం చేసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, సెట్ బ్యాక్ లేకుండా పక్కన సెల్లార్ తవ్వడం వలనే పక్క భవనం ఒక వైపు వంగిపోయిందన్నారు. దీని వలన కాలనీ వాసులు భయభ్రాంతులకు గురయ్యారని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. భవనం చుట్టుపక్కల ప్రజలను సురక్షిత ప్రాంతలకు తరలించడం జరిగిందన్నారు. అక్రమంగా తీసుతున్న సెల్లార్‌ల పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ,అనుమతి లేకుండా తీస్తున్న సెల్లర్లను వెంటనే ఆపివేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలను తీసుకోవాలని అధికారులను గాంధీ ఆదేశించచారు. కాలనీ వాసులు ఎటువంటి భయభ్రాంతులకు గురి కావొద్దు అని, అన్ని రకాల స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ భరోసా కల్పించారు. అక్రమ నిర్మాణాలు, అక్రమ సెల్లారులు తవ్వే వారి విషయంలో ఎటువంటి ఉదాసీనత పాటించకూడదు అని, కఠిన చర్యలు తీసుకోవాలని, ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇంజనీరింగ్ నిపుణుల సలహా తీసుకున్న తర్వాత బిల్డింగ్ కూల్చి వేయాల లేదా అనేది నిర్ణయం తీసుకుంటామని, ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేకుండా ముందస్తు చర్యలో భాగంగా చుట్టుపక్కల ఉన్న వాళ్ళందరిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు.

ఆంజనేయ స్వామి దీవెనలు ప్రజలపై ఉండాలి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఎల్లప్పుడూ జీవించాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ బతుకమ్మ బండలో పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్‌ల పర్యవేక్షణలో నిర్వహించిన పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ శంభీపూర్ ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, 125 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి , సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, అజయ్ ప్రసాద్ గుప్తా,సాయిబాబా, మల్లేష్, ఆసిఫ్, రంజాన్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మక్తమాధారం -ఇబ్రహీం పట్నం బస్సు ప్రారంభం

విశాలాంధ్ర- అమనగల్లు : కడ్తాల్ మండలం మక్తమాధారం గ్రామం నుంచి ఇబ్రహీం పట్నం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు ఆర్టీసీ అధికారులను కోరడంతో ఇబ్రహీం పట్నం డీఎం స్పందించి ప్రజల సౌకర్యం కోసం బుధవారం బస్సులను ఏర్పాటు చేశారు. నూతన బస్సులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ముదిరాజ్, మాజీ సర్పంచి సులోచన సాయిలు, మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి, విలేకరి రామకృష్ణ ప్రారంభించారు. గ్రామం నుంచి ఇబ్రహీం పట్నం వరకు మూడు ట్రిప్పులు బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామం నుంచి ఉదయం 5:15, 6:30, 10:00గంటలకు బస్సులు బయలు దేరుతావని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా గౌడ్, జంగయ్య, యాదగిరి, బండి శ్రీనివాస్, మహేందర్, నగేష్, చెన్నయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర-దుండిగల్: దైవారాధనతోనే మానసిక ప్రశాంతత చేకూరడమే కాకుండా చేపట్టబోయే ప్రతి పనిలోను విజయం తధ్యమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి నందు బుధవారం శ్రీ సీతారామ చంద్ర స్వామి, శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన రాజగోపురం ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ దైవారాధనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్గుబావి హనుమంతరావు, బూర్గుబావి సత్యనారాయణ, శివకుమార్, డప్పు నరేందర్ ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు ప్రజలు భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర, మేడిపల్లి: ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధ వారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ముఖ్య సలహాదారులు, పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంక రెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వాళ్ళం మనమే మార్కెట్‌ను సృష్టించుకోవాలి. ఇప్పుడు బిల్డర్స్ మార్కెట్ కాదు బయ్యర్స్ మార్కెట్‌గా మారిందని కొనుగోలుదారులకు ఎంతో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని కొనుగోలు దారులు వినియోగించుకోవాలని సూచించారు. రియాల్టర్స్ ఎవరు భయపడవద్దని తప్పకుండా మార్కెట్ కొద్దిరోజుల్లో ఊపు అందుకుంటదని అన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు శాడగొండ కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, చైర్మన్ రమేష్, అడ్వైజర్ రమేష్ బాబు, కోశాధికారి మురళి, ఉపాధ్యక్షులు సతీష్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రాజేష్ రెడ్డి మరియు బిల్డర్స్ సభ్యులు. ఈ కార్యక్రమానికి హెూస్టుగా వివరించిన సర్వోత్తమ్ స్టీల్స్ ఎండి పాల్గొన్నారు.

దుర్వాసన నుంచి ప్రజలను కాపాడండి

విశాలాంధ్ర, పటాన్ చెరువు : డ్రైనేజీ నీరును శంభునికుంటలో కలపకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోని ప్రజలను దుర్వాసన నుంచి కాపాడాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు నరసింహ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమీన్పూర్ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు అమీన్పూర్ మండలంలోని బీరంగూడ లో ఉన్న శంభునికుంటను సుందరీకరించాలని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డిపార్టీ నాయకులతో కలిసి స్థానిక ఎమ్మార్వోను కోరారు . ప్లాస్టిక్ ఇతర వ్యర్థ పదార్థాలు కుంట నిండా నిండిపోయాయని వాటిని వెంటనే తొలగించి కుంట ను సుందరీకరించాలని మండల తహసీల్దార్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత, బీరంగూడ శాఖా కార్యదర్శి వీరస్వామి, సునీత, శ్రీనివాస్ రెడ్డి జిలాని పాల్గొన్నారు.

గీతం విద్యార్థినీ ప్రతిభ

విశాలాంధ్ర, పటాన్ చెరువు : నాసా 67వ ప్రాంతీయ కన్వెన్షన్‌-లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ రెండో ఏడాది విద్యార్థిని రేష్మిక 'రైటింగ్ ఆర్కిటెక్చర్' పోటీలో ప్రత్యేక ప్రస్తావన అవార్డును అందుకుని, ఓ ప్రతిష్ఠాత్మక వేదికలో తన ప్రతిభను చాటినట్టు ఇన్ చార్జి డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ ఘనత గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కు ఓ అద్భుత క్షణమని, ఈ ప్రశంసలు గీతంలోని ఉన్నత విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తూ నిర్మాణ ఆలోచనలను విమర్శనాత్మకంగా విశ్లేషించి, సమర్థవంతంగా వెల్లడించడంలో రేష్మిక అసాధారణ సామర్థ్యాన్ని చాటిచెప్పిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థులను అధ్యాపకురాలు శ్రుతి గావాలి సమన్వయం చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యారంగ పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర, మేడిపల్లి: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల చదువులకి ఆటంకం కలుగుతుందని ఫీజు బకాయిల విడుదల లేక రాష్ట్రంలో కళాశాలలు బంద్ చేసిన ప్రభుత్వం స్పందించకుండా మౌనంగా ఉంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, ప్రజా విజయోత్సవలకు ఉన్న పైసలు ఫీజు బకాయిల విడుదలకి లేవా అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ నిర్వహిస్తూ పరీక్షలను బహిష్కరించిన ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం ఏ.ఐ.ఎస్.ఎఫ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో బోడుప్పల్ కమాన్ చౌరస్తా వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు బకాయిలు విడుదల లేకపోవడం మూలంగా విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఏ విధమైన ఇబ్బందులు పడుత ఉన్నారో అదేవిధంగా ప్రైవేట్ బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు కూడా సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో కళాశాలలను నిర్వహణ చేయలేమని దసరా తర్వాత డిగ్రీ కళాశాలలు నాలుగు రోజులు నిరవధిక బంద్ చేస్తే వారంలో ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి విడుదల చేయకపోవడం మూలంగా ఇచ్చిన మాట తప్పారని, దీంతో నేటి నుండి మళ్లీ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ నిర్వహించడం పరీక్షలు బహిష్కరిస్తామని ప్రకటించడంతో దీని ప్రభావం విద్యార్థుల విద్యాసంవత్సర భవిష్యత్తుపై పడుతుందని ఓవైపు అనేక సెలవులు వల్ల ఇప్పుడిప్పుడే అకాడమిక్ తరగతులు సక్రమంగా జరుగుతూ కొన్ని యూనివర్సిటీల్లో సెమిస్టర్ పరీక్షల నిర్వహణ నాలుగు, అయిదు రోజుల్లో జరుగనున్నాయని, కొన్ని యూనివర్సిటీలో పరీక్ష ఫీజుల తేదీలు వచ్చాయని ఇప్పుడు బంద్ వల్ల విద్యార్థులు చాలా నష్టపోతారని, కొన్ని యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా అంటూ ప్రచారం జరగటం వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఆనాడు ప్రతిపక్ష హోదాలో రేవంత్‌రెడ్డి ఫీజు బకాయిలను తాము అధికారంలోకి రాగానే విడుదల చేస్తామని చెప్పారని నేడు అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం సీఎం వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయడంలో సీఎం నిర్లక్ష్యం సరికాదని ప్రభుత్వం వెంటనే విద్యార్థులు చదువులను వారి భవిష్యత్తునీ దృష్టిలో పెట్టుకొని డిగ్రీ కళాశాలల వారితో చర్చించి పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు సాయి, అరవింద్, మనోహర్, శ్రీనాథ్, గణేష్, సైదులు సందీప్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : స్వయం ఉపాధి ప్రాతిపాదికన అసంఘటిత రంగంలో చేతులు మరియు పనిముట్లతో పనిచేసే వారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న తెలిపారు విషయంపై బుధవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో బీసీ కుల సంఘ, ఎన్జీవోస్ లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన పీఎం విశ్వకర్మ పథకం గురించి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, పనిముట్ల వృత్తి దారుల నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద ఆర్థిక సహాయం అందించేందుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు కోరుతుందన్నారు. ఈ పథకం కింద 1లక్ష రుణం 5% శాతం వడ్డీపై ఇస్తుందని, దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇవ్వడం, శిక్షణ కాలంలో స్టైఫండ్ తో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరుగుతుందని అన్నారు. లక్ష రూపాయల రుణం 18 నెలల్లో తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రూ. 2 లక్షల రూపాయల రుణమిస్తుందని అన్నారు. దరఖాస్తుదారుడు చేతివృత్తులు, పనిముట్లతో పని చేస్తూ కుటుంబ సాంప్రదాయ అవుతులలో నిమగ్నమైన హస్త కళాకారుడు లేదా వృత్తి కళాకారుడు పీఎం విశ్వకర్మ పథకమునకు అర్హుడని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే నాటికి లబ్ధిదారులు వయస్సు కనీసం 18 సంవత్సరాలు ఉండాలి అన్నారు. ఈ పథకం కింద కుటుంబంలో ఒకరికి మాత్రమే రిజిస్ట్రేషన్ పరిమితమని తెలిపారు. పైన అర్హతలు ఉన్న కుల వృత్తుల వారు కామన్ సర్వీస్ సెంటర్ కు వెళ్లి https://pmvishwakarma. gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే ఆఫీసర్ వి శ్రీరామ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాజ్ అహ్మద్, జిల్లా సహాయ అభివృద్ధి అధికారులు టి నరసింహులు, డి కృష్ణమాచారి, కుమ్మరి సంఘం అధ్యక్షులు ఎం శివానంద, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎం నరసింహ, రజక సంఘం మాధవి అమ్ముల, సోఫా సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ యెత్తిరి అంతయ్య, వడ్డెర సంఘం అధ్యక్షులు ఆర్చైచ్ సంతోష్, ఆరెకటిక అబ్దుల్ అబ్దుల్ ఖాలిక్, బోయ వాల్మీకి సంఘం అధ్యక్షులు ఎమ్మెస్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ కట్టడాలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వలన రోజుకు కొన్ని వందల అక్రమ కట్టడాలు నిర్మించి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఐదు, ఆరు అంతస్తుల భవనాల కట్టి వ్యాపారాలు చేస్తూ ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న వ్యక్తుల తీరును ఖండిస్తూ ఈరోజు కొండాపూర్ డివిజన్ అంజయ్య నగర్‌లో ఓ ఇంటి యజమాని జీహెచ్ఎంసీ శాఖ నుండి పర్మిషన్స్ లేకుండా 50 గజాలలో ఐదంతస్తుల భవనాన్ని నిర్మించి పెను ప్రమాదాన్ని సృష్టించాడని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండాపూర్ అంజయ్య నగర్‌లో టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో చిన్నచిన్న ఖాళీ స్థలాలలో బౌల అంతస్తుల భవనాలను నిర్మించి హాస్టల్స్, హెూటల్స్‌లకు రెంటుకిచ్చి డబ్బు గడిస్తున్నారని తెలుపుతూ ఈరోజు జరిగిన సంఘటన చూస్తే అందరికీ అర్థమైతుందని తెలుపుతూ ఇలా పర్మిషన్ లేకుండా భవనాలు నిర్మించడం వలన జిహెచ్ఎంసి శాఖకు రెవెన్యూ తగ్గిపోయి తద్వారా ఆ ప్రాంతంలో సరిపడా రోడ్లు లేక, సరైన డ్రైనేజీ లేక ఎన్నో సంవత్సరాల నుండి స్థానికంగా ఉంటున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఇకనుండి అయినా జిహెచ్ఎంసి అధికారులు గానీ టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని నీతి, నిజాయితీతో పనిచేసి పర్మిషన్స్ ఇవ్వాలని కోరారు, ప్రమాదవశాత్తు భవనం క్రిందకు కృంగి విరిగిపడితే ఎంతోమంది ప్రాణాలను కోల్పోతుంటిమి దేవుడి దయతో ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదు కాబట్టి అందరం ఊపిరి పీల్చుకున్నామని, ఇకనైనా హైడ్రా అధికారులు అక్రమ కట్టడాలను, నాణ్యత లేకుండా నిర్మించిన భవనాలను గుర్తించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి అధికారులను,హైడ్రా కమిషనర్ గారిని కోరారు, ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఆంజనేయులు సాగర్, సంతోష్, మన్యంకొండ, సరోజ రెడ్డి, మహేష్ ,మరియు బస్తీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆపదలను తీర్చే దైవం అయ్యప్ప

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లీ తాండా సీనియర్ నాయకులు శ్రీరామ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవంలో ఈరోజు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ హరిహరసుతుడు అయ్యప్పను కొలవడం ద్వారా ఆపదలు తొలగి అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు చేకూరుతాయన్నారు. శరణంటూ ఆశ్రయించిన వారిని కాపాడే దైవం హరిహర సుతుడు అయ్యప్ప అని అన్నారు. స్వామి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామి చల్లనిచూపు తప్పక ఉంటుందని పేర్కొన్నారు. తదంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు శివసింగ్, సీనియర్ నాయకులు, నర్సింగ్ నాయక్, ప్రభాకర్,ప్రకాశ్,బాబులు నాయక,అయ్యప్ప స్వాములు ,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్య చక్రం వాహనం ఢీ ..మహిళా మృతి

విశాలాంధ్ర -కాప్రా : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మర్రిగూడెం చెందిన ఉషారాణి(41) చర్లపల్లి పరిశ్రమలో పనిచేస్తున్న ఉషారాణి మంగళవారం రాత్రి 7:30 గంటల సమయంలో గణేష్ కమాన్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తుండగా దివచక్ర వాహనం యాక్టివా ఏపీ39 జి.వి4849 వాహనం చంద్రశేఖర అనే వ్యక్తి అతివేగంగా వచ్చి ఆటో కోసం ఎదురు చూస్తున్నా ఉషారాణిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాల తగడంతో ఉషారాణితో కలిసి పనిచేస్తున్న కొంతమంది ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఉషారాణి బుధవారం మధ్యాహ్నం మృతి చెందడంతో పోలీసులు భర్త పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ మార్చాలికి తరలించారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర, పటాన్ చెరువు : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 ,22, 23వ తేదీలలో జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన మరియు జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి స్థానిక సెయింట్ ఆంటోని ఉన్నత పాఠశాల శాంతినగర్ లో ప్రింట్ అండ్ మీడియా వారితో సమావే శాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మీడియా వారితో మాట్లాడుతూ ఈ సంవత్సరం జరగబోయే వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి 11 కమిటీలను నియమించడం జరిగినదని, ఈ సంవత్సరం అన్ని యాజమాన్యాల పాఠశాలలు కలిపి సుమారు 850 వరకు ఎక్స్ బిట్స్ ప్రదర్శనకు వస్తాయని, ఇన్స్పైర్‌కు సంబంధించి 95 ఎగ్జిబిట్ వస్తాయని తెలియజేశారు. ఈ సంవత్సరం ప్రధాన అంశంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశానికి అనుబంధంగా ఏడు ఉపాంశాలతో జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. రవాణా కమ్యూనికేషన్, వ్యర్థాల నిర్వహణ, ఆహారం ఆరోగ్యం మరియు పరిశుభ్రత, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, గణన ఆలోచనలు, వనరుల నిర్వహణ లాంటి ఉప అంశాలు ఉంటాయని తెలియజేశారు. 21వ తేదీ రోజు వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉదయం 7:30 నుండి ప్రారంభం అవుతుందని విద్యార్థులందరూ కూడా తమకు సంబంధించిన సబ్ టీమ్స్ వారిగా కేటాయించబడిన కౌంటర్లో రిజిస్ట్రేషన్

చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యస్ .వెంకటేశ్వర్లు తో పాటు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి , మాజీ సైన్స్ అధికారి విజయ్ కుమార్ , నోడల్ అధికారి లింభాజీ ,సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్, కోహిర్ మండల విద్యాధికారి, ప్రింట్ అండ్ మీడియా కన్వీనర్ జాకీర్ హుస్సేన్, కో కన్వీనర్ భాస్కర్ , స్థానిక సెయింట్ ఆంథోని ప్రిన్సిపల్ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వరి వంగడం ఎన్ పి-8912 ప్రారంభం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : వ్యవసాయ రంగంలో అగ్రగామిగా పేరుగాంచిన నూజివీడు సీడ్స్ లిమిటెడ్ బుధవారం యూట్యూబ్ లైవ్ ఈవెంట్ ద్వారా తన కొత్త పరిశోధన వరి రకం ఎన్ పి-8912ని ప్రారంభించింది. ఈ వరి వంగడం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర లో రబీ సీజన్ లో సాగుకు అనుకూలం. నూజివీడు సీడ్స్ కంపెనీలోని అర్ అండ్ డి నిపుణులు ఎన్ పి 8912 సూపర్ ఫైన్ రైస్ వంగడన్ని అభివృద్ధి చేశారు. 113-118 రోజుల వ్యవధిలో సూపర్ ఫైన్ రైస్ గింజలు పక్వానికి వచ్చి అధిక దిగుబడిని అందించడం ద్వారా ఎన్ పి-8912 ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇది ఖరీఫ్, రబీ, వేసవి కాలల్లో సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఎన్ పి-8912 ఇతర స్వల్ప కాల రకాలతో పోల్చితే అధిక మొత్తంలో ప్రీమియం-నాణ్యత గల బియ్యాన్ని ఉత్పత్తి చేయగల సామర్థ్యంలో ప్రత్యేకమైనది. ప్రతి కంకికి 350 కంటే ఎక్కువ గింజలు మరియు 25 సెంటీమీటర్ల వరకు ఉండే పొడవాటి కంకులతో , రైతులు అధిక దిగుబడితో లాభాలు పొందుతారు. ఈ రకం వివిధ నేల రకాలు మరియు వాతావరణాలకు బాగా అనుగుణంగా ఉంటుంది. ఈ కార్యక్రమం లో నూజివీడు సీడ్స్ లిమిటెడ్ తరుపున శరత్ ఖురానా, చీఫ్ స్ట్రాటెజీ ఆఫీసర్, డాక్టర్ దేవేంద్ర కడియన్, ఆర్ అండ్ డి హెడ్, డాక్టర్ వర ప్రసాద్, రైస్ బ్రీడియింగ్ హెడ్, ఎన్. శ్రీనివాసరావు, క్రాప్ మేనేజర్ మరియు ఇతర మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

22న కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ ప్రారంభం

విశాలాంధ్ర -కాప్రా : ఈ నెల 22న ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ రెండవ ఫ్లోర్‌లో కామ్రేడ్ కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ పేరుతో సామాజిక అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ నిర్వహణ కమిటీ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ప్రారంభ ఆహ్వాన పత్రికను నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో విడుదల చేశారు. ఈ కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ ను తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ ముఖ్య అతిథిగా, సామాజిక రాజకీయ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య విశిష్ట అతిథిగా, డా. సోము మర్ల శాస్త్రవేత్త, సురేష్ మేడ్చల్ జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారన్నారు. ఈ సందర్భంగా కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ నిర్వహణ కమిటీ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కె.ఎల్ మహేంద్ర తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని, అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి హక్కులు సాధించటం జరిగిందన్నారు. సింగరేణి వర్కర్స్ యూనియన్ నుండి మొదలుకొని అంతర్జాతీయ కార్మిక ఉద్యమానికి నాయకునిగా ఎదిగాడన్నారు. ఈ అధ్యయన కేంద్రంలో పుస్తకాలతో పాటు రీడింగ్ హాల్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలతో పాటు ఇక్కడ సమాజంలో వచ్చిన మార్పులపై అనేక ఉద్యమకారులు, రచయితలు రాసిన పుస్తకాలను అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. పుస్తక ప్రియులు మరియు పరీక్షలకు ప్రిపేర్ అయ్యే యువత ఉపయోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్. శంకర్ రావు, నారా నర్సింహా, జీ. లక్ష్మీ నారాయణ, కె. ధర్మేంద్ర పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర -కొత్తూరు : నందిగామ పంచాయతీ శివారులో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం ప్రముఖ వ్యాపారవేత్త కృష్ణ కుమార్ బ్రదర్స్,(శివ శక్తి స్టీల్ అల్లయిస్ ఇండస్ట్రీస్,వీర్లపల్లి)అధినేత భారీ విరాళం రూ .10 లక్షలు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్తలు నవనీత్,సునీల్ లు మాట్లాడుతూ నందిగామ మండలంలోని అయ్యప్ప స్వామి దేవాలయం పునర్నిర్మాణం నిమిత్తం రూ,10 లక్షలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణంలో భాగంగా తమ వంతు విరాళం అంద చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం శ్రీ శ్రీ గిరీషన్ సతీషన్ నాయర్ గురుస్వామి చేతుల మీదుగా వారికి శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు. షాద్ నగర్ శాసనసభ సభ్యులు వీర్లపల్లి శంకర్ చొరవతో ఈ విరాళం అందజేసినందుకు నందిగామ అయ్యప్పస్వామి దేవాలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ జిల్లెళ్ల బాల్ రెడ్డి, బాతుక లక్ష్మయ్య యాదవ్ స్వామి, బంటారం దర్శన్ గౌడ్ స్వామి,వావిలాల హరి జీవన్ స్వామి,వంకాయల రాంరెడ్డి, పాలకొండ చంద్రశేఖర్ గౌడ్, సట్టి నవాజ్ రెడ్డి స్వామి,చిందం నర్సింహ,దేపల్లి కుమార్ గౌడ్,కొమ్ము కృష్ణ,జంగ నర్సింలు,తుమ్మల నరసింహులు యాదవ్,నర్సింహులు గౌడ్, బాంద్రపు జంగయ్య స్వామి, గౌడ్,చించేటి కృష్ణ గౌడ్,బి,కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50111వేలు విరాళం అందజేత

నందిగామ మండలం ,మేకగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సూక్యా నాయక్ బుధవారం అయ్యప్పస్వామి దేవాలయం పునర్ నిర్మాణం లో భాగంగ రూ. 50 వేల 111లు విరాళం శ్రీ గిరీషన్ సతీషన్ నాయర్ గురుస్వామి కి అందజేశారు.సూక్యా నాయక్ ను పూలమాలలు,శాలువాలతో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సత్తయ్య స్వామి,గోపాల్ యాదవ్ స్వామి,శ్రీకాంత్ స్వామి,డిక్షిత్ స్వామి,రమేష్ స్వామి లు పాల్గొన్నారు .

కర్నూలులో హైకోర్టు బెంచ్

- పర్యాటకానికి పరిశ్రమ హోదా
- జ్యుడిషియల్ ప్రివ్యూ యాక్ట్ రద్దు
- స్థానిక సంస్థల చైర్మన్లపై అవిశ్వాస చట్ట సవరణ
- ప్రధాన మంత్రి ఆవాస యోజన 2.0 ఎంవోయూకు ఆమోదం
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఎన్నికల హామీల్లో భాగంగా బెంచ్ ఏర్పాటుపై అవసరమైన చర్యలకు ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ టూరిజం నూతన పాలసీకి, పర్యాటక ప్రాజెక్టులకు పరిశ్రమ హోదా కల్పించే ప్రతిపాదనపై చర్చించి కేబినెట్ ఆమోదించింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు బిల్లుకు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో స్థానిక సంస్థల్లో చైర్మన్లపై అవిశ్వాసం పెట్టే అంశంపై చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఏపీ ఇన్‌ఫ్రా ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ 2019ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల చైర్మన్లపై అవిశ్వాసం పెట్టే గడువును నాలుగేళ్ల నుంచి రెండేళ్లకు కుదిస్తూ చట్ట సవరణ చేశారు. 2024- 25 కొత్త క్రీడా పాలసీని ఆమోదించింది. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ పేరును ఈగల్‌గా (ఎలైట్ యాంటీ నార్కటిక్ గ్రూప్‌గా) మారుస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కోసం గృహ నిర్మాణ శాఖ చేసుకోనున్న ఒప్పందానికి, ఏపీ టవర్స్ లిమిటెడ్‌ను ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌లో విలీనం చేసేందుకు ఆమోదించింది. ఏపీ టవర్స్ లిమిటెడ్‌కు చెందిన మూలధనం, ఆస్తులు, అప్పులు బదలాయిస్తూ ప్రతిపాదన చేశారు. నేరాలను నియంత్రించేందుకు పీడీ యాక్ట్ పటిష్టం చేస్తూ సవరణ బిల్లు, లోకాయుక్త చట్టసవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. లోకాయుక్త నియామకంలో ప్రతిపక్ష నేత లేనప్పుడు ఏం చేయాలనేదానిపై సమావేశం చర్చించింది. పార్లమెంటులో అనుసరించిన విధానం ఇక్కడ కూడా కొనసాగించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో రూ.85వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎస్ఐపీబీ నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేవాలయ కమిటీల్లో ఇద్దరు సభ్యులకు చోటు కల్పించేలా, అమరావతి సాంకేతిక కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న గంటల వ్యవధిలోనే బెంచ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు న్యాయ శాఖ కార్యదర్శి సునీత లేఖ రాశారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలు కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి హైకోర్టులో దాఖలయిన కేసుల వివరాలు ఇవ్వాలని న్యాయశాఖ కార్యదర్శి కోరారు. బెంచ్ ఏర్పాటు చేయాలంటే ఈ నాలుగు జిల్లాల నుంచి 1/3 కేసులు ఉండాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర మొత్తం జనాభాలో 4.95 కోట్లు ఉండగా అందులో రాయలసీమలో రీజియన్‌లో 1.59 కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు. అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో 25 శాతం మంది ఈ రీజియన్‌లో ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. హైకోర్టులో ఈ రీజియన్ నుంచి వచ్చిన కేసుల్లో రెండు లేదా మూడు ఏళ్ల కంటే పెండింగ్‌లో ఉన్న వివరాలు కూడా ఇవ్వాలని అధికారులు కోరారు. దీనిపై సమగ్ర సమాచారం ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను న్యాయ శాఖ కార్యదర్శి సునీత కోరారు.

సూపర్ 6 హామీల వైఫల్యం

అప్పులపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం

వైసీపీ అధినేత జగన్ ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర అప్పులపై చంద్రబాబు పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారని, సూపర్-6 హామీల అమలులో వైఫల్యంతోనే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఆరు నెలల్లోనే కరెంటు బిల్లులు బాదుడే బాదుడు మొదలైందని, మొత్తంగా రూ.18 వేల కోట్లు ప్రజలపై భారం వేయనున్నారని తెలిపారు. గ్రామీణ రహదారుల మీద టోల్ వసూలుకు సిద్ధమవుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జగన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేజీ నెం.14, 16 రెండు పేజీలు చూస్తే... రాష్ట్ర అప్పులు 2018-19 నాటికి రూ.2.57 లక్షల కోట్లు అని చూపారని, దానికి ప్రభుత్వ గ్యారెంటీ రూ.55 వేల కోట్లు కూడా కలిపితే అప్పటికి రాష్ట్ర అప్పు మొత్తం రూ.3.13 లక్షల కోట్లు అని వివరించారన్నారు. అలాగే 2024లో వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న అప్పులను అదే పేజీలో చూపారని, అప్పులు రూ.4.91 లక్షల కోట్లకు ఎగబాకాయని, ప్రభుత్వ గ్యారెంటీ అప్పులు మరో రూ.1.54 లక్షల కోట్లు, రెండూ కలిపితే మొత్తం అప్పు 6.46 లక్షల కోట్లు అని తేల్చారన్నారు. అది బడ్జెట్‌లోనే కాకుండా 2023-24లో కాగ్ రిపోర్ట్ (పేజీ నెం.18. 20)లో చూపారని తెలిపారు. అందుకే మరోసారి చంద్రబాబును అడుగుతున్నామని, అయ్యా, అబద్ధాల చెప్పడం ధర్మమేనా? రూ.10 లక్షల కోట్లు, రూ.12 లక్షల కోట్లు... చివరకు ఎన్నికల నాటికి రూ.14 లక్షల కోట్లు అని చెప్పడం ధర్మమేనా? చంద్రబాబు, ఆయన అనుకూల ఎల్లో మీడియా అదే దుష్ప్రచారం చేస్తూ... ఒక వ్యవస్థీకృత నేరం చేశారని జగన్ ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. అందులో చిన్న హామీలైన గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సుపై ఒక్కొక్కరూ ఒక్కో మాట మాట్లాడుతున్నారని చెప్పారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఆరు నెలలైనా ఇంతవరకూ ఒక్క పోస్టూ ప్రకటించలేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీలో ఏప్రిల్ 1 నుంచి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, 108, 104 సర్వీసుల సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు లేవని చెప్పారు. అసైన్డ్ భూములపై విష ప్రచారం చేస్తున్నారని జగన్ ఖండించారు. ఇసుక, మద్యంలో అక్రమాలు, అవినీతి పెరిగిపోయిందన్నారు. వలంటీర్లను దారుణంగా మోసగించారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై కేసులు, అరెస్టులు, వేధింపులకు పాల్పడటాన్ని ఖండించారు. చంద్రబాబూ... మా కుటుంబంలో విభేదాలు ఉండొచ్చు అని, కానీ నీవు పెట్టే పోస్టులు కానీ, నువ్వు చేసే క్రూరమైన రాజకీయాలు ఎవరూ చేయరని, నీకూ కుటుంబం ఉందన్న విషయాన్ని గమనించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యుద్ధంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు జగన్ బదులిస్తూ... పోలవరం ప్రస్తుత పరిస్థితికి కారణం చంద్రబాబేనని విమర్శించారు. స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు ప్రమేయం లేకపోతే ఆయనతో పాటు అందులో ప్రమేయం ఉన్న వారిని ఈడీ ఎందుకు అరెస్టు చేసిందని ప్రశ్నించారు.

నూతన ఆలోచనలకు పుస్తక పఠనం దోహదం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: పుస్తకాలు చదవటం వలన మనిషిలో జ్ఞానం, క్రమశిక్షణ, వికాసంతో పాటు కొత్త ఆలోచనా విధానాలు పుట్టుకొస్తాయని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను బుధవారం ఆయన సందర్శించారు. బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాస్, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు (డీబీఎఫ్) కొరివి వినయ్ కుమార్, సీనియర్ పాత్రికేయులు ఈమని హనుమంతరావు, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, అంబేద్కర్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెల్సన్‌బాబు, చంద్రా నాయక్, వెంకటరెడ్డిలతో కలిసి వివిధ రకాల పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రచురణ సంస్థలలో విశాలాంధ్ర సంస్థ మేటి అని అన్నారు. పుస్తకాల ప్రాముఖ్యతను తమ పిల్లలకు తెలియజెప్పాలని తల్లిదండ్రులకు సూచించారు. మంచి సమాజానికి పుస్తకమే ప్రధాన దిక్సూచి అని అన్నారు.

విశాఖ డెయిరీ అవకతవకలపై హౌస్ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ డెయిరీ సహకార రంగం నుంచి కార్పొరేట్ రంగంగా మారడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కంపెనీ చట్టానికి మార్చడం వల్ల అవినీతికి దారితీసిందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ 2 వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న డెయిరీ నష్టాల బారిన పడటానికి అవకతవకలే ప్రధాన కారణమని ఆరోపించారు. రెండున్నర లక్షల పాడి రైతుల జీవితాలను అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఒకే కుటుంబానికి చెందినవారేనని, వారే ట్రస్టు ఏర్పాటు చేసి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని పల్లా తెలిపారు. తక్కువ ధరకు పాలను కొనుగోలు చేసి, మార్కెటింగ్ చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారు. సహకార రంగం పేరుతో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందిన వారు, 2006లో కంపెనీ చట్టం కింద మార్పు చేసుకొని ఆస్తులను కాజేశారని ఆరోపించారు. టీడీపీ సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ డెయిరీని సహకార రంగం నుంచి కార్పొరేట్ చట్టంలోకి మార్చి వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారని, వందల కోట్ల విలువైన ఆస్తులను కాజేసి, నాలుగు రాష్ట్రాల్లో అక్రమ ఆస్తులు ఏర్పరుచుకున్నారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం కేటాయించిన భూములు, నిధులు అన్నీ అక్రమ మార్గాల్లో ఉపయోగించారని, విపరీతంగా బినామీ వ్యవస్థతో డెయిరీ ఆస్తులను మాయం చేశారని ఆరోపించారు. జగన్‌మోహన్ రెడ్డి ఇసుక కుంభకోణం కన్నా విశాఖ డెయిరీ కుంభకోణం పెద్దదిగా ఉందని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 2004లో కో ఆపరేటివ్ ట్రిబ్యునల్ కంపెనీకి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం హైకోర్టులో కేసు నడుస్తోందని వివరించారు. పాల ధర తగ్గించడం, దాణా ధర పెంపు వంటి చర్యలు రైతులకు అన్యాయం చేస్తాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. సభా కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెనాయుడు ప్రతిపాదించగా, అందరి సమ్మతితో స్పీకర్ ఆమోదం తెలిపారు.

అంతా మా ఇష్టమే...

స్కూల్ గేమ్స్ బాక్సింగ్ టోర్నీ వివాదాస్పదం

విశాఖపట్నం, విజయనగరం బాక్సర్లే విజేతలు

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్: కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల నిర్వహణ తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. పోటీల నిర్వహణలో నిర్వాహకులు బాక్సింగ్ ఫెడరేషన్ నిబంధనలను ఏమాత్రం పాటించలేదు. ఇదంతా ఎవరో ప్రైవేటు వ్యక్తులు చేశారనుకుంటే అది పొరబాటు. సాక్షాత్తు ప్రభుత్వం నియమించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా విభాగం నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా పోటీలను నిర్వహించి, విశాఖపట్నం, విజయనగరం బాక్సర్లకు అనుకూలంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోటీలు నిర్వహించేది మేము. మా ఇష్టం వచ్చినట్టు ఆడిస్తాం. టెక్నికల్ నిబంధనలతో సంబంధం లేదు. మాకు అనుకూలంగా ఉన్న వారిని విజేతలుగా ప్రకటించేందుకు ఎక్కువ సమయం ఆడిస్తాం. మిగిలిన వారికి అంత సమయం ఇవ్వం. ఎవరికి చెప్పుకున్నా మా విధానం ఇంతే అంటూ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ -14 బాలుర, అండర్ -17 బాలబాలికల విభాగాల బాక్సింగ్ పోటీలను నిర్వాహకులు ఏకపక్షంగా నిర్వహించారు. మచిలీపట్నం పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించటం చర్చనీయాంశమైంది. సాధారణంగా అన్ని క్రీడల్లోనూ బాక్సింగ్ ఆట విభిన్నంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన నిబంధనల ప్రకారం ప్రత్యేక నిపుణుల (క్వాలిఫైడ్ టెక్నికల్ అఫీషియల్స్) పర్యవేక్షణలో మాత్రమే పోటీలను నిర్వహించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా పోటీలు జరిగాయి. ప్రత్యేక బాక్సింగ్ రింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా, షామియా బల్లలతో వేదికను ఏర్పాటు చేసి, దానిపై రెడ్ కార్పెట్‌ను పరిచే దానినే రింగ్‌గా చూపించడంపై బాక్సర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 500కుపైగా బాక్సర్లు హాజరయ్యారు. పోటీ మధ్యలో బాక్సర్లు రింగ్‌లో పడిపోయినా ప్రమాదం జరగకుండా ఉండేందుకు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన రింగ్‌ను వాడాల్సి ఉంటే, షామియానా బల్లలతో రింగ్‌ను ఏర్పాటు చేయడం నిర్వాహకుల పనితీరుకు అద్దం పడుతోంది. దీనిపై పలు జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ పోటీల నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్లినా వారి నుంచి ఎలాంటి స్పందనలేదని వాపోయారు.

ప్రమాణాలు పాటించని స్కూల్ గేమ్స్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో జరిగే మ్యాచ్ ల నిర్వహణకు కొన్ని అర్హత ప్రమాణాలు ఉంటాయి. మ్యాచ్ రిఫరీలు, న్యాయనిర్ణేతలు, జ్యూరీ లను ఎంచుకునే విధానంలో కొన్ని అంశాలు పరిశీలించాల్సి ఉంది. అటువంటిది ఏమీ లేకుండా, అనుభవం లేని వారిని, నిషేధిత జాబితాలో ఉన్న రాష్ట్ర బాక్సింగ్ సంఘం అధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించడమే ఆరోపణలకు ప్రధాన కారణం. బాక్సింగ్ మాచ్‌ల నిర్వహణలో కీలకమైన పాత్ర టెక్నికల్ కమిటీదే. బాక్సర్లు ఎలా ఆడుతున్నారు, ఏ విధంగా విజయాన్ని నిర్ణయించాలి అనే అంశాలపై పూర్తి అవగాహన ఉండాలి. దానిని పరిశీలించాల్సిన బాధ్యత టెక్నికల్ కమిటీపై ఆధారపడి ఉంటుంది. అలాంటి టెక్నికల్ కమిటీ నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. సాధారణంగా మ్యాచ్ ఒక రౌండ్ రెండు నిమిషాలు, ఒక నిమిషం రెస్ట్ ఇవ్వవలసి ఉంటుంది. ఇలా మూడు రౌండ్లను నిర్వహించి అత్యధిక పాయింట్లు సాధించిన బాక్సర్ ని విజేతగా ప్రకటిస్తారు. కానీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లో విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన బాక్సర్లను మాత్రమే విజేతలుగా ప్రకటిస్తూ మిగిలిన జిల్లాల బాక్సర్లను 20 సెకండ్లు కూడా ఆడించకుండా ఓడిపోయినట్లు ప్రకటించడం వివాదస్పదంగా మారింది. స్కూల్ గేమ్స్ అధికారుల నిర్ణయాలను సైతం పక్కనపెట్టి వారి సొంత నియమావళితో టోర్నమెంట్ నిర్వహించటం విమర్శలకు బలం చేకూర్చింది. క్రీడాకారులకు పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులకు అధికారికంగా పోస్టింగ్ ఇవ్వాలి. అలా ఇవ్వని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ విజయ రామరాజు ఉత్తర్వులు జారీ చేసినా ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టుకు సంబంధించి ఎటువంటి వ్యాయామ ఉపాధ్యాయులను కోచ్ లుగా అధికారికంగా పోస్టింగ్ ఇవ్వకుండా టోర్నమెంట్ నిర్వహించారు.

వలంటీర్ల వ్యవస్థ లేదని ప్రకటించడం సిగ్గుచేటు

మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: శాసన మండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రకటించడం సిగ్గుచేటని, ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎన్డీఏ కూటమికి వలంటీర్లు వ్యవస్థ లేదనే విషయం తెలియదా? అని ఆంధ్ర ప్రదేశ్ వలంటీర్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు ప్రభుత్వాన్ని నిలదీశారు. మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక లెనిన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం 2,60,000 మంది వలంటీర్లకు న్యాయం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ గురించి సరైన పద్ధతి ప్రకారం నియామకాలు చేయకపోతే ఇచ్చిన హామీ ప్రకారం ఉన్న వలంటీర్లను కొనసాగిస్తూ వాళ్లకు ఉద్యోగ భద్రత కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని కోరారు. గత ఐదు నెలలు బకాయిలు చెల్లించాలని, రూ.10 వేల గౌరవ వేతనం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వలంటీర్లను మానవతా హృదయంతో కొనసాగిలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ వలంటీర్ అసోసియేషన్ నాయకులు ఆర్.మమత, సరోజిని, పి.రాజ్ కుమార్, షేక్ అబ్దుల్ ఖాదర్, జిలానీ, వి.విజయ దుర్గ, కె.రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి లంకే సాయి, సిహెచ్ శ్రీధర్, శీరం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కౌలురైతు చట్టం అవశ్యం

కేరళ తరహా రుణ ఉపశమనం

రైతు సంఘాల నేతల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాగుసాయం అందించాలని, అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులు... కౌలురైతుల పంట రుణా లను మాఫీ చేయాలని, కౌలురైతుల రక్షణ, సంక్షేమం కోసం సమగ్రమైన కౌలు చట్టం తీసుకురావాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ఆయా రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందారావు, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు బుడ్డి రమేశ్, జిల్లా నాయకుడు చెరుకూరి సుబ్బారావు, పర్చూరు అజయ్, పత్రి హరికృష్ణ తదితర ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబీ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్వర్యంలో ధర్నా జరిగింది. పల్నాడు జిల్లా కలెక్టర్‌కు రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఉలవలపూడి రాము వినతిపత్రం ఇచ్చారు. దేగా ప్రభాకర్, పి.జమలయ్య, యలమందారావు, బుడ్డి రమేశ్, ఉలవలపూడి రాము అధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. చెరుకూరి సుబ్బారావు, పరచూరి అజయ్, పత్రి హరికృష్ణ హాజరయ్యారు. నేతలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రైతులను మోసగిస్తోందన్నారు. తక్షణ సాయం కింద రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో ప్రతి రైతు కుటుంబం రూ.2.45 లక్షల అప్పుల్లో కూరుకుపోయిందని, నిత్యం ఏదో ఓ చోట రైతులు, కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని రక్షించాలంటే కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం సంపూర్ణంగా అందలేదని, పంట రుణాలన్నీ మాఫీ చేయాలని కోరారు. పోలవరంతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ తదితర జిల్లాల్లో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. 40 వేలకు పైగా చెరువులు ఆక్రమణకు గురై, మరమ్మతులకు నోచుకోలేదని చెరువుల పునర్జీవంపై సీఎం చంద్రబాబు దృష్టి కేంద్రీకరించాలన్నారు. కౌలురైతుల రక్షణ, సంక్షేమానికి సమగ్రమైన చట్టం తీసుకొస్తామని, వాగ్దానం చేసినా, అమలులోకి రానందున తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే చట్టం తీసుకురావాలని కోరారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.1.6 లక్షల వరకు ష్యూరిటీ లేని పంట రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. రబీ పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. చింతలపూడి ఎత్తిపోతల నిర్మాణం వెంటనే చేపట్టాలని, ఎన్టీఆర్ జిల్లాలో ఎత్తిపోతలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, క్వింటా పత్తికి రూ.పదివేలు మద్దతు ధరప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది కొబ్బరికాయ కొట్టే ప్రాజెక్టా?

కడప స్టీల్‌పై షర్మిల

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కడప జిల్లా అభివృద్ధికి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలల ప్రాజెక్టు కడప ఉక్కు ఫ్యాక్టరీని పూర్తి చేయకపోవడంలో కేంద్ర-రాష్ట్ర పాలకుల అసలత్వం స్పష్టమైందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. ఇది కొబ్బరికాయ కొట్టే ప్రాజెక్టుగా మిగిలిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రాజెక్టు నిర్మాణానికి ముందడుగు వేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి వినతిపత్రాన్ని షర్మిల బుధవారం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఆక్షేపిస్తూ కొబ్బరికాయలు కొట్టి నిరసన తెలిపారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు కాబట్టి ప్రత్యేక హోదా రాలేదని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇంతవరకు విభజన హామీలు నెరవేర్చకపోగా స్టీల్ ఫ్యాక్టరీని అటకెక్కించిందన్నారు. పదేళ్ల నుంచి బీజేపీతో అంటకాగుతున్న సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ స్టీల్ ఫ్యాక్టరీ విషయంలో ఏ మాత్రం ప్రగతి సాధించలేదని విమర్శించారు. 2014లో చంద్రబాబు నాయుడు... 2019లో జగన్‌మోహన్‌రెడ్డి కొబ్బరికాయలతోనే సరిపెట్టారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన భూమి రుణం తీర్చుకుంటానని భారీ డైలాగులు చెప్పారు కానీ తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. జిందాల్‌కు స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అప్పగిస్తున్నామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. సజ్జన్ జిందాల్‌పై కాదంబరి జెత్వానీ కేసు పెడితే బాధితురాలిపై కేసు పెట్టి జైలుకు పంపిన చరిత్ర జగన్‌దని అన్నారు. పదేళ్లుగా కడప ఎంపీగా ఉన్న వైఎస్ అవినాశ్ రెడ్డి కూడా స్టీల్ ఫ్యాక్టరీని పట్టించుకోలేదని విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి స్టీల్ ప్లాంటును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఎందుకు అసెంబ్లీకి వెళ్లడం లేదని... స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం, సూపర్‌సిక్స్ హామీలు, ఇతర ప్రభుత్వ వైఫల్యాలపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళతానంటూ కాలయాపన చేయడం తగదని హితవు పలికారు. అవినాశ్ రెడ్డి ఆదేశాలతోనే సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టారని తెలిసినా పోలీసులు ఎందుకు ఆయనను... సజ్జల భార్గవ్‌రెడ్డిని అరెస్టు చేయరంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తంచేశారు. కడప స్టీల్ ఫ్యాక్టరీ కట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, ఆమరణ దీక్షకైనా సిద్ధమేనని షర్మిల హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ విజయజ్యోతి, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, పులివెందుల సమన్వయకర్త ధృవ కుమార్‌రెడ్డి, గోర్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.